సెప్టెంబర్ 01-15, 2022
సంపుటి 02, సంచిక 22

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో... (సెప్టెంబర్ 5)



ప్రజా కవి, పద్మవిభూషణ్

# కాళోజి నారాయణ రావు

(జయంతి : సెప్టెంబరు 9, 1914)

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక





44 పత్తిపాక మోహన్ బాల సాహిత్య రచన గురించి చర్చిస్తున్న **వెల్దండి శ్రీధర్ "బాలల తాతా బాపూజీ"** వ్యాసంలో



23 సినీ మాయాలోకంలో ఒక స్త్రీ ఆర్తిని చిత్రించిన **జడా సుబ్బారావు** కథ **"మూనెలేని దీపాలు"**



11 ప్రకృతి ప్రేమికుల కోసం **సుందర్‌లాల్ బహుగుణ** జీవితాన్ని చిత్రించిన **మాణిక్యం**



31 పిల్లల సాహిత్యం గురించి భాష గురించి వి ఆర్ శర్మ ముచ్చట్లు **బాల సాహిత్యం** వ్యాసం



05 **భౌతిక ప్రేమ** పరతత్వానికి సమన్వయం చేసిన **పట్టాభి రామశర్మ** నాటి కథ



35 **మానవ సంబంధాలలోని స్వాభావికతను చిత్రించిన అయోధ్య రెడ్డి** కథలను పరిచయం చేసిన **జయంతి**



13 కొత్త, పాత మూఢనమ్మకాల వల్ల కదిలిపోయిన ఒక మనిషి కథను చిత్రించిన **కుంతి** కథ... **"పంది కొక్కులు!"**



19 రేపటి తరానికి నేటి సాహిత్య స్వభావం తెలియాలని అభిలషించిన **ముదిగంటి సుజాతా రెడ్డి**తో **ఉప్పల పద్మ** ముఖాముఖి

పై నుంచి నాయనా అని పిలుస్తున్న అమ్మను తలుచుకునే **అనుముల ప్రభాకరాచారి** కవిత **"అమ్మ నవ్వు"**... పేజీ 04

నది పాదముద్రలని ఒడిసి పట్టుకోవా లంటున్న **దాసరాజు రామారావు** కవిత **"నది తీరమ్మీద"**..... పేజీ 02

తెలంగాణలోని గ్రామీణ భాషను తవ్వితీస్తున్న గంధం **విజయలక్ష్మి** కథ **"సిదానం సీకులు"**..... పేజీ 31

ప్రకృతి చరణం వర్ష స్వరం అని చెప్తున్న **జయపాల్ రెడ్డి** కవిత **"గగనస్వరం"**... పేజీ 40

**కొమురవెల్లి అంజయ్య** కథలలో కొలువుదీరిన మానవత్వాన్ని చిత్రించిన **వేణు నక్షత్రం**... పేజీ 27

నాటి కాలంలోని జీవన రేఖల్ని చిత్రించిన **నాటి కాలం కవులు,** నాటి కవిత... పేజీ 10

**నిరాడంబర సాహితీ సృజన కారుడు చింతలపూడి**ని పరిచయం చేసిన **అమ్మిన**... పేజీ 39


**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత

# నదీ తీరమ్మీద



దాసరాజు రామారావు

తీరమ్మీద ముద్రపడ్డ అడుగులు
నది తుంపర తడికి మేల్కొంటున్నాయి
ఆ పాదాలెవరివో, ఆ పాదముద్రలెవరివో
నది కెరుకే, తన అలల పుటల్లో లిఖించుకొంటుంది
తీరాన్ని తాకిన ప్రతి పేరుని -
కొన్ని ముద్రలు అట్లా తాజాగా
నిలిచిపోతయి అప్పుడే వదిలినట్లు -
కొన్ని మరణించి, తిరిగి జీవం పోసుకుంటయి
చాలా ముద్రలు అనామకంగా
ఒక్క అల విసురుకే చెదిరి,
మళ్ళా కనిపించవు,
నదికి అన్నీ తెలుసు
కాలాన్ని వడకట్టుకుంటూ నిద్రని మరచిపోతుంది
తుఫానుల తాండవాలో,
మనిషి చేసే క్రూరకృత్యాల ఆర్తరవాలో నదిని
ప్రశాంతంగా వుండనీయవు
పాదస్పర్శల అలజడి కూడా -
పాదముద్రల్ని ముద్దాడటమో,
కోపంగా ముంచి వేయటమో
నదికి ఇష్టమైన పని
ఉదయపు లేతెండ, సాయంకాలపు నీరెండ,
వెన్నెల రాత్రుల హాయితనం
తీరం సొగసులు, సంపదలు-
వెలితితో చేరిన మనిషికి
గంపెడు భరోసా శ్వాసలు నింపుతది
కన్నీళ్ళతో తీరం వెంట నడచిన పాదాలకు
ఇసుకలో వెన్నెల మడుగులు కన్పిస్తయి
నదీతీరమొక ఆనందాల శయ్య, నమ్మకాల గని,
జనన మరణాల బతుకుకు
ఉదయాస్తమయాల సుదీర్ఘ,
సాంత్వన నిచ్చే స్వాగత లేఖ రాసి పెట్టిందెపుడో
గవ్వ పెంకులు, చిట్టి శంఖులు
సన్నటి యిసుకలో ఏ మానవమాత్రులు కోల్పోయారో
వాటితో పాటు పురుడు పోసుకోని కలల క్షతగాత్రుల్ని సైతం-
చేజారినవి, చేజార్చుకున్నవి తీరం మీద అయితే
నది ఎప్పుడో ఒకప్పుడు కొన్నయినా వెంటగొని తెచ్చిస్తది
ఇసుకదీ మృదుల హృదయమే
రెండు చేతులతో ఏ రూపాన్ని అద్దినా ఇట్లే ఒదిగిపోతది
అప్పుడప్పుడు గగనమూ నదీ గంభీర
మౌన సంభాషణలో మునిగిపోయినప్పుడు
పాదముద్రలు చెవులు రిక్కించి వింటయి
ఉత్తేజితాలవుతుంటయి

నది ఉద్వేగాలని వొడిసి పట్టుకోవాలని
తీరం సౌందర్యాలని తీర్చి దిద్దుకోవాలని
పాదముద్రల్లో పరకాయ ప్రవేశం చేయాలని
కొన్నాళ్ళకు
తీరం మీద నేనొక పాదముద్రనై, కాంతిముద్రగా
మిగలాలని...



సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 సెప్టెంబర్, 2022

సంపుటి 02 సంచిక 22



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# జాతీయత ఉప్పొంగిన వజ్రోత్సవం

ఇప్పుడు అటు దేశంలోనూ, రాష్ట్రంలోనూ వజ్రోత్సవాల సందడి రాజ్యం చేస్తున్నది. తెలంగాణలోని ఆబాలగోపాలం ఈ ఉత్సవాలలో పాల్గొన్నది. దేశభక్తి, జాతీయవాదం, ఉరకలు వేసినవి. జాతీయ స్ఫోరకభావజాలంతో కవికుమారుల కలాలు కదం తొక్కాయి. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సాహిత్య అకాడెమి కవిసమ్మేళనం 75 మంది కవులతో 75 ఏళ్ళ వజ్రోత్సవ భారతాన్ని నిర్వచించింది. తెలంగాణ జాగృతి 3 రోజులు బాల కవిసమ్మేళనం జరిపి జాతి భావనను బాలబాలికలల్లో ప్రోది చేసింది. సాంస్కృతిక అభినివేశం తెలంగాణ అంతటా వెల్లివిరిసింది.

నాడు భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న నాయకులను జాతీయభావాన్ని రగిల్చిన కవుల్ని జాతి జాతంతా స్మరించుకోవలసిన సందర్భం ఇది.

బంకించంద్ర 'వందేమాతరం', రవీంద్రనాథ్ ఠాగూర్ 'జనగణమన' ప్రార్థనా గీతాలుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. రవీంద్రనాథ్ ఠాగూర్ "Where the Mind is Without Fear" అనే పోయెం ప్రథమంగా చెప్పుకోవాలి.

"Where the mind is led forward by thee into ever-widening thought and action -

Into that heaven of freedom, my Father, let my country awake"- అనే గీతంలో గొప్ప స్వతంత్రేచ్ఛ స్ఫురిస్తుంది. జాతీయ భావజాలం ప్రోదిచేసిన సరోజినీనాయుడు రాసిన The golden threshold", "The Bird of Time" చాలా గొప్ప కవితలు. ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించిన శ్యాంలాల్ గుప్త. గజల్ కవి హసరత్ మోహనీ. బరోడాలో ప్రజాసేవ చేసిన కవి అరబిందో. ఇట్లాగా ఎందరినైనా పేర్కొనవచ్చు. ఇక తెలుగు సాహిత్యంలో రాయప్రోలు, గురజాడ, విశ్వనాథ, జాషువా, తుమ్మలతో పాటు తెలంగాణలో దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, సుద్దాల హనుమంతు లాంటి కవులెందరో తెలంగాణ జాతిభావం సుసంపన్నం చేశారు. "ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళ కలయిక" అని ఎలుగెత్తిన మరో మహాకవి కాళోజి. 'నా గొడవ' అన్న ఆయన కావ్యంలో సమాజం గొడవ తన గొడవగా వ్యక్తీకరించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 9న ఆయన జన్మదినం స్వతంత్ర తెలంగాణ సగర్వంగా జరుపుకొంటున్నది. వజ్రోత్సవానికి అనుసంధానం చేయదగిన మరో పండుగ సెప్టెంబర్ 5, ఉపాధ్యాయ దినోత్సవం. విద్యావంతుడు, భారతరత్న బిరుదాంకితుడు, మాజీ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పేరుమీద జరగడంతో ఇది కూడా జాతీయ పర్వదినంగా నిలిచింది.

బాలప్రాయంలోని విద్యార్థులలో దేశభక్తి, సామాజిక చింతనలాంటి భావాలకు బీజవాపన జరగాలి. పసితనంలో ఏ విషయంగా వాళ్ళ మనసులో శ్రద్ధ అంకురిస్తుందో అదే క్రమవికాసం చెందుతుంది. వాళ్ళకు అట్లాంటి స్ఫూర్తి కలిగించవలసింది కేవలం అధ్యాపకులే. నిజానికి సమాజగతిని ఉపాధ్యాయుడే నిర్దేశిస్తాడు. ఉపాధ్యాయుడు మూర్తీభవించిన జ్ఞానంలాగా ఉంటే అతని బోధనే దేశానికి కరదీపిక అవుతుంది.

ఉపాధ్యాయ దినోత్సవం కాళోజి జన్మదినోత్సవం వజ్రోత్సవాలలో భాగంగా రావడం ఒక ఆహ్లాదపరచే పరిణామం. "సంబరపడగానే సరిపోదోయ్" అన్న మహాకవి మాట కూడా ఈ సమయంలో స్మరించుకోవాలి. మనం ఆదర్శాలుగా చెప్పుకునే, ఆర్థిక సమానత, స్త్రీపురుష సమానత్వం, కులనిర్మూలన లాంటివి పూర్తిస్థాయి సాకారం చేసుకుంటేనే జాతీయ ఉత్సవం పరమార్థమైనా నెరవేరుతుంది. భారత సమాజం ఆ వైపు అడుగులు వేయవలసిందిగా కోరుకుందాం.

జై జాగృతి, జై తెలంగాణ.

కవిత

# అమ్మ నవ్వు



అనుముల ప్రభాకరాచారి, 9676549963

కొండ నల్లగయిందంటె నాకిష్టం
ఇంటికిరాని మేకపిల్లనో
గూట్లె కమ్మమని
కోడిపిల్లల్నో
తోలుకొని రమ్మంటదని
వానల తడువొచ్చని

బస్తకొప్పెర
నెత్తిక్కట్టి, సవుడుతొక్కి రమ్మనేది
మిద్దె.. పొక్కబడ్డ దగ్గర, బస్తపక్కకేసి..
పొక్కకూడిపొచ్చెటోన్ని,
ఎందుకు తడిసినవని అమ్మ

వున్న కొద్ది ఇంటెనుక జేగల్నే,
దొండ, బచ్చలి, పొట్లకాయ తీగలు,
పెసర, పచ్చిమిర్చి, పల్లికాయ, మొక్కజొన్న కంకులు
కాపిచ్చేది,
పొలాలున్నోళ్ళు తింటుంటే
మొకం చూడొద్దు నా పిల్లలు అనుకునేది,
ఎకరంపొలంల ఏకాలానికాకాలం కాసే,
పంటల్ని.. మంచమంత జేగల్నే
పెంచేది మా అమ్మ, అటు వాన
పడుతుంటె... ఇటు బాపు బంగారం
కరిగే కుంపట్ల కాల్చిచ్చేది కంకులు

నేనెంత పాడుబడ్డోన్నో, ఆమె
నోట్లేసుకోవడం ఒక్కసారన్న
చూసిన పాపాన పోలేదు నేను

మబ్బులెల్లి పొయినట్లే,
ఆ రకరకాల మొక్కలూ పొయినయ్,
మేం పెద్దయినవనుకున్నవేమో,
మా కడుపు నింపే అవసరం
లేదనుకొని అమ్మా వెళ్ళిపొయింది

ఇప్పుడు ఏ పచ్చని మొక్కను
చూసినా అమ్మే కనిపిస్తుంది.
నవ్వుద్దే తప్ప ఏదన్న తింటున్నట్లసలే
కనిపించదు, పైనుంచి తిన్నవా నాయనా
అంటున్నట్ల మొకం పెట్టది.
గిన్ని నీళ్ళయినా అడుగదు
నా కన్నీళ్ళను దోసిళ్ళతో
పట్టిద్దామనుకుంటె



నాటి కథ

# అన్వేషణ

అనుభూతులకు మరో కోణాన్ని
వర్ణించిన నాటి కథ...

గొల్లపల్లి పట్టాభిరామ శర్మ

"దేవి నవరాత్రులకు నీలవేణిని పిలిపిస్తామన్నారట, నీకేమన్న తెలుసా సూరయ్యా?" వీధి మలుపు తిరుగుతూంటే అవధాన్లు కలిసి ప్రశ్నించాడు. సూరయ్యకు భోగంవాళ్ళతో బాగా పరిచయం ఉందనీ, నీలవేణిని గూర్చి అడిగాడు అవధాన్లు.

"మునసబు నరసింహయ్య బావ నడగలేక పోయావా, అయినా రేప్పొద్దుట మెయిల్‌కే వస్తుందట" కాస్త ఈసడింపుగానే అన్నాడు సూరయ్య.

పాపం అవధాన్లు ఆవగింజంత ముఖం చేసుకొని వెళ్ళిపోయాడు.

సూరయ్య స్వచ్ఛమైన బ్రాహ్మణ కులంలోపుట్టాడు. చిన్నప్పటినుంచి అతి గారాభంగా పెరిగి, అంతకంటే మొండిగా, అభివృద్ధి చెందాడు. తండ్రి ఎంత చెప్పినా వినకుండా సంస్కృతానికి స్వస్తిచెప్పి కాలేజీ చదువులకు నెల్లూరు వెళ్ళాడు.

నెల్లూరు నెరజాణలకు సుప్రసిద్ధ నగరం. మనవాడికి చదువులేమంత గొప్పగా అంటకపోయినా పోకిరి తిరుగుళ్ళతో పోచుకోలురాయుడై బేడిసకంటి వంకరటింకర్లకు కింకరుడై బాపిరాజుగారి కొంటె కోణంగిని మించి బుచ్చిబాబుగారి నిరంతర త్రయంలోంచి వేరుపడి చైతన్యప్రవంతిలో అచేతనుడై పానుగంటి సాక్ష్యాధారాలతో తిరిగి సజీవుడై, చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు, "జననీ జన్మభూమిశ్ఛ" అంటూ పల్లెకొంపలో స్థిరపడ్డాడు.

ఆధునిక సాహితీ స్వరవిపంచిలో సూరయ్య కూడా ఒక స్వరం. ఒక తంత్రి. భావకవిత్వం ఇట్టే వ్రాస్తాడు. బుధారాధన విరాజి తిక్కన సోమయాజి జన్మస్థలం కదా! స్పర్శ మాత్రం చేతనే కవిత్వం పుట్టుకొచ్చి, దస్తాలు, రీములూ నింపెయ్యడూ!

సూరయ్య కేవలం వట్టి కవియే గాకుండా మంచి రసికుడు కూడాను. అయ్యయ్యో... ఆమాత్రం తెలీదటండీ. సుకవిరాజనాథ శృంగారరసనాథ, శ్రీనాథుల వారు నెల్లూరుకు రాలేదుటండీ. ఆ రసిక వతంసుడు చుట్టని పల్లె అంటూ ఉందా...

శుద్ధరసికుడే కాకుండా పచ్చిసంస్కారి. అతనికి పెళ్ళి కాకుండా ఉంటే వీరేశలింగంగారి సమాజంలో దూకి, విధవ వివాహాలు వద్దన్నా ఎన్నో చేసుకునేవాడు.

అలాంటి భాగ్యానికి నోచుకోనందుకు పంతులుగారికి జయంతినాడు శ్రద్ధాంజలి తోపాటు, ఈషత్ సంతాపాన్ని కూడా గాఢంగా, మౌనంగా తెలియపరుస్తాడు.

సూరయ్య కొత్తలో ఊరికి వచ్చినప్పుడు తననంతా వెలివేసినట్టు ఆఫ్రికా మృగాన్ని చూచినట్టు చూస్తూండేవారు జనం. సాయంత్రం పూట, ఉంగరాల జుత్తుని నున్నగా దువ్వుకొని, గోల్డ్‌ఫ్లేక్ పాకెట్‌లోంచి చార్‌మినార్ సిగరెట్ తీసి ముట్టించి బెంగాలి గ్లాస్కోపంచె, వాలుగోచి పెట్టి, కిర్రుస్లిప్పర్లతో అలా వీధిలోంచి వెళ్తుంటే కుర్రాళ్ళు సంబరంతో వెంటపడేవాళ్ళు. గవాక్షంలోంచి కన్నెపిల్లల తళుకు చూపులు, ప్రౌఢాంగనల బెళుకు కాటుక కన్నుగీటులు, అతని ఆపాద మస్తకం పులకింతలు పెట్టేవి.

పూర్వాచారపు ఛాందసుల రుసరుసలు, గంగాభాగీరథీల గుసగుసలు యువతరం వారి విసవిసలు, అన్నీ గమనించి చిన్నగా నవ్వుకునేవాడు. వీడు యువతలో విప్లవం తెచ్చే లాగున్నాడే అదో శాస్త్రిగారి బాధ.

"అందరూ ఇలాంటివారేనా? చెడిపోవడానికి, మా అబ్బాయిచూడు. పాలకుర్తి అధ్యయనశాలలో ఉపనిషత్తులు అవ్వత్తులై ఇప్పుడు 'కఠం' వల్లిస్తున్నాడట!" గర్వంగా

*1945లో సిద్దిపేట జిల్లా, కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో గొల్లపల్లి పట్టాభి రామశర్మ జన్మించారు. 1962 నుంచి సాహిత్యంలో కృషిచేస్తున్న వీరు 'చంక్రమణం' నవల, 'దేవీ మానసపూజ' పద్య కవితాసంపుటి, 20కి పైగా కథలు రచించారు. ఉపాధ్యాయులుగా పదవీ విరమణ పొందారు.*

చూస్తూ అన్నాడో వైదికుడు.

మరి ఆయాజుల వారి కొడుకో.. ఏం చురుకండీ... కాల్చిన తగురమనుకో! సాగదీసిన ఉక్కు. అల్లా ఉండాలి అబ్బాయిలంటే. పాపం సభాపతి గారి కుమారుడు నాటకాల్లో చేరాడట. దిగులు ప్రకటించిందో గళం.

"ఏమిటేమిటి?" కళ్ళప్పగించి నోరు తెరుచుకున్నాడొహాడు. విజయనగరం పీఠంలో నాటకాలంకార సాహితి చదివాడట! బళ్ళారికి పరీక్షలకని వెళ్ళి అక్కడే నాటకంలో ఉండిపోయాడట.

★ ★ ★

మంచినీళ్ళ బావి దగ్గర కూడా, ఆ ప్రసక్తి వచ్చింది. నీలవేణి వచ్చిందన్నారు. చాముండేశ్వరీ ఆలయంలో దిగిందన్నారు.

"సూరయ్య వెళ్ళి పలకరించాట్ట వదినా" బిందె తోముతూ దీర్ఘం తీసింది నడివయస్సావిడ.

"మనిషి బాగానే వుందట పిన్నీ!"

"అయ్యో పిచ్చితల్లీ ఎందుకుండదూ... వాళ్ళది గంధర్వాంశనట! మొన్న మా ఆయన మాటల సందర్భంలో అన్నారు వేశ్యలందరూ గంధర్వులేనట. అందులో దేవవేశ్యలనే వాళ్ళు పుణ్యం చేసుకొని స్వర్గంలో ఉండేవాళ్ళకి భోగభాగ్యాలను అందిస్తూ జరామరణాలు లేకుండా శాశ్వతంగా స్వర్గంలోనే వుంటారట" ఆవిడ చెప్పేదంతా శ్రద్ధగా రెండు చేతులూ చెంపలకాన్చుకొని కళ్ళు గుండ్రంగా తిప్పుకుంటూ, మరీ వింటోంది.

సూరయ్య అటువేపే వస్తూ... ఆ జవ్వనిని కాస్త తీక్షణంగానే చూశాడు. అలా ఓరకంట, దోరదోరగా, తనను గీరుక తిన్నట్టు చూస్తుంటే వీపులో తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయ్యింది. ఆ సమయంలో ఆ చూడటం కొంచెం అసహ్యం కలిగించినా, తరువాత తరువాత తన్ను మైమరిపించేది.

మంచినీళ్ళ బావి దగ్గరనుంచీ.. అన్ని పొలాలే. పచ్చని పొలాల మధ్యనుంచీ ప్రభుత్వం వేయించిన కొత్త రోడ్డు, రెండు పర్లాంగుల దూరంలో చిన్న అడవి. ఇటువైపు ఎత్తులేని కొండ. ఆ కొండ నానుకొనే చాముండేశ్వరి దేవాలయం. ఆ దేవాలయాన్ని చూస్తుంటే కాకతీయుల శిల్పం జ్ఞప్తికి వస్తుంది.

ఆలయ సింహద్వారం వద్ద ఇసుక వేస్తే రాలని జనం. ఆ పల్లెటూళ్ళో అంత జనాన్ని యెన్నడూ చూడలేదు సూరయ్య. ప్రత్యేకించి జాతరలు, ఉత్సవాలు జరిపినప్పుడే ఆ ఊరంతా హడావిడిగా ఉంటుంది. గుడికి ఎదురుగా కొన్ని గజాల మేరకు జనమంతా క్యూలో నిలబడ్డారు. పోలీసోళ్ళు, వాలంటీర్లు జనాన్ని అదుపులో పెడ్తున్నారు.

"ఏమిటి వింత ఇక్కడ!" సూరయ్యకు ఆశ్చర్యం వేసింది.

ఒకాయన్ని పిల్చి ఏమిటని అడిగాడు.

అతగాడు ఆనందంతో తబ్బిబ్బవుతూ "సౌందర్యం... సౌందర్యం" అన్నాడు.

"ఏమిటీ సౌందర్యం!" సూరయ్యకు తికమకగా ఉంది.

"అదేనయ్యా! అందం అమ్ముతున్నారు".

'అందం అమ్మడమేమిటి? నీ మొహం' అనుకున్నాడు సూరయ్య.

"మరి నీవు కొనుక్కున్నావా?"

"లేదు"

"ఎందుకని?"

"ఆ త్రొక్కులాటలో చావడం ఇష్టంలేక"

"మరి, నీకు అందం అవసరం లేదా?"

ఇదేమిటి! ఈ ద్రాపేగాణితోనే



వాజమ్మనై పోతున్నానే? అందాన్ని ఎలా అమ్ముతున్నారబ్బా! చట్... అంబాళా నశ్యమేమో? ఎలాగైతేనేం. సూరయ్య కూడా సందులోకి దూరాడు. మునసబు నరసింహయ్య సూరయ్యను గుర్తుపట్టి గుడివెనుక ద్వారం నుంచి లోనకి తీసుకవెళ్లేడు.

"ఇదా! అసలు విషయం..." నోరు తెరచి అమాంతం అన్నాడు సూరయ్య.

"సరే... ఆ విషయం నాకు వదలి నిశ్చింతగా ఉండవోయ్" అన్నాడు సూరయ్య.

సూరయ్య సెలక్షన్ బ్రహ్మాండంగా కుదిరింది. రాజమండ్రి నుంచి నీలవేణి వచ్చేసింది. వెంట ఓ ముసలాడు వున్నాడు. వాడు ఫిడేల్ వాయిస్తాడట. ఆమెను చూడ్డానికి జనమంతా ఎగిరెగిరి పడుతున్నారు. అప్పుడర్థమైంది సూరయ్యకు అందం అమ్మడం ఏమిటో?

సూరయ్యకు నాటకాలంటే మాంచి సదభిప్రాయం ఉంది. ఈరోజుల్లో నాటకాల క్షీణతకు చాలా నొచ్చుకున్నాడు.

"మీరు నాటకాల్లో వేషాలు వేస్తారా?" నీలవేణిని కళ్ళతో త్రాగిపారేస్తూ అడిగాడు.

"మీకు తెలియనిదేముంది. సురభి కంపెనీలో మంజువాణి పాత్ర నాదే" ఆమె బింకంగా అంది. అలాగా.. సురభి కంపెనీ వారి నాటకాన్ని చూడనందుకు చాలా చింతించాడు.

తెల్లారితే కలశస్థాపన. అమ్మవారి వ్రతం ఆరంభం అవుతుంది. ఆనాడు రాత్రికి సూరయ్య - నీలవేణి సత్రపు గదిలో కూర్చుని, ఏయే కీర్తనలు పాడాల్నో నిర్ణయిస్తున్నాడు. మచ్చుకు ఓ రెండు పాటలు పాడించాడు.

"రాజమండ్రిలో ఒసారి నీవు గానకచేరి చేశావు కదూ".

"అయ్యో రాత ఒక్కసారేమిటి? వందసార్లు చేశాను" ఆమె అంది.

"వందసార్లు కచేరీలకు నేను హాజరు కాలేదు గానీ.. ఒక్కసారి మాత్రం అద్భుతం. ఆ జయదేవుని అష్టపది పంతువరాళి రాగం కదూ... ఇప్పటికీ

**ఆనాటి రాత్రంతా, నాటకాల విషయంలోనూ, సంగీత చర్చలతోనూ, గడిచిపోయింది. ఆ ముసలాడిపేరు శ్రీనివాసట. వరుసకు నీలవేణికి బాబాయి అవుతాడట. ఫిడేల్ వాయించడంలో మాంచి పట్టు చూపించాడు. అసలు అతను ద్వారం వారి శిష్యకోటిలోని వాడేనట. ఇంకేం.. దానికి తిరుగుందా. తిరుపతి వేంకట కవుల శిష్యుల మన్నించుకున్నవాడల్లా, కవిత్వం చెప్పకుండా ఉన్నాడా?**

నాలో ధ్వనిస్తూనే వుంది."

శ్రీకృష్ణలీలా తరంగిణిలో నుండి కొన్ని శ్లోకాలు, కీర్తనలు, కొన్ని త్యాగరాజు కృతులు, ముకుందమాల, శంకరాచార్యుల సౌందర్యలహరిలోని కొన్ని, జయదేవుని అష్టపదులు కొన్ని, హిందూస్తానిలో పరిచయం వుంటే... సూరదాసువి, మీరాబాయివీనూ, కొన్ని దోహాలు పాడటానికి నిర్ణయించాడు సూరయ్య.

ఆనాటి రాత్రంతా, నాటకాల విషయంలోనూ, సంగీత చర్చలతోనూ, గడిచిపోయింది. ఆ ముసలాడిపేరు శ్రీనివాసట. వరుసకు నీలవేణికి బాబాయి అవుతాడట. ఫిడేల్ వాయించడంలో మాంచి పట్టు చూపించాడు. అసలు అతను ద్వారం వారి శిష్యకోటిలోని వాడేనట. ఇంకేం.. దానికి తిరుగుందా.

తిరుపతి వేంకటకవుల శిష్యుల మన్నించుకున్నవాడల్లా, కవిత్వం చెప్పకుండా ఉన్నాడా? అలాగే నాయుడు గారి శిష్యప్రశిష్యుల్లో కూడా అరకొర ఉండదు.

ఎలాగైతేనేం? సూరయ్యగారి సూచన ఫలితంగా నీలవేణి ప్రతిభావ్యుత్పత్తులు ప్రవహించడానికి అదొక అమోఘమైన ప్రోగ్రాం. ఉద్దండపిండాల సంగీత కచేరి. తద్వారా చాముండేశ్వరిని అర్థించుకొని, ఇంత సుకృతాన్ని మూటగట్టుకోవడం ఆ పల్లె ప్రజలకు తటస్థించింది.

అందునా.. సూరయ్య లాంటి రసిక ప్రవరుడు. మునసబులాంటి ఘటికుడు. కార్యశూరుడూ తల్చుకుంటే కాని పనులేముంటాయి.

★ ★ ★

సోమయాజులవారి పంచలో శిష్యులు వేదపాఠం వల్లిస్తున్నారు. నిగమశర్మ తండ్రికేం తీసిపోడు మన సోమయాజులు. వారిది పెద్ద కుటుంబం. ఆయనగారు కూడా వేదాలు పోసిన (నింపిన) గాదెనే. శాస్త్రాల భోషాణమే. అలాగే ఆంధ్రాబ్యాంక్ ఇనుపపెట్టె వలెనే, చాందసాల ఉక్కుపెట్టెనే.

సూరయ్య ఇటువైపే రావడం చూచి బ్రహ్మచారులు అధ్యయనం కట్టిపెట్టారు. వెక్కిరిస్తాడేమోనని. సూరయ్య క్షణానికో కోణంలో ఫోజు పెట్టి సిగిరెట్టు స్టైయిల్‌గా పట్టుకుని రీవీగా నడుస్తుంటే గోష్పాద మంత పిలకలను తడుముకుంటూ చిన్నబోయారు బ్రహ్మచారులు.

ఇలాంటి అవస్థ తమకెందుకు పట్టిందో ఒకరికొకరు చూసుకుంటూ చింతించసాగారు. పసుపు రాచిన పిడికెడు జంధ్యప్పోగులు, గోచిలేని అడ్డబట్టలు, చెవులకు అమ్మాయిల్లా కుండలాలు. ఛీ.. ఛీ.. అసహ్యించుకున్నారు.

వాళ్ళలోని అణచలేని విప్లవం వెల్లువలా పైకి పొంగింది. కానీ సనాతన ధర్మం, కర్మ, బ్రష్టత్వం... ఇప్పుడే రిజర్వ్‌డ్ చేయించుకున్న మోక్షస్థానాలు కాస్త 'హరీ' యంటాయి.

"నీలవేణి కన్పించిందా?" ఒక్కడు పక్కవాణ్ణి ఆశగా అడిగాడు.

"అయితే వెళ్లావన్నమాట. ఆచార్యుల వారు రానీ...నీకేం ప్రాయశ్చిత్తమో జరిగి తీరాలి. ఒరేయ్... ఆ నిర్ణయసింధువు ఇలా తే...!"

"మొదట బ్రహ్మకర్మలో చూడరా ఏముందో..." మరొహడు అన్నాడు.

పాపమా స్నాతకుడు భయంతో, చెమటతో స్నానం చేసినట్టు అయ్యాడు.

"ఎన్నడూ లేనిదీ... ఇవ్వాళ

ఆలయానికెందుకెళ్ళినట్టు?''

"గురువుగారు బిల్వ దళాలు తీసుక రమ్మన్నాడురా...'' బెక్కుతూనే అన్నాడు.

"ఛట్... బైరాగుల్లారా ఊర్కోండ్రా''.

"అయితే నీలవేణిదేవర్ణంరా? అణచుకోలేని తహతహ''

"వేశ్యనట'' ఇంకొకడన్నాడు.

"ఒరీ గడుగ్గాయి! నీవుండురా... జాతి కాదు నేనడిగేది. శ్యామలాంగియా? కోమలాంగియా? అని''.

"పసిడి వర్ణంతో మిసమిసలాడుతుంది. అంటే లేత తమ్మలపాకు మాదిరి అన్న మాట. అయితే రక్తం లేని క్షయరోగిలా ఉందేమిటి'' మరొహడి కంఠం బొంగురుమంది.

"ఛట్... ఏం ఉపమానంరా... రామదాసు (అంటే కొందరి సంభాషణ రీత్యా... ఏమీ చేతగాని చవట అని) ఉపమా... కాళిదాసస్య'' అన్నాడే కాని, రామదాసస్య అంటే ఎంతో బావుండేది. మరొక సాహితీ ప్రియుని భోజన సాహిత్యం లాంటి వాక్భాణం.

హరిణజాతి కళ్లతో మనోహారిణి నీలవేణి సౌందర్యం చర్చల విద్యుద్ఘాతాలతో శరీరాలు కంపిస్తున్నాయి బ్రహ్మచారులకు. ఆ తరుణశ్యామల తనూవల్లిక మల్లికలను ఎవ్వడాఘ్రాణిస్తున్నాడో? ఏ మహా వటవృక్షం ఆ వల్లికకు ఆలంబనమో? అవిచ్ఛిన్న అపరిష్కృత సమస్య.

ఎన్ని అవధానాలు చేసినా వాక్ఛందనం చేసే సమస్యలెన్నడూ ఉద్భవించలేదు.

అందం సంగతి దేవుడెరుగును గానీ, బ్రహ్మచారుల వెన్నుపూసలు జలద రిస్తుంటే ఆనాటి కచేరికి హాజరవుదామనే తలంపు అందరికి కలిగింది.

తాటికాయల చల్లని పందిళ్ళ కింద, దర్భాసనాలు పరచుకొని కొబ్బరాకులతో సరిక్రొత్త పద్ధతిలో అలంకరించిన అమ్మవారి కళ్యాణమంటపం. దానికెదురుగా నీలవేణి కచేరీ చేసే వేదిక నిర్మించబడి ఉన్నాయి. వాటిని చూస్తూ సనాతనులు సైతం దిగ్భ్రమ చెందారు. గొప్ప సంస్థానాల్లో జరిగినట్టు అంతకంటే ఘనంగా చాముండేశ్వరీ ఆలయంలో జరిపించడం నిజంగా ఆనందించ వలసిందేనని శిర: కంపనలతో హస్తచాల నముతో అంగీకరించారు.

శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, బాలత్రిపురసుందరీ రాజరాజేశ్వరీ, చాముండేశ్వరీ దేవతాయైనమ: నృత్యం సమర్పయామి.

కాలిగజ్జెలు ఘల్లుమన్నాయి. బ్రహ్మచారుల హృదయాలు ఝల్లుమన్నాయి. కళ్యాణిరాగం ఎత్తుకుంది. సర్వమంగళ స్వరూపిణియైన అమ్మవారి స్తుతి కీర్తన సాగుతోంది. భరతనాట్యమింకా సమసిపోలేదనుకున్నారు. ప్రాచీనులు కూడా భేష్ అన్నారు.

ఎన్నో నాట్యాలు చూసిన సూరయ్య కూడా... ఆ ఆంగికాభినయంలో ఆ పద విన్యాసంలో ఎన్నో కొత్త పోకడలు కన్పించాయి. సన్నగా తీగసాగే చక్కని గాత్రం. ముసలాడు మాత్రం జనాన్ని ఊపేస్తున్నాడు. నాయుడుగారు వాయిస్తున్నట్టే ఫీలయ్యాడు సూరయ్య.

అర్చన ఆసాంతానికి వచ్చింది. ఒక్కొక్కరే అభినందనలు తెల్పడం మొదలెట్టారు. సూరయ్యకైతే ఎప్పుడు నీలవేణి దగ్గర వాలి సంతోషం ఎలా తెలుపుకోవాలో అర్థం కాకపోయింది. అందరూ తీర్థప్రసాదాలు స్వీకరించి ఇంటికి వెళ్ళిపోయారు.

**తెల్లారితే** నీలవేణి రాజమండ్రి వెళ్ళిపోతుంది. నిజంగా సూరయ్యకు పిచ్చిపట్టినట్టయింది. ఆమె సాన్నిధ్యం లేకపోతే... తన బ్రతుకే వ్యర్థమని పించింది. ఆ రోజంతా సూరయ్య బాధపడ్డాడు. ఏదో అమూల్య వస్తువును పోగొట్టుకున్నట్టుగా ఫీలయ్యాడు. నీలవేణి నివసించిన సత్రము, గానకచేరి చేసిన మంటపం, ఆమె తిరిగిన ఆలయ పరిసరాలు, చివరికి ఆ గ్రామం కూడా సూరయ్యకు కళాహీనంగా కన్పించింది.

"నీలా...'' గదిలో కాలిగజ్జెలు విప్పుకొంటున్న నీలవేణి వెనుదిరిగి చూసింది. "సంతోషం! మీరా... కూర్చోండి'' అంది.

"నీలా...'' ఏదో వ్యక్తీకరించని అమృతత్వం. స్పష్టీకరించలేని అనురాగం ఇంకా అవశేషంగా ఉండిపోయింది.

"ఇదంతా మీ ఆశీర్వాదం'' తియ్యగా అంది ఆమె.

"కాదు మీ అందమైన శంఖంలాంటి కంచుగొంతులోని కమ్మని ప్రణవపూరిత ప్రణయనాదం. ఆ అమ్మవారి కృపాకటాక్షం''.

"మరి మీది ఏమీ లేదా?'' చిలిపిగా చూస్తూ అంది నీలవేణి.

ఇలా తొమ్మిది రోజుల కార్యక్రమంలో నీలవేణి, సూరయ్య మధ్య ప్రేమ అంకురించి క్రమంగా అభివృద్ధి పొందింది.

తెల్లారితే నీలవేణి రాజమండ్రి వెళ్ళిపోతుంది. నిజంగా సూరయ్యకు పిచ్చిపట్టినట్టయింది. ఆమె సాన్నిధ్యం లేకపోతే... తన బ్రతుకే వ్యర్థమని పించింది. ఆ రోజంతా సూరయ్య బాధపడ్డాడు. ఏదో అమూల్య వస్తువును పోగొట్టుకున్నట్టుగా ఫీలయ్యాడు. నీలవేణి నివసించిన సత్రము, గానకచేరి చేసిన మంటపం, ఆమె తిరిగిన ఆలయ పరిసరాలు, చివరికి ఆ గ్రామం కూడా సూరయ్యకు కళాహీనంగా కన్పించింది.

ఎందుకో... నీలవేణిమీద అంత మమత పెంచుకున్నాడు సూరయ్య. సూరయ్యకిదేమీ కొత్తగాదు. భోగంవాళ్ళ ముఖాలు అతడికెన్నో పరిచయం. సూరయ్య పైలాపచ్చీసులాంటి యువకుడేమీ కాదు. నలభై ఏళ్ళు నిండాయి. అల్లాగని ఆయనలో తరుణత్వపు తృష్ణ ఏమీ లోపించలేదు.

* * *

నీలవేణి వెళ్ళిపోయి పదిరోజులు గడిచిపోయాయి. ఈ పదిరోజులు పదియుగాల్లాగ అన్పించాయి సూరయ్యకు. అతనికేమీ పాలుపోలేదు. చిల్లరమల్లరగా ఊళ్ళవెంట తిరగడం మొదలెట్టాడు. అయినా అతని ఆత్మకు

శాంతిలేదు. నిద్రలేక కళ్ళు ఎర్రబడ్డాయి. సమయానికి తిండిలేక, ఉన్నా సహించక తోటకూర కాడలా వ్రేలాడిపోయాడు. తరతరాల దరిద్రం వెంటబడినట్టు బక్కచిక్కి మృత్యుముఖంలో పడ్డాడు. అతని భార్య ఎంతో ప్రాధేయపడింది. హాస్పిటల్‌కు వెళ్ళమంది. ఎంత మంది చెప్పినా ఒకటే మౌనం. ఈ హఠాత్పరిణామానికి మునసబు నరసింహయ్య కూడా ఎంతో విచారించారు. ఊళ్ళో వాళ్ళంతా సూరయ్యకేదో కామినీ భూతం పట్టుకుందనుకున్నారు. ఈ దెబ్బతో బ్రహ్మాచారులు హడలిపోయి ఏ వేశ్య అయినా సరే... అది రంభ కానీ, ఊర్వశి కానీ... చూడవద్దని దృఢపరచుకున్నారు.

ఇక లాభం లేదనుకొని సూరయ్య భార్యను పుట్టింటికి పంపించి ఉన్న కాస్త పొలం గట్రా అమ్ముకొని నెల్లూరికి మకాం మార్చాడు.

వెళ్ళిన రోజు సాయంత్రమే నీలవేణి ఇంటికి వెళ్ళాడు. పాపం! సూరయ్య పరిస్థితికి నీలవేణి చాలా బాధపడింది.

ఇక నీవు తప్ప నాకింకెవరు లేరన్నాడు నీలవేణితో సూరయ్య. కానీ, నీలవేణిలో ఏమిటో కొంచెం మార్పు కనిపించింది. అప్పటి అనురాగం, ఆత్మీయత ఏమీ కన్పించడంలేదు. ఎడమొహం, పెడ మొహంగానే ఉంది. మధ్యమధ్య నీతిని బోధిస్తున్నట్టు చింతామణి నాటకంలోని పద్యాలు శ్రావ్యంగానే చదువుతున్నా, ఏమిటో విరక్తిని ప్రకటిస్తోంది. సూరయ్య కంతా అగమ్యంగా ఉంది. తను నీలవేణి కోసం ఎంత కృషి చేశాడు. మరి తనమీద చూపించిన ఆ ప్రేమ ఏమైంది. అర్థం లేని ప్రశ్నలు సమాధానాలు చిక్కక తికమక పెట్టాయి. ఆ అనురాగమంతా, తన కార్యం గట్టెక్కేవరకేనా?

తన అన్వేషణకు ఫలితం అవస్థయేనా? అత్యాశతో ధూర్తభ్రమరంలా రసపిపాసతో కింశుకములో తగుల్కొని రెక్కలు, కళ్ళు పోగొట్టుకున్నట్టేనా తనగతీ, ఎందుకిలా మరి.

నీలవేణి ప్రవర్తన సూరయ్యను పరివర్తన చేస్తోంది. ఒకప్పుడు కమ్మని కంఠంతో మనుచరిత్రలోని పద్యాలు, పారిజాతాపహరణములోని పద్యాలు చదివి తన మానసహరణం చేసిన ఆ నీలవేణి ఖుష్కవేదాంతం వెళ్ళగ్రక్కే ఈ నీలవేణికి సంబంధం ఏమీ లేదా?

ఏమో! ఈ స్త్రీలంతా ఇంతే.. అందులో ఇది వేశ్య. నాల్గురాళ్ళు చేతిలో ఆడినన్ని రోజులు తన్ను ప్రేమలో ముంచేసింది.

సూరయ్యకు నిజంగానే విరక్తి పుట్టింది. తీర్థయాత్రలు చేస్తేనన్న కాస్త పుణ్యం విశ్రాంతి దొరుకుతుందనుకొని బయలుదేరాడు.

సరిగ్గా ఆరు నెలలు తిరిగి తిరిగి నెల్లూరు చేరుకున్నడు. ఎవ్వరూ గుర్తుపట్ట లేనంతగా మారిపోయాడు. తల, గడ్డం బాగా పెరిగిపోయి బైరాగిలాగున్నాడు. వచ్చిన రోజు రాత్రే విపరీతమైన చలిజ్వరం. గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్ళాడు. డాక్టర్ కాసేపు పరీక్షించి 'టైఫాయిడ్' అని తేల్చాడు.

సాయంకాలం చల్లనిగాలి వీస్తోంది. రోడ్డు వెంబడే నడుచుకుంటూ వస్తున్నాడు. శరీరం జ్వరంతో మాడి పోతోంది. నీరసంతో కళ్ళు మూతలు పడిపోతున్నాయి. నడవడానికి అవశమైపోయింది. ఎదురుగానున్న బంగళా అరుగుమీదికి గబగబా వెళ్ళిపడిపోయాడు.

కళ్ళు తెరిచేసరికి నుదుట పట్టీ కన్పించింది. నీరసంగా తలత్రిప్పి చూశాడు. తను ఎవరి ఇంట్లోనో మంచం మీద పడుకున్నట్టు తెలుసుకున్నాడు. ఎదురుగా ఒకాయన వచ్చి "ఎలాగుం దండీ!" అన్నాడు చేతితో సంజ్ఞ చేస్తూ పర్వాలేదన్నాడు. ఆ వ్యక్తికి సుమారు ఎనభై సంవత్సరాలుండవచ్చు. ఎక్కడో చూచినట్టే అన్పించింది. కానీ, స్ఫురణకు రాలేదు.

అతను కూడా తనవైపే పరీక్షగా చూస్తూ, "మీ పేరు సూరయ్య కాదుటండీ!" అన్నాడు ఆశ్చర్యంతో.

"అవును" అన్నాడు.

అతనే శ్రీనివాసం! నీలవేణితో వచ్చాడే... ఫిడేల్ వాద్యకాడు అతను.

"నీలవేణి బాగుందా?" మెల్లిగా

**కళ్ళు** తెరిచేసరికి నుదుట పట్టీ కన్పించింది. నీరసంగా తలత్రిప్పి చూశాడు. తను ఎవరి ఇంట్లోనో మంచం మీద పడుకున్నట్టు తెలుసుకున్నాడు. ఎదురుగా ఒకాయన వచ్చి "ఎలాగుం దండీ!" అన్నాడు చేతితో సంజ్ఞ చేస్తూ పర్వా లేదన్నాడు. ఆ వ్యక్తికి సుమారు ఎనభై సంవత్సరాలుండవచ్చు. ఎక్కడో చూచినట్టే అన్పించింది. కానీ, స్ఫురణకు రాలేదు.

అన్నాడు సూరయ్య.

ఆ వ్యక్తి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే బొంగురుగొంతుకతో, "ఇంకెక్కడి నీలవేణి సూరయ్యా! మనల్ని వదిలిపెట్టి పోయింది. అంటే ఆమె చచ్చిపోయి మూడవనెల జరుగుతున్నది.

సూరయ్యకు దుఃఖం ఆగలేదు. రెండు కన్నీటిచుక్కలు కనురెప్పలు దాటాయి.

"ఆమె వెళుతూ మిమ్మల్ని ఎన్నోసార్లు అడిగిందండి. మీకో ఉత్తరం కూడా ఇచ్చింది" అంటూ ముసలాడు ఓ కవరు సూరయ్య చేతిలో పెట్టాడు.

"బహుశ.. మీరు నన్ను మరిచిపోర నుకుంటాను. అలాగే నేను కూడా మిమ్మల్ని మరిచిపోలేదు. నావల్ల మీరు ఈ పరిస్థితికి వచ్చారని తెలిసి నా హృదయం చాలా బాధపడింది. ప్రతి వ్యక్తి కూడా ఏవో ఆశలతో దేనికోసమో అన్వేషిస్తుంటాడు. కానీ, అందరూ సఫలీకృతులు కాలేరు. మన ఈ అన్వేషణ ఐహిక పరిధుల్లో సాగేకంటే అన్నింటికి అతీతంగా ఉండే అంతరాత్మనర్థం చేసుకొని పరతత్వాన్ని అన్వేషించాలనేది ప్రతి జీవి పరమార్థమనుకుంటా".

*- నీలవేణి*

ఉత్తరం పూర్తి చేసి భారంగా, నీరసంగా ఒక నిట్టూర్పు విడిచాడు సూరయ్య. ఇన్ని రోజులు తను అన్వేషించని కొత్తవస్తువు, సంచరించని కొత్తబాట.

ఈ అన్వేషణ ఫలితం పరతత్వమేనని అనుకున్నాడు సూరయ్య.

*('చతురంగం' కథాసంపుటి, సాహితీ వికాస మండలి ప్రచురణ మార్చి, 1965)*

# ఆనాటి కవితా వాహిని

క. మనయూరికొక్కసొమ్మై
కనుపండువు సేయుచున్న కమలవనము, కో
సిన నువ్వుఁ జేనివడువునఁ
గనిపించెడు నిపుడు మంచుకారున నత్తా!

(కుమారిలుఁడు)

ఆ. మోముఁదమ్మి నడ్డముగఁ ద్రిప్పుకొని చెలి!
యూరకిట్టులేడ్పు చుండవలదు;
అలఁతి దోసతీవియల మాడ్కినివి యిట్లె
వక్రగతులు సుమ్ము వలపులెపుడు.

(అలయఁడు - అనీకుఁడు?)

తే. నీవు వసియించుచోటని నెమ్మనంబు,
తనకు నివి నిన్నుఁ జూసినవనుచుఁ గనులు,
నిన్ను నెడఁబాసి కద యివి సన్నగిల్లె
ననుచు నంగమ్ములును బ్రియమయ్యెఁ జెలికి

(ముద్దఁడు)

ఆ. వలవఁడేని నిన్ను వాఁడు, నానాఁడిట్లు
క్రొత్తజున్నుపాలు గుడిచి చొక్కు -
నెనుపదూడ వోలె, నేల నిద్రించెదు
పగటి పూట నొడలు ప్రాలుమాలి?

(ముహరాయఁడు)

ఆ. రెప్ప వాల్చకుండఁ బ్రియుఁడు నాయంగమ్ము -
లందు దేనిదేని నరయుచుండు
దాని దానినెల్లఁ దవిలి మూయుదుఁ గాని,
యతఁడు చూడవలయుననియె వలతు:

(వసంతయుఁ వసలకుండ?)

*(డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'ముంగిలి' నుండి...)*

వ్యాసం

# పర్యావరణ పోరాటయోధుడు - సుందర్ లాల్ బహుగుణ

ప్రజలను ప్రకృతి ప్రేమికులుగా మార్చిన,
వారధిని సృష్టించిన వ్యాసం...




గిడ్డకింద మాణిక్యం
94921 64107


సుందర్ లాల్ బహుగుణ ప్రముఖ పర్యావరణవేత్త, ఉద్యమ కారుడు, గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, చిప్కో ఉద్యమకర్త, ప్రకృతి సౌందర్యాన్ని సామాన్య ప్రజలకు చేర్చిన సారథి, హిమాలయాల అడవుల సంరక్షణ, తెహ్రీ ఆనకట్ట వ్యతిరేక ఉద్యమం, మద్యపాన నిషేధం, అస్పృశ్యత నివారణం వంటి అనేక ఉద్యమాలకు ఆద్యుడు. వృక్షాలే కాదు, అంతరించి పోతున్న జంతు, పక్షి జాతుల కోసం కూడా పరితపించిన పోరాటాల యోధుడు "సుందర్ లాల్ బహుగుణ".

సుందర్ లాల్ బహుగుణ 1927 జనవరి 9న ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ సమీపంలో ఉన్న మరోడా గ్రామంలో అంబదత్ బహుగుణ, పూర్ణాదేవి దంపతులకు జన్మించారు. 1956లో విమాలా బహుగుణతో వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు వున్నారు. జీవితాంతం నిరాడంబరత, క్రమశిక్షణలనే జీవనసూత్రాలుగా మలుచుకొని జీవించారు.

తండ్రి అంబదత్ బహుగుణ తెహ్రీ గర్వాల్ రాజాస్థానంలో ఉద్యోగి కావడంతో ప్రాథమిక విద్య ఉత్తరకాశి, తెహ్రీలోనే గడిచింది. అక్కడ స్వాతంత్ర్య సమర యోధుడు, జాతీయవాది అయిన శ్రీదేవ్ సుమన్‌తో పరిచయం ఏర్పడింది. తన



మార్గదర్శకత్వంలో ప్రగతిశీల సాహిత్యం అధ్యయనం చేశారు. అహింసా సందేశాన్ని వ్యాప్తి చేసే శ్రీదేవ్ సుమన్ అరెస్ట్ కావడంతో స్వాతంత్ర్య పోరాటంలో 13 ఏళ్లకే అడుగుపెట్టాడు బహుగుణ. లాహోర్ వెళ్లి బి.ఎ. గ్రాడ్యుయేట్ డిగ్రీ పొంది స్వదేశానికి వచ్చి గురువు ప్రారంభించిన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాడు.

### పోరాటాలకు ప్రాణం...

సుందర్ లాల్ బహుగుణ జీవితాంతం పర్యావరణ పరిరక్షణ కొరకు ఎన్నో పోరాటాలు, దీక్షలు, యాత్రలు చేస్తూ తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేశారు. వాటిలో కొన్ని ముఖ్యమైనవి.

### అస్పృశ్యత నివారణ పోరాటం...

ప్రారంభదశలో సమభావం, సహృద్భావంతో దళితులు, మరియు అన్ని కులాల విద్యార్థులకు తెహ్రీలో హాస్టల్ ప్రారంభించారు. దళితులకు గంగోత్రి, యమునోత్రి నందు ఆలయ ప్రవేశం చేయించారు. ఈ సంఘటనలు భవిష్యత్తు పోరాటాలకు సంకేతాలుగా నిలిచాయి. తెహ్రీ సంస్థాన రాచరికానికి వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొని విజయం సాధించారు.

### సంఘ సేవ...

1956లో విమలతో వివాహానంతరం సిలియెరలో ఆశ్రమం నిర్మించాడు. అది ప్రజామండల్ సంస్థ కార్యక్షేత్రంగా మారింది. తాను కార్యదర్శిగా పనిచేసిన సంస్థని జిల్లా కాంగ్రెస్ కమిటీగా మార్చడంతో రాజీనామా చేశారు. అటవీ, గిరిజనుల స్థితిగతులకు, జీవన శైలికి ఆకర్షితుడై వారితో మమేకమై పోయారు. అప్పుడు వినోబాభావే ఆహ్వానం అందడంతో తన జీవితంలో సగం సేవకే వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. చీకటి నిండిన గిరిజనుల జీవితంలో వెలుగులు నింపారు.

### మద్యపాన నిషేధ పోరాటం...

1965 నుంచి పర్వత ప్రాంతాల్లో విస్తృత పర్యటనల్లో నాటుసారా సంసారాలు సర్వనాశనం చేస్తున్న

సంఘటనలు చూసి ఆవేదన చెంది, మహిళల మనోవేదనను అర్థంచేసుకుని నారీలోకాన్ని మేల్కొలిపి సారానిషేధం ఉద్యమానికి సమరశంఖం పూరించాడు. దీని ఫలితంగా గర్వాల్ సహా 5 జిల్లాలు సారానిషేధ ప్రాంతాలుగా అవతరించాయి.

**అడవి సంపదపై సత్యాగ్రహం...**

అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయడాన్ని నిరసిస్తూ పర్యావరణ పరిరక్షణకు పోరాటాలు సాగించారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఉన్న అపార ప్రకృతి సంపద కబళించడం, 18, 19 శతాబ్దాల్లో దేశంలో విస్తరించిన రైల్వేలకు అవసరమైన కలప కొరకు హిమ వనాలపై పడ్డారు. 1887లో బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన భారత అటవీ చట్టం ప్రపంచచరిత్రలోనే అతిపెద్ద భూకబ్జాకు నాంది పలికింది. దీన్ని ప్రతిఘటించిన సుమారు వందమందిని 1930లో కాల్చి చంపినట్లు చరిత్ర చెబుతోంది. అడవుల రక్షణ కోసం ఇలా ప్రాణాలకు తెగించి పోరాడిన చరిత్ర గల ప్రాంతంలో పుట్టిన బహుగుణ పర్యావరణ పరిరక్షణనే తన జీవితధ్యేయంగా మలుచుకున్నారు.

**చిప్కో ఉద్యమం...**

ప్రభుత్వం వాణిజ్య ప్రయోజనాలకు కుట్రపూరితంగా అభివృద్ధి కార్యక్రమమని పైన్ చెట్లను నరకటానికి కాంట్రాక్టర్లను పంపింది. 1974 మార్చి 26న ఉత్తరాఖండ్ షమ్మోలి జిల్లాలోని రేని గ్రామంలో 2,500 చెట్లను నరకకుండ కాపాడే ప్రయత్నంలో చిప్కో ఉద్యమం ప్రారంభం అయింది. చిప్కో అంటే ఆలింగనం, హత్తుకోవడం, కౌగలించుకోవడం అని అర్థం. చెట్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి హత్తుకుని నరికివేయకుండ కాపాడటమే చిప్కో ఉద్యమం. ఇందులో గ్రామస్థులు, మహిళా మంగళ్‌దల్ సభ్యులు గౌరాదేవి, సుదేశదేవి, బచ్నీదేవి ముఖ్య భూమిక పోషించారు. ఇది శాంతియుతంగా చేపట్టిన మహత్తర ఉద్యమం కావున "అడవి సత్యాగ్రహం" అనే పేరు వచ్చింది.

**హిమాలయాల పరిరక్షణకు పట్టు...**

ఆ తర్వాత గర్వాల్ ప్రాంతంలో సుమారు 10,00,000 మొక్కలను నాటి హరితహారానికి నాంది పలికారు. ఈ ఉద్యమకాలంలో అతను పర్యావరణ శాశ్వత ఆర్థిక వ్యవస్థ అనే నినాదంతో 1984 నుండి 1993 వరకు హిమాలయాల గుండా సుమారు 4,700 కి.మీ. పాద యాత్రలో వృక్షాల ఆవశ్యకతను గ్రామ గ్రామానికి చెప్తూ ప్రజలను కూడగట్టారు. జనాలను వనాల వైపు పరిగెత్తించాడు. ప్రజలను ప్రకృతి ప్రేమికులుగా మార్చాడు. సైమన్ కమిటీ అందించిన నివేదిక మేరకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ గారు 15 సంవత్సరాల పాటు పచ్చని చెట్లను నరికివేయకుండా నిషేధం విధించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది.

**తెహ్రీ ఆనకట్ట వ్యతిరేక ఉద్యమం...**

## సుందర్‌లాల్

**బహుగుణ హిమాలయ ప్రాంత ప్రజలలో కొండ ప్రజల దుస్థితి (ముఖ్యంగా శ్రామిక మహిళలు)కి నిగ్రహంగా పోరాడే ఉద్రేక పూరితమైన రక్షకుడు. భారతదేశ నదులను రక్షించడానికి కూడా అతను చాలా కష్టపడ్డాడు. ఇంతే కాకుండా అలకనంద నదీ జలాల పరిరక్షణకు నడుంబిగించారు. ప్రజల్లో మెరుగైన జీవనోపాధికి అహర్నిశలు అలుపెరగని కృషి చేశారు**



తన సొంత జిల్లాలో ప్రభుత్వం తీసుకొచ్చిన డ్యాంతో పెద్దసంఖ్యలో పేద ప్రజలు నిరాశ్రయులు అయ్యే ప్రమాదం ఉందని గ్రహించి తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. సుమారు 84 రోజుల పాటు గుండు గీయించుకుని నిరాహారదీక్ష చేశారు. అదే ఆనకట్ట కారణంగా తన సొంత వారసత్వ ఇంటిని కూడా కోల్పోయారు. ఆనకట్ట పర్యావరణ ప్రభావాలపై సమీక్ష కమిటీని నియమిస్తామని అప్పటి ప్రధాని పివి నరసింహారావు ఇచ్చిన హామీ మేరకు 1995లో అతను చేపట్టిన ఉపవాస కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిలిపి వేశాడు. ఆ తరువాత అతను మరొక సుదీర్ఘ ఉపవాస దీక్ష చేపట్టాడు. ప్రధాన మంత్రి హెచ్.డి. దేవెగౌడ పదవీకాలంలో రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధి వద్ద 84 రోజులు ఉపవాస దీక్ష కొనసాగింది. ఈ ప్రాజెక్టు సమీక్షకు వ్యక్తిగత బాధ్యత అతనికి ఇచ్చారు. అయితే, సుప్రీం కోర్టులో ఒక దశాబ్దం పాటు కేసు కొనసాగినప్పటికీ, 2001లో తెహ్రీ ఆనకట్ట పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. తరువాత 2001 ఏప్రిల్ 20న అతన్ని అరెస్టు చేశారు.

చివరికి, ఆనకట్ట జలాశయం 2004 లో నింపడం ప్రారంభమైంది. 2004 జూలై 31న కోటి వద్ద కొత్త నివాసానికి తరలి వెళ్లాడు. తరువాత అతను డెహ్రాడూన్ రాజధాని ఉత్తరాఖండ్‌కు మారి ప్రస్తుతం తన భార్యతో కలిసి అక్కడ నివసిస్తున్నాడు.

సుందర్‌లాల్ బహుగుణ హిమాలయ ప్రాంత ప్రజలలో కొండ ప్రజల దుస్థితి (ముఖ్యంగా శ్రామిక మహిళలు)కి నిగ్రహంగా పోరాడే ఉద్రేక పూరితమైన రక్షకుడు. భారతదేశ నదులను రక్షించడానికి కూడా అతను చాలా కష్టపడ్డాడు.

ఇంతే కాకుండా అలకనంద నదీ జలాల పరిరక్షణకు నడుంబిగించారు. ప్రజల్లో మెరుగైన జీవనోపాధికి అహర్నిశలు అలుపెరగని కృషి చేశారు



**అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయడాన్ని నిరసిస్తూ పర్యావరణ పరిరక్షణకు పోరాటాలు సాగించారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఉన్న అపార ప్రకృతి సంపద కబళించడం, 18, 19 శతాబ్దాల్లో దేశంలో విస్తరించిన రైల్వేలకు అవసరమైన కలప కొరకు హిమవనాలపై పడ్డారు. 1887లో బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన భారత అటవీ చట్టం ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద భూకబ్జాకు నాంది పలికింది.**

## ఎన్నో ఉద్యమాలకు / చట్టాలకు మూలం...

చిప్కో ఉద్యమంతో ప్రేరణ పొంది తదనంతర కాలంలో ఎన్నో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు అప్పికొ ఉద్యమం, సేవ్ వెస్టర్న్ ఘాట్స్ ఉద్యమం, గంగా జలాల పరిరక్షణ వంటి ఉద్యమాలు ఊపిరి పోసుకున్నాయి. బహుగుణ దార్శనికత వలన పర్యా వరణ పరిరక్షణ, అటవీ సంరక్షణకు భారత ప్రభుత్వం ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్టు -1980 వంటి చట్టాలు అమలుపరిచింది.

## ప్రశంసలు...

“ప్రపంచంలో ఎత్తైన పర్వత ప్రాంతాల నుంచి పుట్టిన బహుగుణ వ్యక్తిత్వం కూడా అదే స్థాయిలో శిఖరాయమానంగా వున్నదని “స్వయంగా గాంధీజీ ప్రశంసించారు. ఇది బహుగుణ క్రియాశీలతకు దక్కిన అపురూపమైన ప్రశంస.

## పురస్కారాలు...

1981- భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేశారు, కానీ అతను తిరస్కరించారు.

1986- జమ్నలాల్ బజాజ్ అవార్డు (నిర్మాణాత్మక పనికి)

1987- రైట్ లైవ్లీ హుడ్ పురస్కారం (చిప్కో ఉద్యమం : రెండవ నోబెల్ పురస్కారంగా ప్రసిద్ధి)

1989 - గౌరవ డాక్టరేట్ డిగ్రీ ఆఫ్ సోషల్ సైన్సెస్ (ఐఐటి రూర్కీ)

2009 - భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు (పర్యావరణ పరిరక్షణకు)

సుందర్ లాల్ బహుగుణ కరోనా వ్యాధి కారణంగా 2021 మే 21న రిషికేశ్ లోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు.

ప్రకృతిని అమ్మగా భావించి కొలవటం ఆనాదిగా వస్తున్నదే... కానీ ఆ ప్రకృతిలో భాగమైన కొండకోనలను, వృక్ష, జంతు జలాలను ప్రాణప్రదంగా భావించి వాటి సంరక్షణలోనే మన ఉనికి కూడా ఆధారపడి ఉన్నదనే చైతన్యాన్ని పొందటమే అసలైన ఆధ్యాత్మికతగా భావించి చివరి శ్వాస వరకు అందుకోసమే దృఢంగా నిలబడ్డారు. దేశంలో పర్యావరణ పరిరక్షణ భావన ఇంతగా పెరిగింది అంటే అది ఆయన నిరంతర కృషి పర్యవసానంగా సాధ్యమైంది. అందుకే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయనను పర్యావరణ పరిరక్షణ పితామహుడిగా చెప్పొచ్చు. ఆయన కీర్తి భావి తరాలకు స్ఫూర్తి .

***(21 మే 2022 - సుందర్ లాల్ బహుగుణ ప్రథమ వర్ధంతి సందర్భంగా...)***

సాహితీ శిఖరం

# నవలల రారాజు...
# అఖిలన్



1975 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత



అఖిలన్ తమిళ రచయిత. "అఖిలాండం" ఆయన కలం పేరు. అతని శైలి వాస్తవికత. అతను స్వాతంత్ర్య సమరయోధుడు, నవలాకారుడు, చిన్నకథల రచయిత, పాత్రికేయుడు, యాత్రాచరిత్రకారుడు, నాటకకర్త, సినీ స్క్రిప్ట్ రచయిత, వక్త, విమర్శకుడు, బాలసాహిత్యకారుడు. అతను 1922 జూన్ 27న పుదుక్కోటి జిల్లాలోని పెరుంగలూల్ గ్రామంలో జన్మించాడు. అతని తండ్రి వైతియ లింగం పిళ్ళై అకౌంట్ అధికారిగా పనిచేసేవాడు. అఖిలన్ తన తండ్రిని ఎంతో ఆరాధించేవాడు. అతని తల్లి అమీర్థమ్మల్ సృజనాత్మకత కలిగిన మహిళ. అఖిలన్ తన పాఠశాల రోజుల్లో గాంధేయ తత్వశాస్త్రం ద్వారా ఆకర్షితుడయ్యాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో చేరడానికి పుడుకోటాయ్‌లో తన కళాశాల విద్యను నిలిపివేసాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అతను రైల్వే మెయిల్ సర్వీసులో చేరాడు. తరువాత అతను ఆల్ ఇండియా రేడియోలో చేరాడు. తరువాత అతను పూర్తిస్థాయి రచయితగా మారాడు. అతని కథలు ఎక్కువగా చిన్న పత్రికలలో ప్రచురించబడ్డాయి. 1975లో చిత్ర పావై (నవల) ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ అవార్డును గెలుచుకుంది. 1963లో అతని చారిత్రక నవల వెంగాయిన్ మెయిన్తాన్ (ఒకవేళ) భారత ప్రభుత్వ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది. అతని సామాజిక-రాజకీయ నవల ఎంజెపోగిరోమ్ 1975లో రాజా సర్ అన్నామలై అవార్డును గెలుచుకుంది. అతని పిల్లల పుస్తకం కనన కన్నన్ తమిళనాడు విద్యాశాఖ అందజేసిన ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. రచయిత సుమారు 45 పుస్తకాలను రాశాడు. వీటిలో ఎక్కువ భాగం అన్ని భారతీయ భాషలలో అనువదించబడ్డాయి. ఇది కాకుండా అతని రచనలు ఇంగ్లీష్, జర్మన్, చెక్, రష్యన్, పోలిష్, చైనీస్, మలాయ్ వంటి ఇతర విదేశీ భాషలలో అనువదించబడ్డాయి. కాయల్విజి నవల తమిళనాడు ప్రభుత్వ పురస్కారం అందుకుంది. వెత్రితిరునగర్-(విజయనగర సామ్రాజ్యం ఆధారంగా) చారిత్రక నవల ఆయన రాశాడు. చిత్ర పావై, నెంచిన్ అలైగళ్, ఎంగే పోకిరామ్, పెన్, పవై వియకు, పల్మారా కటినిలె, తునైవి, పుదు వెల్లం, వాల్వు ఎంగె?, పోన్ మలార్, స్నేహిథి, వనమ బూమియ, ఇంబనినల్వు, ఆవలకు మొదలైనవి ఆయన కలం నుంచి జాలువారిన నవలలు. సిరుకథాంగళ్, కొంబుథేన్ కొల్లై కరణ్ అనునవి ఆయన కథా సంపుటాలు. ఆయన 1988 లో మరణించాడు.

**దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అతను రైల్వే మెయిల్ సర్వీసులో చేరాడు. తరువాత అఖిలన్ ఆల్ ఇండియా రేడియోలో చేరాడు. తరువాత అతను పూర్తి స్థాయి రచయితగా మారాడు. అతని కథలు ఎక్కువగా చిన్న పత్రికలలో ప్రచురించ బడ్డాయి. 1975 లో చిత్ర పావై (నవల) ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ అవార్డును గెలుచుకుంది. 1963లో అతని చారిత్రక నవల వెంగాయిన్ మెయిన్తాన్ (ఒకవేళ) భారత ప్రభుత్వ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది.**

కథ

# పందికొక్కులు!

భ్రమల బతుకులోని
మనిషిని చిత్రించిన కథ...



కుంతి
87909 20745

"యేమి నర్సింహులు బాగేనా? తీర్థం ఇస్తూ ప్రశ్నించాడు రామాలయము పూజారి కృష్ణమాచార్యులు.

"యేమి బాగనో పంతులూ అంతా కిటకిట, కటకట" అన్నాడు పాత బస్తీ, చార్‌మినార్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ అయిన నర్సిములు.

"యేందీ సంగతీ" అంటూ భక్తులు ఎవరూ లేకపోవడంతో ఆలయంలోని హుండీకి ఆనుకొని కూర్చుంటూ అడిగాడు కృష్ణమాచార్యుల పంతులు.

నర్సిములు పూజారి దగ్గరకు వెళ్ళి దిగులుగా కూర్చున్నాడు.

"యేందిరా సంగతి" అన్నాడు చనువుగా.

"మా నాయన కాలం నుంచి, మాయింట్ల పూజలు చేసే పంతులువు నీవు. కష్టమొచ్చినా, సుకమొచ్చినా నీకు కాకుంటే ఎవరికి చెప్పుకుంటను" అన్నాడు.

**ఒకరోజు ఆయన పెద్దక్క ధూల్‌పేట శకుంతల వచ్చింది. నర్సిములు ఇంటిలో పూజలప్పుడు, వేరే వ్యాపకాలతో ఆమె అప్పుడు రాలేక పోయినది. ఆరోజు రాత్రి నర్సిములు, నర్సిములు భార్య, శకుంతలమ్మ ముచ్చట్లు పెట్టు కుంటూ నర్సిములు గదిలోనే నిదురపోయారు. మళ్ళీ రాత్రి శబ్దాలు మొదలయ్యాయి. శకుంతలమ్మ భయంతో లేచింది.**

"యేమి జరిగిందిరా?"

"యేమో పంతులు, నేనేమి తప్పు చేయకుండనే నెలరోజుల కింద కొలువు నుండి సస్పెండ్ అయిన. గప్పుడే మాయమ్మ పాయిఖానల జారిపడి కాలు యిరగ్గొట్టుకున్నది. మా యింటామె పెయ్యిగూడ బాగుంట లేదు. నా కొడుకు డిగ్రీల మల్లీ ఈ త్యాప కూడా ఫెయిలయిండు. నా చిన్నబిడ్డ కాపురం మంచిగ సాగుతలేదు"అంటూ పంతులు కళ్ల వైపు చూసాడు.

అతడు ఆసక్తిగా వింటుండడంతో మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"ఇవన్నీ గాక మాయింట్ల కొన్ని దినాముల నుండి ఒక విచిత్రం జరుగుతుంది. రాత్రి పూటల నేను, నా భార్య పండుకునే కమరాల (గదిలో) నేల నుండి విచిత్రమైన శబ్దాలు వస్తున్నయి. ఇల్లంతా యెతికినా ఆ శబ్దాలు ఎక్కడి నుంచి వస్తున్నయో సమజ్ అయిత లేదు. మాకు బగ్గ భయమైతున్నది" అన్నాడు నర్సిములు.

"నీ యిల్లు యెప్పుడు కట్టినారు రా?" అని పూజారి అడిగాడు.

"మా నాయన కాలం నాటిది, డెబ్బై ఎనభై సంవత్సరాలు అయినది" అన్నాడు.

"నీ పుట్టిన సంవత్సరం, నక్షత్రం, రాశి గుర్తున్నాదిరా".

తెలిసినంత వరకు చెప్పాడు నర్సిములు.

పంతులు కాసేపు కళ్ళు మూసుకున్నాడు. వేళ్ళతో లెక్కలు పెట్టాడు. కళ్లు తెరిచాడు. నర్సిములు భయంగా చూడసాగాడు.

"ఇపుడర్థమయింది. అది ఇంటి ముచ్చటకాదు నీకు సాడేసాత్ శని వచ్చింది. మిగిలిన గ్రహాలు కూడా బాగాలేవు. గ్రహచారము, గోచారము అధ్వాన్నంగా ఉంది. ప్రస్తుత పరిస్థితులలో నీవు ఈమాత్రం ఉండడమే గొప్ప"

నర్సిములు ఆ మాటలు వినగానే డీలా పడిపోయాడు.

"ఇపుడేమి చేస్తే మంచిది పంతులూ?" అన్నాడు దీనంగా

"మార్గం ఉంది కాని, నీవు తట్టుకో గలవో, లేదో ఆలోచిస్తున్నాను, ఒకవేళ తట్టుకోలేవని వదిలివేస్తే, మరొక పది రోజులలో కుజుడు, రాహువు కూడా శనితో కలవబోతున్నారు, ఇంక వాళ్ళు కలిస్తే నీ పరిస్థితి చెప్పతరం కాదు" అన్నాడు పంతులు.

నర్సిములు పంతులు మాటలకు వణికిపోయాడు."చెప్పు పంతులూ ! నీవు యేది చేయమంటే అది చేస్త, ఎన్ని

పైసలైన ఖర్చు చేస్త” అన్నాడు భయంతో.

“గ్రహశాంతి చేయాలి. దుష్ట గ్రహాల ప్రభావం ఆపడానికి జపాలు చేయించాలి. హోమం చేయాలి, శాంతి, పుణ్య వచనాలు చేయాలి” అంటూ చెప్పుకు పోయాడు.

“ఎంత అయితది పంతులు”

“ఎంత లేదన్నా పచ్చీస్ హజార్ అయితదిరా”

“సరే! పానం కంటే పైసలు ఎక్కువనా పంతులు. నీవు దగ్గర ఉండి ఆ పూజలన్నీ చేయించు” అన్నాడు నర్సిములు.

పంతులు ఘనంగా పూజలు చేయించాడు. నర్సిములు ఇల్లు పూజలతో, బంధుజనంతో కళకళలాడింది. ఆ వారం రోజులు ఆ యింటిలోని పడకగదిలో రాత్రిళ్ళు శబ్దాలు రాలేదు. నర్సిములుకు బాగానే అనిపించింది.

ఒక వారం రోజులు గడిచాయి. మళ్ళీ యథావిధిగా రాత్రిళ్ళు శబ్దాలు రాసాగాయి. అదే రోజులలో నర్సిములు కొడుకు శ్రీనివాస్ మోటార్ సైకిల్ మీద నుండి పడి దెబ్బలు తగిలించుకున్నాడు. నర్సిములుకు మళ్లీ భయం పెరిగింది.

ఒకరోజు ఆయన పెద్దక్క ధూల్‌పేట శకుంతల వచ్చింది. నర్సిములు ఇంటిలో పూజలప్పుడు, వేరే వ్యాపకాలతో ఆమె అప్పుడు రాలేక పోయినది. ఆరోజు రాత్రి నర్సిములు, నర్సిములు భార్య, శకుంతలమ్మ ముచ్చట్లు పెట్టుకుంటూ నర్సిములు గదిలోనే నిదురపోయారు.

మళ్ళీ రాత్రి శబ్దాలు మొదలయ్యాయి. శకుంతలమ్మ భయంతో లేచింది.

“ఒరేయి నర్సిములు లెవ్వురా! ఈ సప్పుడు ఏందిరా నాయనా! సూడబోతే నీ యింటికి యెవరో చెడుపు చేసినట్లున్నరు. ఔను నిజమే! ఇది బాణమతినే.

**“లేదు బావా! నీవూ. అక్క లేనిపోని రంధి పెట్టుకున్నారు. నీ ఇంటిలో యే దెయ్యం, భూతం లేదు. ఇది కేవలము హెల్యూసినేషన్. ఉత్త భ్రమ. మీరు లేనిది ఊహించి భయపడుతున్నారు. ఇది ఒక మానసిక జాడ్యం. మీకు పూజలు, మంత్రకాళ్ళు కాదు కావలసినది. కావలసినది మంచి మానసిక వైద్యుడు. నాకు తెలిసిన మంచి హాస్పిటల్ ఉన్నది అక్కడికి వెళ్దాం” అన్నాడు.**

శబ్దాలు వస్తున్నాయి. చిన్న బిడ్డ మగడిని వదిలి వేసి పుట్టింటికి వచ్చింది.

ఒక రోజు నర్సిములు సడ్డకుడు వచ్చాడు. అదే గదిలో పడుకున్నాడు. అదే అనుభవం ఎదురుకున్నాడు.

తెల్లవారి నర్సిములుతో, “అన్నా! నాకు నీ పరిస్థితి, నీ ఇంటి పరిస్థితి పూర్తిగా సమజ్ అయింది. ఈ యింటికి వాస్తుదోషం ఉంది. మా ఆఫీస్‌లో విద్వాన్ భాష్యం అని ఒకాయన ఉన్నడు. ఏకదమ్ ఫస్ట్ క్లాస్ వాస్తు చూస్తడు. ఒకసారి పిలుచుకొని వస్త. వాస్తు చూపిస్త” అన్నాడు.

నర్సిములు మారు మాట్లాడకుండా



తలూపాడు. ఆ మరునాడు వాస్తు పండితుడు విద్వాన్ భాష్యం వచ్చాడు. ఇల్లంతా కలియదిరిగాడు.

నర్సిములుతో “ఈ యింటిలో యెలా బ్రతుకుతున్నావు? ఇలాగే ఉంటే నీ పని యేమైపోతుందో తెలుసా?” అన్నాడు.

నర్సిములు గజగజ వణికిపోయాడు.

“యేమి చేయమంటారు?” అన్నాడు నీరసంగా.

“చాలా చేయాలి, గేట్ మార్చాలి. వంటిల్లు తలుపు మార్చాలి. బెడ్ రూమ్ గోడ కూలగొట్టాలి. హాల్ లో కిటికీలు తీసివేయాలి. పెరడులో బాత్రూం కూలగొట్టాలి” అంటూ చెప్పుకుంటూ పోయాడు.

నర్సిములు మాట్లాడ లేదు. నర్సిములు పరిస్థితిని గమనించిన వాస్తు విద్వాన్, “ఇవన్నీ చేయాలి. లేకుంటే కనీసం ముందు ఇంటి ముందు గేట్ అయినా వెంటనే మార్చుకో”అని చెప్పి తన ఫీజు పుచ్చుకొని వెళ్ళాడు.

మరునాడే నర్సిములు మేస్త్రీని పిలిపించాడు. వాస్తు పండితుడు చెప్పిన మార్పులు చేయించాడు.

అసలే పాత ఇల్లు కావడంతో గేట్ తీయబోతే, ప్రహరీ గోడ కూలింది. యాభై వేలు వదిలాయి. వారం రోజుల తరువాత మళ్ళీ శబ్దాలు మొదలయ్యాయి.

నర్సిములుతో పాటు పనిచేసే సులేమాన్ యేదో పని మీద నర్సిములు ఇంటికి వచ్చాడు. నర్సిములుకు అతడు మంచి మిత్రుడు కావడంతో తన కష్టాలు చెప్పుకున్నాడు. ఆ మరునాడు సులేమాన్ మౌలాలీ దర్గా దగ్గర ఉండే ఒక సాహెబ్‌ను పట్టుకొని వచ్చాడు.

అతడు ఆ ఇంటిలో సైతాన్ తిరుగుతుందని చెప్పాడు. ఆ సాహెబ్ రకరకాల ప్రార్థనలు చేసాడు. ఇల్లంతా ధూపం వేసాడు. అందరికీ తాయెత్తులు కట్టాడు. కొన్ని వేలు పుచ్చుకొని వెళ్ళి పోయాడు.

పరిస్థితిలో మార్పు రాలేదు. శబ్దాలు అలాగే రాసాగాయి.



ఇదిలా ఉండగా నర్సిములు భార్య, తనకు సుపరిచితురాలైన మరియమ్మకు తన బాధ చెప్పుకుంది. ఆమె తనకు తెలిసిన చర్చి ఫాదర్‌ను పిలుచుకొని వచ్చి ప్రార్థనలు చేయించింది.

ప్రార్థనలు ఫలించలేదు. శబ్దాలలో మార్పులు రాలేదు, పైసలు మాత్రం వదిలాయి.

ఒకరోజు నర్సిములు బావమరిది వరుస అయిన దూరపు బంధువు వచ్చాడు. అతడు బాగా చదువు కున్నవాడు. ఆ బంధువుకు నర్సిములు తన బాధనంతా చెప్పుకున్నాడు.

అతడు “నేనెలాగూ రెండు మూడు రోజులు ఇక్కడే ఉంటాను, ఆ పడక గదిలో పడుకుంటాను. అసలు సంగతి తెలుసుకుంటాను” అన్నాడు. అతడు అలాగే ఆ గదిలో పడుకున్నాడు.అతడికి యే శబ్దాలు వినబడలేదు.

అతడు నర్సింహులుతో “బావా! నేను ఈ రెండు మూడు రోజులు నీ గదిలో పడుకున్నాను. నీవు అనవసరంగా భయపడుతున్నావు. నీ యింటికి కానీ, నీకు కానీ వచ్చిన ప్రమాదం యేమీలేదు,” అన్నాడు.

“లేదు రా! రాత్రిళ్ల పూట మస్తు సప్పుళ్ళు అవుతున్నయి. నేనే కాదు మీ అక్క కూడయిన్నది’

**“ఒరేయి నర్సిములు లెవ్వరా! ఈ సప్పుడు ఏందిరా నాయనా! సూడబోతే నీ యింటికి యెవరో చెడుపు చేసినట్లున్నరు. ఔను నిజమే! ఇది బాణమతినే. నీ యింటి మీదికి గాలి సోకింది. జల్దిగా ఒక మంత్రగాన్ని పిలిపించుకొని బాగ చెయించుకో. లేకుంటే నీవు, నీ పిల్లలు ఆగమయితరు, బండ్లగూడెం దగ్గర మంచి మంత్రగాడు ఉన్నాడు. పిలిపించుకో” అన్నది.**

“లేదు బావా! నీవూ అక్క లేనిపోని రంధి పెట్టుకున్నారు. నీ ఇంటిలో యే దెయ్యం, భూతం లేదు. ఇది కేవలము హెల్యూసినేషన్. ఉత్త భ్రమ. మీరు లేనిది ఊహించి భయపడుతున్నారు. ఇది ఒక మానసిక జాఢ్యం. మీకు పూజలు, మంత్రకాళ్ళు కాదు కావలసినది. కావలసినది మంచి మానసిక వైద్యుడు. నాకు తెలిసిన మంచి హాస్పిటల్ ఉన్నది అక్కడికి వెళ్దాం” అన్నాడు.

అన్నట్లే ఆ మరునాడు నర్సిములు దంపతులను ఒక కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళాడు.

ముందుగా హాస్పిటల్ వాళ్ళు సమస్య ప్రాథమిక నిర్ధారణకై రకరకాల పరీక్షలు చేసారు.

చివరకు ఒక సైకియాట్రిస్ట్ దగ్గరికి పంపించారు. ఆ సైకియాట్రిస్ట్ ఆ

కథ

దంపతులను రకరకాల ప్రశ్నలు వేసాడు.

ప్రశ్నలకు సమాధానాలు వింటున్న కొద్దీ డాక్టర్‌గారు, నర్సిములు దంపతులతో, అర్థం కాని ఇంగ్లీషు పదాలతో రకరకాల రోగాల పేర్లను ఉచ్చరించ సాగాడు. నర్సిములు బావమరిది, తాను వాళ్ళను ఆ వైద్యుడి దగ్గరకు తీసుకొని వచ్చి మంచిపని చేసానని అనుకోసాగాడు. చివరకు అన్ని ప్రశ్నలయిన తరువాత ఆ వైద్యుల వారు ఒక నోరుతిరుగని పెద్ద ఇంగ్లీషు పదము వల్లించి, "మీ సమస్య ఇది" అని తేల్చి చెప్పాడు.

"మీరు సమయానికి వచ్చారు లేకుంటే ఇది బాగా ఇబ్బంది పడేవారు "అని కూడా చెప్పాడు. నర్సిములు దంపతులు భయకంపన పీడితులయ్యారు.

ఆ డాక్టర్ గారు కొన్ని మందులు రాసి, "ఇవి వాడండి. మార్పు రాకపోతే మళ్లీ వారము రోజుల తరువాత వచ్చి కనబడండి" అని చెప్పి పంపివేసాడు

కొన్ని రోజులు గడిచాయి. పడకగదిలో శబ్దాలు నర్సిములు ఒంటిలో భయంలా మరింత పెరుగసాగాయి.

ఒకరోజు నరసింహం భార్య చేతికి ఉన్న బంగారు గాజు పడకగదిలో ఉన్న కిటికీ పైన పెట్టి, స్నానానికి వెళ్ళింది. స్నానానంతరం పడకగదిలోకి వచ్చి బట్టలు మార్చుకుందామని అనుకుంటుండగా యేదో ఒక జీవి తన గాజును నోట కరుచుకొని వెళుతున్నట్లు అనిపించింది. ఆమె అలెర్ట్ అయ్యేలోగా పందికొక్కు సైజులో ఉన్న ఒక పెద్ద ఎలుక గాజును నోట కరుచుకొని పడక గదిలో ఒక మూలకుపేర్చి పెట్టబడి ఉన్న పెట్టెల దొంతి వెనుకాలకు దూరింది.

ఆమె నర్సిములును కేక వేసింది. నర్సిములు వచ్చాడు. ఆమె జరిగింది చెప్పింది. నర్సిములు దొంతులుగా ఉన్న పెట్టెలను పక్కకు జరుపుతూ పోయాడు. అపుడు కనిపించింది. గదికి మూలలో దుమ్ము ధూళి దూసరితమై ఉన్న ఒక రంధ్రం.

మరింత వెలుగుకోసం టార్చ్ లైట్ తెచ్చి వెలిగించాడు. ఆ రంధ్రంను ఒక

**మరింత వెలుగుకోసం టార్చ్ లైట్ తెచ్చి వెలిగించాడు. ఆ రంధ్రంను ఒక కర్రతో గెలికాడు. కర్ర గజముమేర లోపలికిపోయింది. ఫ్లోరింగ్ పాత కాలం నాటిది. కేవలము బండలు పరచబడినది. చాలాచోట్లు సిమెంట్ పెచ్చులు లేచిపోయి ఉన్నది. మెల్లెగా ఒక బండను పెకిలించాడు. లోపల ఒక పెద్ద ఖాళీ స్థలము కనిపించింది. ఇంకొక బండ తీసాడు.**

కర్రతో గెలికాడు. కర్ర గజముమేర లోపలికిపోయింది. ఫ్లోరింగ్ పాత కాలం నాటిది. కేవలము బండలు పరచబడినది. చాలాచోట్లు సిమెంట్ పెచ్చులు లేచిపోయి ఉన్నది. మెల్లెగా ఒక బండను పెకిలించాడు. లోపల ఒక పెద్ద ఖాళీ స్థలము కనిపించింది. ఇంకొక బండ తీసాడు.

అంతే...

ఉన్నట్లుండి నర్సిములు దంపతులు పడుకునే పడక గదిలో ఉన్న ఫ్లోరింగ్ బండల కింద నుండి పదుల సంఖ్యలో పందికొక్కులు ఒక్కసారిగా పైకి వచ్చాయి. కొన్ని మీద పడ్డాయి. నర్సిములు వాటిని అదిలించడముతో అవి అటూ ఇటూ తిరుగసాగాయి.

కొన్ని ఎలుకలు కూడా బయటికి వచ్చి, గది నిండా పరుగులు పెట్ట సాగాయి. నరసింహులు తన చేతిలో ఉన్న కర్రతో కొట్టి, మూడు, నాలుగు పంది కొక్కులను చావ బాదాడు. ఎలుకలు పారిపోయాయి.

ఇంకా యేమైన జీవులు అక్కడ ఉన్నాయేమోనని మరి కొన్ని బండలు పెరికాడు. అలా పెరుకుతూ పెరుకుతూ, తాము పడుకునే నేల వరకు బండలు పెరికాడు.

ఆ గదిలో సుమారు రెండు మూడు అడుగులలోతు మేర నేల అంతా పొక్కిలి పొక్కిలిగా ఉంది. ఆ పొక్కిలి అంతా రకరకాల వ్యర్థాలచే దుర్వాసనతో ఉన్నది.ఆ నేల లో ఉన్న గుంతను పరిశీలించాడు. గది గోడకు అవతల ఉన్న పెరడు దాకా పెద్ద రహదారియే ఉంది.

"అంటే ఇంటి నుండి బయటికి, బయటి నుండి ఇంటిలోకి పందికొక్కులు వస్తున్నాయి, పోతున్నాయి అన్నమాట" అనుకున్నాడు.

అంతా శుభ్రము చేయసాగాడు. పురావస్తు పరిశోధనలలో రకరకాల వస్తువులు దొరికినట్లు, ఆయింటి ఇల్లాలి బంగారు గాజుతో సహా ,ఆ ఇంటిలో పోయిన చిన్న చిన్న వస్తువులు, మరియు వాళ్ళవి కాని వస్తువులు దొరికాయి. బహుశా అవియే పక్కింటి వాళ్లవి అయి ఉండవచ్చు.

పూర్తిగా పందికొక్కులు వెళ్ళిపోయాయి అని నిశ్చయించుకున్న తరువాత నట్టింటిలో తవ్వుకున్న గుంతల మధ్య కూర్చుండిపోయాడు నరసింహులు.

కళ్ళు మూసుకున్నాడు. బుద్ధుడికి బోధి వృక్షము వద్ద జ్ఞానోదయమైనట్లు, నర్సిములుకు నట్టింటి గుంతల వద్ద జ్ఞానోదయమైనది.

ఇంతకాలము వచ్చిన శబ్దాలకు కారణము అర్థమైనది.

"ఎంత తెలివితక్కువగా ప్రవర్తించాను? జీవితములో సంభవించే కష్టసుఖాలకు, తప్పనిసరి అయిన ఆటుపోట్లకు, ఈ శబ్దాలకు ముడి పెట్టుకొని ఎంత బాధ పడ్డాను? ఎంత డబ్బు ఖర్చుపెట్టాను? నేను అదే డబ్బును నా యీ పాత ఇంటి బాగుకై ఖర్చు పెడితే ఇల్లు అయినా బాగు పడేది. నా భయాన్ని, బలహీనతను ఆసరా చేసుకొని అందరూ ఎలా దోచుకున్నారు! అమాయకుల తెలివితక్కువతనాన్ని లోకం ఎంత అందంగా దోచుకుంటుంది!" అనుకున్నాడు.

ఆలోచిస్తున్న కొద్దీ అంతకు ముందు తన మీదికి దూకిన పందికొక్కుల ముఖాలలో పూజారి, మంత్రకాడు, వాస్తు పండితుడు, డాక్టర్ కనబడసాగారు.

తనలో తాను నవ్వుకుంటూ, "వెంటనే ఇల్లు బాగు చేయించుకోవాలి" అనుకుంటూ, అక్కడి నుండి లేచాడు.

ముఖాముఖి

# తెలంగాణ సాహితీ వైభవాన్ని ముందు తరాలకు చాటాలి...

## - డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

తెలుగు సాహిత్యంలో అటు ప్రాచీన సాహిత్యంపై, ఇటు ఆధునిక సాహిత్య ప్రక్రియలపై సాధికారత కలిగిన సాహితీమూర్తులు అరుదుగా కనిపిస్తారు. అటువంటి వారిలో ముదిగంటి సుజాతా రెడ్డి విశిష్టులు. ప్రాచీన సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేసినా, సంస్కృత సాహిత్యంపై సమగ్ర అధ్యయనం చేసినా, ఆధునిక సామాజిక సమస్యలపై బలమైన కథలు, నవలలు వెలువరించినా అది ముదిగంటి సుజాతారెడ్డికే సాధ్యం. మను, వసు చరిత్రల తులనాత్మక పరిశీలన, శ్రీనాథుని కవితా సౌందర్యం వంటి ప్రామాణికమైన పరిశోధనలు చేసిన ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు నవలానుశీలనం, రసచర్చ - ఆధునికత వంటి ప్రామాణిక విమర్శను ఆధునిక సాహిత్యంపై కూడా చేయటం గమనార్హం.

ఇట్లా పరిశోధకురాలిగా, విమర్శకు రాలిగా, సాహిత్య చరిత్రకారిణిగా, కథకురాలిగా, వ్యాసకర్తగా, నవలా కారిణిగా, సంపాదకురాలిగా బహుముఖీ నమైన ప్రతిభను కనబరుస్తూ తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డితో పరిశోధక విద్యార్థిని ఉప్పుల పద్మ మాట - ముచ్చట..

**మీ బాల్యం, కుటుంబ నేపథ్యం మరియు విద్యాభ్యాసం గురించి వివరించండి.**



మా కుటుంబం భూస్వామ్య కుటుంబం. అయినప్పటికీ విద్యాగంధం లేని కుటుంబం. ఎవరూ చదువుకోలేదు. మా నాన్న నాలుగో తరగతి వరకు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నాడు. ఆయనకు చదువు పట్ల అంతగా అభిరుచి లేదు. మా నాన్న నాయనమ్మకు ఒక్కడే కొడుకు కావడం వల్ల వ్యవసాయమే చూసుకోవలసి వచ్చింది. ఆ విధంగా నాకు విజ్ఞానపరమైన వాతావరణం ఏమీ లేదు. చదువుకోవడానికి ప్రోత్సాహం అసలే లేదు.

నేను 1942లో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో జన్మించాను. ఒకనాటి అర్కవరమే నేడు ఆకారమైంది. మా ఊళ్లో సూర్యదేవాలయం ఉండడం వల్ల దానికి అర్కవరమనే పేరు వచ్చింది. నాకు మరీ చిన్ననాటి సంగతులు గుర్తు లేవు. కానీ 1947 తర్వాత సంగతులు కొంత గుర్తున్నాయి. ఆ సమయంలోనే మేము ఊరు విడిచి ఆంధ్ర ప్రాంతంలోని అద్దంకి, నరసరావుపేట ప్రాంతాలకు వలస పోయాము. ఆంధ్ర ప్రాంతంలోనే అక్షరాభ్యాసం చేయడం లీలగా గుర్తుంది. నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టుల పోరాటం వల్ల తలదాచుకోవడానికి మా అమ్మమ్మ ఊరైన వరంగల్ జిల్లా వెంకటాద్రిపేటలో కొంతకాలం ఉన్నాము. 1950 సం॥లో తిరిగి నల్గొండకు వచ్చాము. కమ్యూనిస్టులు మా ఇంటిని ధ్వంసం చేశారు. కాబట్టి నల్లగొండలోనే స్థిరపడ్డాము. అప్పటికి మా కుటుంబానికి చదువు ఆవశ్యకత కొంత తెలిసి వచ్చింది. కాబట్టి నన్ను నల్లగొండలో పాఠశాలలో చేర్పించారు. పదవ తరగతి వరకు నల్గొండలోనే చదువుకున్నాను. ఉన్నత విద్య కోసం (పి.యు.సి) నల్లగొండలో కాలేజీకి అనుమతి వస్తుందో రాదో అనే సందేహంతో నన్ను హైదరాబాద్ పంపించారు. అది కూడా చాలా ఆలోచించిన తర్వాత. రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డి బాలికల కళాశాల హాస్టల్లో చేర్పించారు. ఆ రోజుల్లో పి.యు.సి. చదివే వయసు వచ్చేనాటికే

బాలికలకు పెళ్లిళ్లు చేస్తూ ఉండేవారు. నాకు చదువుకోవాలనే బలమైన ఆకాంక్ష ఉండటం చేత నన్ను కాలేజీలో చేర్పించారు. అప్పటికే మా మేనత్త ఒకామె హైదరాబాదులో హాస్టల్లో ఉండి చదువుకోవడం చేత ఆమెను ఆదర్శంగా తీసుకొని నేను చదువుకున్నాను. పి.యు.సి. అనంతరం తిరిగి నల్లగొండకు వచ్చి నాగార్జున కళాశాలలో డిగ్రీలో చేరాను. డిగ్రీ ప్రథమ సంవత్సరం పూర్తయిన తర్వాత నాకు ముదిగంటి గోపాలరెడ్డితో వివాహమైంది. అనంతరం ద్వితీయ, తృతీయ సంవత్సరాలు హైదరాబాదులో పూర్తి చేశాను.

**నల్లగొండలో ఒక మారుమూల ప్రాంతంలో పుట్టిన సుజాతా రెడ్డి సాహిత్యం వైపు మళ్లడానికి స్ఫూర్తి ఎవరు?**

నల్లగొండలో నేను పాఠశాల విద్యను అభ్యసిస్తున్న రోజులలో ఆంధ్రప్రభలో మాలతీ చందూర్ రాసే లేఖలు బాగా చదివేదాన్ని. వాటికి జవాబులివ్వటం నాకు అభిరుచిగా మారింది. అదే రోజుల్లో మా పాఠశాల నుండి నాగార్జునసాగర్ విహారయాత్రకు వెళ్ళాము. అప్పటికి ఇంకా సాగర్ డ్యామ్ కట్టలేదు. నాగార్జున కొండను చూసి వచ్చాము. ఆ విశేషాలన్నీ ఒక వ్యాసంగా రాసి మాలతీచందూర్ నిర్వహిస్తున్న ప్రమదావనం శీర్షికకు పంపించాను. ఆంధ్రప్రభ పత్రికలో మాలతీ చందూర్ ప్రమదావనం అనే శీర్షికను నిర్వహించేవారు. అందులో నా వ్యాసం అచ్చయింది. అది నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆ రోజుల్లో చందమామ కథలను ఎంతో ఆసక్తిగా చదివేదాన్ని. వాటిని చదివిన ప్రేరణతో నేను కథలు రాసేదాన్ని. అవి ఏ పత్రికలోనూ అచ్చు కాలేదు. కానీ రాయాలన్న జిజ్ఞాస మాత్రం మొదలైంది. పి.యు.సి. చదువుతుండగా నా తొలి కథ 'జీవన్మృతుడు' 1956వ సం॥లో గోల్కొండ పత్రికలో అచ్చయింది. కాలేజీ మ్యాగజైన్లో 'లావణ్య' అనే కథ రాశాను. మరో రెండు మూడు కథలు గోల్కొండ పత్రికలో అచ్చయినట్లు గుర్తు. కానీ పేర్లు గుర్తు లేవు. బిఏ చదివే రోజుల్లో కొన్ని కవితలు కూడా రాశాను. శ్రీశ్రీ పై రాసిన కవితకు ఉత్తమ రచనగా బహుమానం వచ్చింది. కాలేజీ మ్యాగజైన్ సంపాదకురాలుగా నా పేరు వేశారు. బహుమానంగా మనుచరిత్ర గ్రంథాన్ని ఇచ్చారు. తర్వాత కాలంలో 'మను, వసుచరిత్రల తులనాత్మక పరిశీలనం' అనే అంశంపై పరిశోధన చేశాను.

**పరిశోధన, కథ, నవల, విమర్శ, సాహిత్య చరిత్ర రచన ఇలా పలు ప్రక్రియల్లో రచనలు చేసిన మీకు మీ రచనల్లో అత్యంత ఇష్టమైనది ఏది?**

నాకు ప్రక్రియ పరంగా చూసినప్పుడు విమర్శ, కథ అంటే ఎక్కువ ఇష్టం. నా రచనల్లో నాకు ఎక్కువగా సంతృప్తి కలిగించిన నవల 'మలుపు తిరిగిన రథచక్రాలు'. ఇష్టమైన కథాసంపుటి 'విసుర్రాయి'. మరొక ముఖ్యమైన రచన 'సంస్కృత సాహిత్య చరిత్ర'. ఇది నా భర్త ముదిగంటి గోపాలరెడ్డితో కలిసి వెలువరించాను. నేను జర్మనీలో గ్రంథాలయంలో పనిచేసే రోజుల్లో సేకరించిన సమాచారం, సంస్కృతంపై ఆనాటి పాశ్చాత్య పండితుల మరియు గ్రంథాలు అధ్యయనం చేసి రాసుకున్నాను. సంస్కృత సాహిత్య చరిత్ర కోసం సుమారు పది సంవత్సరాలు కష్టపడ్డాను. గోపాలరెడ్డి కూడా సంస్కృత సాహిత్యాన్ని ఔపోశన పట్టినవారు కావడం వలన ఇరువురం కలిసి సంస్కృత సాహిత్య చరిత్ర రాశాము. దీనిని మొదట తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. ఆ తర్వాత ఎన్నో ముద్రణలు పొందింది. నేటికి సాహిత్య విద్యార్థులకు ప్రామాణిక గ్రంథంగా కొనసాగుతుండటం ఆనందించే విషయం. నేను సేకరించుకొన్న సమాచారం మేరకు ఆ గ్రంథం ఇంకా విస్తృతంగా రాయవలసినది కానీ సంగ్రహంగా పూర్తి చేయవలసి వచ్చింది.

**మీ మొదటి కథా సంపుటి 'విసుర్రాయి' మొదలు 'నిత్య కల్లోలం' దాకా మీ కథల్లో ప్రపంచీకరణ ప్రభావం, తెలంగాణ ప్రజల దైన్యస్థితులు కనిపిస్తాయి. ఇటువంటి కథలు రాయడానికి మిమ్మల్ని ప్రేరేపించిన పరిస్థితులు ఏమిటి?**

నేను సమాజంలో చూసిన విషయాలనే కథలుగా మలిచాను. ఉదాహరణకు నేను రాసిన కథలో తాగుడుకు బానిసైన భర్త అస్తమానం భార్యను కొడుతూ చివరికి ఇల్లు వదిలిపోతే ఇస్త్రీ చేసుకుంటూ ఐదుగురు పిల్లలతో బతుకుబండిని లాగిన చాకలి స్త్రీని గురించి చెప్పాను. ఇది మా ఇంట్లో పని చేసిన ఒక స్త్రీని స్వయంగా పరిశీలించి రాసిన కథే. మరో కథలో అప్పుల బాధలు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్నప్పుడు కుటుంబ భారాన్ని భుజానికి ఎత్తుకొన్న యాదమ్మ సంధించే ప్రశ్నలు 'జవాబుల్లేని ప్రశ్నలు' అనే కథ ద్వారా తెలియజెప్పాను. ఈ పాత్రలన్నీ నా నిజ జీవితంలో చూసినవే. ప్రత్యేకించి అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు పురుషుల కంటే ఎక్కువగా శ్రమిస్తారు.



వారి జీవితగాథలే నా కథలకు ఇతివృత్తాలు. నేను చూసిన సంఘటనలతో పాటు జరుగుతున్న సమకాలీన సంఘటనలను కథలుగా మలిచాను. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో వస్తున్న మార్పులను కథలుగా చిత్రించాను.

**ఆధునిక ప్రక్రియైన నవలకు రస సిద్ధాంతాన్ని ఎలా అన్వయించగలిగారు?**

పాశ్చాత్య సిద్ధాంతాలను అనుకరిస్తూ సిలబస్ రూపొందించడం కంటే కొత్త ఆలోచనలతో, వ్యాఖ్యానాలతో, విమర్శ సూత్రాలను, సిద్ధాంతాలను తయారు చేసుకోవడం ఎంతో అవసరమని నేను భావిస్తాను. అప్పుడే మన సాహిత్యపు ప్రత్యేకత ప్రతిబింబిస్తుంది. అనుకరణ, అనుసరణల కంటే కొత్త పోకడలు పోవడం అవసరం. అందుకే రస సిద్ధాంతాన్ని మనస్తత్వశాస్త్రంతో జోడించి నవలలను విశ్లేషించే కొత్త ప్రయోగం చేశాను.

**స్త్రీ సమానత్వాన్ని, స్త్రీ స్వేచ్ఛను బలంగా కాంక్షిస్తూ 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' అనే నవల రాశారు కదా. ఈ నవలకు రావాల్సినంత గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?**

'ఆకాశంలో విభజన రేఖల్లేవు' అనే నవలను 1995లో రాశాను. దీనిపై అనేక గ్రంథ సమీక్షలు వచ్చాయి. కొందరు స్త్రీవాద వ్యతిరేకమని కూడా విమర్శించారు. రాడికల్ ఫెమినిజం అతివాద స్త్రీవాద ధోరణులు కలవాళ్ళు పురుష విద్వేషం ప్రకటించడాన్ని ఒక విధంగా విమర్శించడానికే ఈ నవల రాశాను. మంచి లేదా చెడు అనేది స్త్రీ పురుషులిరువురిలోనూ ఉంటుంది. పురుషులందరూ చెడ్డవాళ్లే అని చెప్పడం అతివాదమవుతుంది. అట్లా అని స్త్రీవాదాన్ని నేను ఎక్కడా తక్కువ చేయలేదు. ఈ నవలలో ప్రధాన స్త్రీ పాత్రలు సమర్థులై, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో తమ భాగస్వాముల సహకారంతో కార్యనిర్వహణ చేసినట్లు వర్ణించాను. స్త్రీలకు పురుషులు తోడ్పడితేనే స్త్రీవాదం విజయవంతం అవుతుంది. కానీ పురుష విద్వేషంతో కాదని నా అభిప్రాయం. అదే ఈ నవలలో కనిపిస్తుంది.






**సంస్కృతాంధ్ర భాషల్లో మీరు ఇంత పట్టు సాధించడానికి ప్రధాన కారణమేమిటి?**

నాకు మొదట్లో సంస్కృతంపై అంత పట్టు లేదు. కానీ నా భర్త గోపాలరెడ్డి సంస్కృత పండితుడు. ఆయన నిరంతరం ఇంట్లో సంస్కృతంలో వేదాలు, ఉపనిషత్తులు, వివిధ గ్రంథాలు అధ్యయనం చేస్తూ ఉండేవారు. ఆ క్రమంలో ఆ ప్రభావం నాపై పడింది. నేను కూడా సంస్కృతం అధ్యయనం చేయటం మొదలుపెట్టాను. ఆ విధంగా విని విని సంస్కృతంపై నాకు కూడా అభిరుచి కలిగింది. అలా నేను కూడా సంస్కృత సాహిత్యాన్ని అధ్యయనం చేయడం మొదలుపెట్టాను.

**సంస్కృతాంధ్ర సాహిత్యాలలో ఇంత పట్టు ఉన్న ముదిగంటి సుజాతారెడ్డి పాత్రోచిత భాషను ఉపయోగించడంలో అవరోధాలు ఎదురవలేదా?**

ఏ ఇబ్బంది ఎదురుకాలేదు. విమర్శ, పరిశోధన రాసేటప్పుడు ఒక విధమైన భాషను, కథ, నవల రాసేటప్పుడు ఆ ప్రక్రియకు తగిన భాషను వాడాను. పాత్రోచిత భాషను రాసేటప్పుడు ఆ పాత్రలో లీనమై రాశాను. అందుకే సంభాషణలు సహజంగా కనిపిస్తాయి. రాసేటప్పుడు నాకు నేను మోనో యాక్టింగ్ చేసుకున్నట్లుగా అనుభూతిని చెంది రాస్తాను.

**సాహిత్యంలో మీకు నచ్చిన రచనల**



గురించి తెలియజేయండి.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమే. అనేకమంది సాహితీవేత్తల పుస్తకాలు ఇష్టంగా చదివాను. కానీ ముఖ్యంగా వట్టికోట ఆళ్వారుస్వామి రచనలను నేను ఎక్కువగా ఇష్టపడతాను. ఎంతో ప్రతికూలమైన వాతావరణం లోనూ ఆయన చదువుకొని గొప్ప రచనలు చేశారు. ఆనాటి సామాజిక పరిస్థితులను తన కథల్లో, నవలల్లో చిత్రించారు. అందుకే వట్టికోట వారి రచనలు అంటే నాకు ఎంతో ఇష్టం.

**మిమ్మల్ని ప్రభావితం చేసిన రచయిత ఎవరు?**

నా భర్త ప్రభావం నాపై ఉంది. హిందీలో ప్రేమ్‌చంద్ శరత్, చంద్ర సాహిత్యం ప్రభావం నాపై ఉంది. శరత్ చంద్ర పాత్ర చిత్రణ నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. ఆంగ్లంలో మాక్సిం గోర్కి, జాఫ్రీ యార్చర్‌ల కథాసంవిధానం, కథావస్తువులు నన్ను ప్రభావితం చేశాయి. తెలుగులో అడవి బాపిరాజు రచనల ప్రభావం నాపై ఉంది.

**నేటి సాహిత్య ధోరణులపై మీ అభిప్రాయం ఏమిటి?**

తెలుగు సాహిత్యంలో ఒకప్పుడు ఏదేని వాదం ఆవిర్భవించినప్పుడు కొంతకాలం స్థిరంగా ఉండేది. ఉదాహరణకు అభ్యుదయవాదం సుమారు 40 సంవత్సరాలు కొనసాగింది. ఆ తర్వాత వచ్చిన దిగంబరకవులు కానీ విప్లవ వాదం కానీ స్త్రీవాదం, దళితవాదం కానీ వాటి ఉధృతి పది సంవత్సరాలకు మించి ఉండటం లేదు. పరిస్థితులు మారుతూ ఉంటే వాటి ప్రభావంతో ప్రజల యొక్క అభిప్రాయాలతో ఆయా వాదాల ధోరణులు మారుతున్నాయి. కాబట్టి వాదనలు కూడా మారుతున్నాయి.

**మీరు చేసిన సాహిత్యకృషికి తగిన గుర్తింపు లభించిందని భావిస్తున్నారా?**

గుర్తింపు కొరకు నేను ఎప్పుడూ ఆశించలేదు. నా రచనలు పాఠకులకు చేరుతున్నాయా అనేదే ప్రధానాంశం. చాలా వరకు విద్యార్థులు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలుపుతూనే ఉన్నారు. నా గ్రంథాలు చాలా మటుకు పునర్ముద్రణలు, పొందాయి. అందువల్ల గుర్తింపు ఉన్నదనే భావిస్తున్నాను.

**తెలంగాణ ఆవిర్భావ అనంతరం సాహిత్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంపై మీ అభిప్రాయం ఏమిటి?**

సాహిత్యాన్ని ఎప్పుడూ ప్రభుత్వాలు ప్రోత్సహించవు. సాహిత్యకారులే తమ అభిప్రాయాలను సాహిత్యంలో వివిధ ప్రక్రియల ద్వారా వ్యక్తీకరించాలి. ఒకవేళ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అనుకుంటే కవులకు ప్రముఖ కవుల పేరిట అవార్డు లు ఇవ్వడం ఇత్యాది అంశాలు ఉంటాయి. ఇది తెలంగాణలో జరుగుతుంది. అంతేగాని ప్రభుత్వం ఏమీ కవులను ప్రభావితం చేయదు.

**నమస్తే తెలంగాణ పత్రికలో తెలంగాణ సాహిత్య ప్రస్థానం శీర్షికతో అద్భుతమైన వ్యాసాలు రాస్తున్నారు. ఈ ఆలోచన మీకెలా కలిగింది?**

నమస్తే తెలంగాణ పత్రిక వాళ్ళు తెలంగాణ సాహిత్యంపై వ్యాసాలు రాయమని అడిగారు. తెలంగాణ సాహిత్యంలో వచ్చిన వివిధ ప్రక్రియలు వాటి గొప్పదనం ఈ వ్యాసాలలో వివరించాను. ఒకప్పుడు తెలంగాణలో సాహిత్యమే లేదు. తెలుగే లేదు అనే అభిప్రాయం వ్యాప్తిలో ఉండేది. తెలంగాణీయులను కించపరచడం, నిరుత్సాహపరచడం వంటి పరిస్థితులు ఉండేవి. పోతన వంటి మహాకవులను కూడా ఆంధ్ర ప్రాంతం వారీగా చిత్రించే కుట్ర జరిగింది. అటువంటి పరిస్థితుల్లో మనం మన భాషను అభిమానిస్తూ మన భాషలో రాయవలసిన పరిస్థితి ఏర్పడింది. మన సాహిత్యపు గొప్పదనాన్ని తెలియ పరచవలసిన స్థితి ఏర్పడింది. ప్రత్యేకించి ఈ వ్యాసాల ద్వారా తెలంగాణ సాహిత్య గొప్పదనాన్ని వివరించదలిచాను. ఇప్పుడు తెలంగాణలో తెలంగాణ సాహిత్యంపై విస్తృతమైన పరిశోధనలు జరుగుతు న్నాయి. పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ విషయం. తెలుగులో అనేక ముఖ్యమైన ప్రక్రియలు అన్నీ తెలంగాణ ప్రాంతంలోనే ఉద్భవించాయి. వీటిని పాఠకులకు అందించడం కోసమే ఒకవైపు చరిత్రను చెబుతూ చరిత్ర పరిణామక్రమంలో సాహిత్యం చరిత్రను ఎలా ప్రభావితం చేసిందో ఈ వ్యాసాల్లో వివరిస్తున్నాను. తెలంగాణ సాహితీ వైభవాన్ని ముందు తరాలకు చాటాలి. ఈ లక్ష్యంతోనే తెలంగాణ సాహిత్య ప్రస్థానం వ్యాసాలు రాస్తున్నాను.

**వర్తమాన కవులు, రచయితల సాహిత్యంపై మీ అభిప్రాయం?**

వర్తమాన కవులు, రచయితలు చాలా బాగా రాస్తున్నారు. ఎప్పటికప్పుడు సమాజంలో జరిగే పరిణామాలు చిత్రిస్తూ, సమాజంలో మార్పును ఆశిస్తూ చక్కని రచనలు చేస్తున్నారు. తెలంగాణ నుంచి ఎక్కువ సంఖ్యలో కవులు, రచయితలు వస్తుండడం శుభపరిణామం.

ఇంటర్వ్యూ :
**ఉప్పుల పద్మ**
99591 26682



కథ

# నూనె లేని దీపాలు

రంగుల లోకంలో ఒక స్త్రీ మనోవేదనను
చిత్రించిన కథ...



డా॥ జడా సుబ్బారావు
98490 31587

ఆత్మీయులెవర్నో కోల్పోయినట్లు ఆకాశం పెడబొబ్బలు పెడుతోంది. కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆకాశాన్ని అప్పుడప్పుడూ వచ్చే మెరుపులు ఓదార్చుతున్నాయి. కిటికీకి దగ్గరగా కూర్చుని ఉరుముతున్న ఆకాశాన్ని, కురుస్తున్న వాననీ చూడసాగింది మల్లిక.

దేనికదే అమర్చినట్టున్న అవయవ సౌందర్యం గదిలోని ట్యూబులైట్ కాంతికి మరింత మెరిసిపోతోంది. తలస్నానం చేసి వదిలేసిన జుట్టు సముద్రపు అలల్లా చెల్లాచెదురుగా ఎగసిపడుతోంది. సన్నగా పొడుగ్గా చెవులకు వేలాడుతున్న కాడల్లాంటి వస్తువు గాలికి తోడుగా ఉయ్యాలూగుతోంది. అగ్ని పర్వతమేదో బద్దలై లావా విరజిమ్మినట్లుగా ఏకధాటిగా కారుతున్న కన్నీళ్ల చెంపల్ని తడుపుతున్నాయి. చేతితో కిటికీ ఊచను బిగించి పట్టుకుని, మసక మసగ్గా కనిపిస్తున్న వీధివంక దృష్టి సారించింది.

ఎడతెరిపిలేని వర్షానికి వీధులన్నీ నిశ్శబ్దాన్ని ముసుగేసుకున్నాయి. పనున్నా లేకున్నా పదిసార్లు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్న కుక్కల జాడ తప్ప రోడ్డంతా శ్మశాన వైరాగ్యాన్ని పులుముకుంది. కొన్ని రోజుల క్రితం వరకూ వచ్చిపోయే వాళ్లతో కిటకిటలాడిన రోడ్డు, ఎక్కి, దిగేవాళ్లతో హడావిడిగా ఉన్న గుమ్మం... అనుకోకుండా వచ్చిన వైధవ్యానికి అల్లాడిపోతున్న వితంతువులా బోసిపోతోంది.

అప్రయత్నంగా మల్లిక పెదాలపై నవ్వు కదలాడింది. అశక్తతలోంచి, నిర్లిప్తతలోంచి కూడా అప్పుడప్పుడు నవ్వు వస్తుందేమో!

నవ్వుతున్నప్పుడు సున్నాలా కనిపించే తన పెదాలు బాగున్నాయంటాడు ఒకడు! నవ్వుతుంటే తళుక్కున మెరిసే పలువరుస తెల్లని పగడాల్లా కనిపిస్తున్నాయంటాడు మరొకడు! కళ్లను సగం మూసి చప్పుడు వచ్చీరానట్లుగా నవ్వుతుంటే తనకిష్టం అంటాడు ఇంకొకడు! ఒక్కొక్కడిదీ ఒక్కో రుచి, ఒక్కో పైత్యం! తనను తాను చంపుకుని పెదాలపై నవ్వులను ఒంపుకుంటేనే బతుకుబండి గతుకులొచ్చినా ఒడిదుడుకులు లేకుండా సాగిపోతోంది.

ఏమయితేనేం... నవ్వుతూ పెదాల ద్వారంనుంచి గుండెల్లోకి మనిషిని ఆహ్వానించడం అంత తేలిక కాదు, అది తనకు, తనలాంటి వాళ్లకు మాత్రమే అలవాటైన విద్య, ఇష్టం లేకపోయినా కష్టపడి నేర్చుకున్న విద్య, ఆకర్షించడానికి అనువైన మార్గంగా ఎంచుకున్న విద్య! కానీ ఇప్పుడు నవ్వాలంటే బాధగా ఉంది! అదిమిపెట్టి దాచిన బాధ గుండెను మెలేసి ఎక్కడ కన్నీళ్లుగా జారి కడుపులోని ఆకలికి ఆజ్యం పోస్తుందోనని భయం!.

ఒక్కసారి తల విదిల్చి వానవంక చూసింది మల్లిక.

వాన కొందరికి వినోదం... మరి కొందరికి విచారం! వాన కొందరికి వెచ్చటి దుప్పటి... మరికొందరికి వెలగని కుంపటి! వానను చూస్తున్న కొద్దీ అటక మీద దాచిన ట్రంకుపెట్టెలోని జ్ఞాపకాలన్నీ కళ్లముందు చినుకులుగా రాలసాగాయి. చిన్నప్పుడు వానలో ఆడుకుంటానని తను తడిస్తే జలుబొస్తుంది వెళ్ళొద్దని అమ్మ! వెళ్తానని ఏడుస్తూ తను, వద్దని వారిస్తూ ఓదారుస్తూ అమ్మ! మారాం చేసి, మంకుపట్టు పట్టి వానలో తడిసి జలుబు, జ్వరం వస్తే తనను తిట్టకుండా కొట్టకుండా, తను చూడకుండా చాటుగా కళ్ళొత్తుకునే అమ్మ ఇప్పుడెలా ఉందో? ఏం చేస్తోందో? తనను తల్చుకుంటుందో లేదో? తనకోసం ఏడుస్తుందో లేదో?

పిచ్చితల్లులు... పిల్లల్ని గుండెల్లో పెట్టుకుని కాపాడుతుంటారు. నిద్ర మానుకుని పిల్లలకోసం ఎదురుచూస్తుంటారు. తనలాగే ఆ పిల్లలేమో వాళ్ల గుండెల్ని గునపాలతో పొడిచి గుమ్మం దాటుతుంటారు. కళ్లముందు నాశనమయ్యే ఎన్ని జీవితాలను చూస్తున్నా ఉద్రేకం రుచి ఎప్పటికప్పుడు కొత్తగానే ఉండడం దురదృష్టం!

అడవి తగలబడిన తర్వాత కురిసిన వానలా, బతుకు బుగ్గి అయ్యాక తనకు తెలివొచ్చింది.

'దేవుడు నిన్ను ఇంతందంగా ఎందుకు పుట్టించాడే? ఆడపిల్లని నాకే ఇలా ఉంటే ఇక మగపిల్లల పరిస్థితి. ఎలా ఉందో?', 'నువ్వు నీ ఇంట్లో చెడబుట్టావు. కొంచెం ఆస్తిపరులు ఇంట్లో పుట్టివుంటే ఈ పాటికి హీరోయిన్‌గా వెలిగిపోయే దానివి', 'ఇప్పటికైనా మించిపోయింది లేదు, తెలిసిన వాళ్లను పట్టుకుని సినిమాల్లో ట్రై చేసుకో...! స్నేహితురాళ్ల మాటలు తనమీద మందుగోళీల్లా పనిచేశాయి. మాదకద్రవ్యాల్లా మత్తులోకి దించాయి.

దాని ఫలితం... తనవంక ఆరాధనగా చూసే 'ఆకర్ష్'ని తీసుకుని హైదరాబాద్ రైలెక్కింది. అతనికి పరిచయం ఉన్న స్నేహితుల రూముల్లోనూ, హోటల్ గదుల్లోనూ జీవితం చేదు అనుభవాల్ని మూటగట్టుకుంది. మాటల మత్తు క్రమక్రమంగా వదిలిపోతూ వాస్తవ జీవితాన్ని కళ్లముందు ఉంచింది. అద్దమెప్పుడూ మన చేతుల్లో ఉంటేనే దానికి భద్రత. ఒక్కసారి అది ఎదుటివాళ్ల చేతుల్లోకి వెళ్లాక గాజుపెంకులు తప్ప ఏమీ మిగలవు.

**అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్న ఆమె కాళ్లకు ఒక కాగితం ముక్క ఎగురుకుంటూ వచ్చి అడ్డంపడింది. చేత్తో కాగితాన్ని తీసి చెత్తబుట్టలో వేయబోతూ ఆగింది. అందులోని కవిత వైపు మల్లిక కళ్లు ఆత్రంగా పరుగులు పెట్టాయి. మెదడంతా మొద్దుబారినట్లుగా ఉంది.**

జీవితమూ అంతే! అన్నీ తెలిసినా ఒక్కోసారి వాటిని అమల్లో పెట్టలేము. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఏమీ ఉండదు. వీధిలోకి విసిరిన మాంసం ముక్కకోసం కాకులెగబడ్డట్టు ఆకర్ష్‌కి తెలిసిన వాళ్లందరి దగ్గరా పరిచయాల పేరుతోనూ, ఒకరి తర్వాత ఒకరుగా 'అవకాశం' పేరుతో సాగిస్తున్న వికృతచూపుల పర్వాన్ని భరించలేక "సినిమాలూ వద్దూ, ఏమీ వద్దూ, ఇంటికెళ్లిపోదాం" అంది మల్లిక ఒకసారి.



అతని చూపుల్లోని సూదుల తాకిడికి ఆమె శరీరం నిలువెల్లా కుంచించిపోయింది. తనను ఆశించినప్పుడు అతని కళ్లల్లో కనిపించిన ఆరాటం స్థానంలో, వస్తువును సొంతం చేసుకున్నాక కలిగే నిర్లక్ష్యం తొంగిచూసింది. కోరిక తీరాక కలిగే మనోవికారం ముఖంలో ప్రతిఫలించింది. అయినా అదేమీ కనిపించనీయకుండా మెల్లగా దగ్గరకొచ్చి "ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ ఇంటికి వెళ్తావు? ఊరివాళ్ళు ఉమ్మేసి తరుము తారు. ఇంటివాళ్లు ఉరేసుకుని చస్తారు! కాలు బయటపెట్టాక చావోరేవో తేల్చుకోవాలి గానీ వెనక్కి తిరిగి చూడకూడదు. కొన్ని రోజులు ఓపిక పట్టు... తెలిసిన ఆంటీ ఉంది. ఆమెకి నిన్ను అప్పగించి నేను వెళ్ళిపోతాను. ఆమెకు సినిమావాళ్లతో చాలా పరిచయా లున్నాయి. ఎక్కడో ఒకచోట నిన్ను ఫీల్డ్‌లో దించుతుంది" అన్నాడు.

పులిని చూసిన లేడిపిల్లలా భయం భయంగా అతనివంక చూస్తూ ఎటు తిరిగితే అటు బుర్ర ఊపింది. పైకి అమాయకంగా కనిపించే ఆకర్ష్ ఆ క్షణంలో ఎంతో పరిణతి చెందినట్లుగా కనిపించాడు. అతని పరిచయాలు తనకొక దారి చూపిస్తాయని, తననొక ఒడ్డుకు చేరుస్తాయని భావించిన మల్లిక మనసు కొద్దికాలంలోనే సమ్మెటపోటు తిన్నట్లుగా విలవిల్లాడిపోయింది.

బతుకునిండా చీకటినింపి 'ఆకర్ష్' వెళ్ళిపోయాడు. నడిసముద్రంలో చిక్కుకుపోయిన ఒంటరి నావలా, రాహుకేతువులు మింగిన జాబిల్లిలా మల్లిక చీకటి గదుల్లో మిగిలిపోయింది.

రోజులు గడిచేకొద్దీ 'ఫీల్డ్' ఎంత భయంకరంగా ఉంటుందో ఆమెకు అనుభవంలోకి వచ్చింది. నిద్రరాని రాత్రులు, కడుపుమాడిన రోజులు, ఇష్టం లేకపోయినా నవ్వును పెదాలపై పులుముకుని విలాసపురుషుల కోసం ఎదురుచూస్తూ గడపడం ఆమె జీవితాన్ని నిప్పుల కుంపట్లోకి నెట్టేసింది. మానని గాయాలతో మామూలు మనిషిలా తిరగడం అలవాటు చేసుకుంది.

కిటికీలో నుంచి జల్లుకొట్టడంతో ఆలోచనల్లో నుంచి బయటికొచ్చి వంటగది వైపు నడవసాగింది. ఒక్కసారిగా కళ్ళు బైర్లు కమ్మాయి. అడిగింది ఇవ్వకపోతే మారాం చేసే చిన్నపిల్లల్లా

పేగులు అదేపనిగా ఏడుస్తున్నాయి. ఆకలి బాధ ఇంతకుముందు అనుభవంలో ఉన్నా, ఇప్పుడు మాత్రం ఏదో ఒకటి తింటేగానీ అడుగు ముందుకు కదిలేలా లేదు. ఆమె దేహం వశం తప్పుతున్నట్లుగా అనిపించింది.

అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్న ఆమె కాళ్లకు ఒక కాగితం ముక్క ఎగురుకుంటూ వచ్చి అడ్డంపడింది. చేత్తో కాగితాన్ని తీసి చెత్తబుట్టలో వేయబోతూ ఆగింది. అందులోని కవిత వైపు మల్లిక కళ్ళు ఆత్రంగా పరుగులుపెట్టాయి. మెదడంతా మొద్దుబారినట్లుగా ఉంది. ఆకలితో మసకబారిపోతున్న కళ్లను మూసి ఆర్తుతూ కవిత్వం చదివి చివర్లో కనిపించిన రచయిత ఫోన్ నంబరు రాసి టేబులుమీద ఉంచింది.

గ్లాసెడు మంచినీళ్ళు తాగొచ్చి టేబుల్ దగ్గర కూర్చుంది. ఎదురుగా కనిపిస్తున్న నంబరు వంక చూస్తూ ఆలోచించసాగింది. 'ఈ వేళలో ఫోన్ చేస్తే తీస్తాడో లేదో' అన్న సందిగ్ధత కంటే తీస్తే ఎంతో కొంత సాయం చేస్తాడనే ఆశ ఆమెచేత నంబరు డయల్ చేయించింది.

"హలో..." గొంతులో వణుకుతున్న చప్పుడు. ఆమెకే స్పష్టంగా వినిపించ సాగింది.

"హలో... ఎవరూ" వేళకాని వేళలో ఫోన్ తీసిన చిరాకు మాటలో ప్రతిధ్వనించింది.

"మీరు... మీరు... రాఘవ గారేనా?"

"అవును, మీరు?" అడిగింది అవతలి గొంతు,

"నా పేరు మల్లి... మల్లిక..." తడబడిందొక నిముషం.

"ఒక్క నిముషం" అతను నడుస్తు న్నట్లుగా చప్పుడు వినిపించసాగింది.

"చెప్పండి... ఈ వేళప్పుడు ఏమిటిలా" అన్నాడు.

"ఇప్పుడే మీ 'ఆకలి చూపు' కవిత చదివాను. నన్ను నేను చూసుకున్నాను. అందుకే" అంది.

ఒక్క క్షణం తర్వాత "అవునవును... అది రాసి చాలా కాలమైంది"

"నాకిప్పుడే దొరికింది" అంది.

"చెప్పండి.... మీరు ఎక్కడినుంచి?" అడిగాడు అవతలినుంచి,

"హైదరాబాద్"

"హైదరాబాదులో ఎక్కడ?" అడిగాడతను.

"దేహం మీద తప్ప దాహం మీద దృష్టి నిలపని కళ్ల మధ్య, ఆక్రమించుకోవడమే గానీ ఆకలి గుర్తెరగని వాళ్ల మధ్య, చెలగాటమాడడమే గానీ చేరదీసేవాళ్ళు లేనివాళ్ల మధ్య నిస్సహాయంగా బతుకీడ్చు తున్నదాన్ని..."

అటునుంచి ఏమీ సమాధానం వినిపించకపోవడంతో "హలో" అంది మల్లిక.

"వింటున్నాను...." ముక్తసరిగా వినిపించింది.

"ఆకలిగా ఉందండి... మూడురోజుల నుంచీ ఏమీ లేదు... ఏదైనా సహాయం చేస్తారని" ఆగింది.

అవతలి నుంచి "ప్చ్..." అనే నిట్టూర్పు, వెనువెంటనే "చూడమ్మా... మన ప్రాణం నిలిచి ఉందని దేశమంతా అలాగే ఉందని భ్రమపడకూడదు. నేనున్నచోట నుంచి కాలు బయటపెట్టే పరిస్థితి లేదు. నువ్వేమో వేళకాని వేళలో చేశావు. ప్రస్తు తానికి అందుబాటులో ఎవరైనా ఉంటే ఏదైనా ఏర్పాటు చేసుకో, వీలునుబట్టి నేను ప్రయత్నం చేస్తాను?" ఏదైనా

> **రోజులు గడిచేకొద్దీ 'ఫీల్డ్' ఎంత భయంకరంగా ఉంటుందో ఆమెకు అనుభవంలోకి వచ్చింది. నిద్ర రాని రాత్రులు, కడుపు మాడిన రోజులు, ఇష్టం లేకపోయినా నవ్వును పెదాలపై పులుముకుని విలాస పురుషుల కోసం ఎదురుచూస్తూ గడపడం ఆమె జీవితాన్ని నిప్పుల కుంపట్లోకి నెట్టేసింది. మానని గాయాలతో మామూలు మనిషిలా తిరగడం అలవాటు చేసుకుంది.**

సహాయం చేస్తే బాగుండు అన్నట్లుగా ఉంది అతని గొంతు.

"మాతో ఆడుకునేవాళ్ళే గానీ ఆదుకునేవాళ్ళు ఎవరుంటారు సార్? రోగమెక్కడ అంటుకుంటుందోనని గుమ్మాల్లోకి తొంగిచూసేవాళ్ళే కరువయ్యారు. తెలిసినవాళ్లకి ఫోన్ చేస్తున్నా ఎవ్వరి నుంచీ సమాధానం లేదు. రోడ్లమీద చిక్కుబడిన వాళ్లకి, ఇంట్లోనే ఉంటూ గుమ్మం దాటనివాళ్లకి ఎవరో ఒకరు సాయం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు నా వృత్తే నాకు శాపమైంది. ఒకప్పుడు నాలో అమృతం ఉందని ఎగబడిన వాళ్లందరికీ నేనిప్పుడు కాలకూటవిషంలా మారిపోయాను" అంది.

"చూడమ్మా.... వృత్తిని బట్టి సాయం, వ్యక్తిని బట్టి న్యాయం జరిగే రోజులివి. కన్ను పోయేటట్లు కాటుక పెట్టుకుంటే బతుకు మసగ్గానే ఉంటుంది. నువ్వు చెప్పేది వింటుంటే బాధగా ఉంది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి.. ఉంటాను మరి" అన్నాడు.

కాసేపటి మౌనం తర్వాత ఫోన్ పెట్టేముందు "ఒక్కమాట సార్... మీరు పెద్ద రచయితలు. ఎన్నో పాత్రలను సృష్టించారు. మరెన్నో పాత్రలకు ప్రాణం పోశారు. చీకటిగదుల్లో తిరుగుతున్న ప్రేతాల్లా, నూనెలేని దీపాల్లా ఎప్పుడు కొండెక్కుతామో తెలియకుండా బతుకుతున్న మాలాంటి వాళ్లను గుర్తుపెట్టుకోండి సార్... తలరాతలు బాగోని మా బతుకులు మీ రాతలతోనైనా తేటపడేదాకా రాయండి. మాంసం ముద్దలతో సృష్టించిన బ్రహ్మకి, పోషించిన మారాజులకీ, సూటిపోటి మాటలతో వేధించే సమాజానికి... గుండె కరిగేలా రాయండి. మాలాంటి అంటరాని దేహాలు మీ రాతల్లో పునీతమయ్యేదాకా రాస్తూనే ఉండండి సార్..." చేతిలోని ఫోన్ కిందకి జారిపోయింది.

వెల్లువలా పొంగిన దుఃఖం వెక్కిళ్ళుగా మారింది.

దూరంగా భూమండలం బద్దలయ్యేలా పిడుగు చప్పుడు వినిపించింది.

సాహితీ శిఖరం

1976 సాహిత్యంలో నోబెల్ విజేత...

## 20వ శతాబ్దపు అగ్ర నవలా రచయిత

# సాల్ బెల్లో



1915వ సంవత్సరం జూన్ 10వ తేదీన జన్మించిన సాల్ బెల్లో కెనడియన్. అమెరికన్ రచయిత. అతని సాహిత్యకృషికి 1976లో నోబెల్ బహుమతి, పులిట్జర్ బహుమతి మరియు నేషనల్ మెడల్ ఆఫ్ ఆర్ట్స్ లభించాయి. అతను మూడుసార్లు నేషనల్ బుక్ అవార్డ్ ఫర్ ఫిక్షన్ గెలుచుకున్న ఏకైక రచయిత. అతను 1990లో అమెరికన్ లెటర్స్ కు విశిష్ట సహకారం అందించినందుకు నేషనల్ బుక్ ఫౌండేషన్ యొక్క జీవితకాల పతకాన్ని అందుకున్నాడు. సంస్కృతి యొక్క సూక్ష్మ విశ్లేషణ, వినోదభరితమైన సాహసం, తాత్విక సంభాషణతో త్వరితగతిన తీవ్రమైన మరియు విషాదకరమైన ఎపిసోడ్‌ల మిశ్రమం అని చమత్కారమైన వ్యాఖ్యాతగా స్వీడిష్ నోబెల్ కమిటీ మాటలలో అతనిని అభివర్ణించింది. అతని అత్యంత ప్రసిద్ధ రచనలలో ది అడ్వెంచర్స్ ఆఫ్ ఆగీ మార్చ్, హెండర్సన్ ఉన్నాయి. రెయిన్ కింగ్, హెర్జోగ్, మిస్టర్ సామ్లర్స్ ప్లానెట్, సీజ్ ది డే, హంబోల్ట్ గిఫ్ట్ మరియు రావెల్‌స్టెయిన్. హెండర్సన్ ది రెయిన్ కింగ్‌లోని యూజీన్ హెండర్సన్ తన పాత్రలన్నింటిలో తనకు చాలా ఇష్టమని బెల్లో చెప్పాడు. బెల్లో క్యూబెక్ నుండి వలస వచ్చిన వ్యక్తిగా పెరిగాడు. క్రిస్టోఫర్ హిచెన్స్ వివరించినట్లుగా బెల్లో యొక్క కల్పన మరియు ప్రధాన పాత్రలు అతీంద్రియత్వం కోసం అతని సొంత కోరికను ప్రతిబింబిస్తాయి. రచయిత యొక్క రచనలు ఆధునిక నాగరికత యొక్క దిక్కుతోచని స్వభావం మరియు వారి బలహీనతను అధిగమించడానికి మానవుల ప్రతిఘటన సామర్థ్యాన్ని గురించి మాట్లాడతాయి. బెలో ఆధునిక నాగరికతలో అనేక లోపాలను చూశాడు. బెల్లో ఫిక్షన్‌లోని ప్రధానపాత్రలు వీరోచిత సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అవి సమాజంలోని ప్రతికూల శక్తులకు విరుద్ధంగా ఉంటాయి. అతని ప్రధానపాత్రలు చాలా వరకు అతనితో పోలికను కలిగి ఉంటాయి. బెల్లో రచనలలో యూదుల జీవితం మరియు గుర్తింపు ఒక ప్రధాన ఇతివృత్తం. బెల్లో రచనలలో అమెరికా పట్ల గొప్ప ప్రశంసలు, అమెరికన్ అనుభవం యొక్క ప్రత్యేకత మరియు చైతన్యం ఆకర్షణగా కనబడతాయి. హంబోల్ట్ బహుమతి విజయంతో ముందుకు సాగిన బెలో 1976లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని



గెలుచుకున్నాడు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ప్రేక్షకులను ఉద్దేశించి 70 నిమిషాల ప్రసంగంలో బెల్లో, రచయితలు నాగరికతకు బీకాన్‌లుగా ఉండాలని మరియు మేధోహింస నుండి మేల్కొల్పాలని పిలుపునిచ్చారు. 2005 ఏప్రిల్ 5న 89 సంవత్సరాల వయసులో అమెరికాలో మరణించాడు. అతని ప్రారంభ రచనలు అతనికి 20వ శతాబ్దపు ప్రధాన నవలారచయితగా పేరు తెచ్చిపెట్టాయి. అతను అన్ని అవార్డు విభాగాల్లో మూడు జాతీయ పుస్తక అవార్డులను గెలుచుకున్న మొదటి రచయిత. "20వ శతాబ్దపు అమెరికన్ సాహిత్యానికి వెన్నెముకలు ఇద్దరు నవలా రచయితలు-విలియం ఫాల్క్‌నర్ మరియు సాల్ బెల్లో" అని అతని స్నేహితుడు మరియు ఆశ్రితుడు ఫిలిప్ రోత్ అతనిని అభివర్ణించారు.

# అన్ని ఋతువులలోనూ ఆకులు రాలే "ఆకులు రాలుతున్నయి"

కొమురవెల్లి అంజయ్య కవిత్వంపై సమీక్ష...



వేణు నక్షత్రం
70386 18368

ప్రకృతి మనకు ఆరు ఋతువుల నిచ్చింది. ఒక్కో ఋతువుకి ఒక లక్షణం ఉంటుంది. అంటే వర్షాలు, ఎండలు, మంచు కురవడం, ఆకులు రాలడం, మళ్ళీ వికసించడం... ఇది ప్రకృతి మనకిచ్చిన వరం, ఒక జీవన పరిక్రియ. కానీ 2020 సంవత్సర ప్రారంభంలో మొదలయ్యిన కరోనా కాలచక్రంలో ఇంకా ప్రపంచవ్యాప్తంగా మనుషులు ఆకుల్లా రాలుతూనే ఉన్నారు అనే విషయం మనం ప్రతిరోజూ వింటున్నాం, చూస్తున్నాం. సరిగ్గా అదే విషయాన్ని అంటే కరోనా వికృత చేష్టలని, విలయ తాండవాన్ని, కకావికలం అయిన జీవితాలని కొమురవెల్లి అంజయ్య తన కవితా సంపుటి "ఆకులు రాలుతున్నయి" రూపంలో చాలా హృద్యంగా వివరించారు.

మన చుట్టూ జరుగుతున్న సంఘటనలని చూస్తూ స్పందించనివాడు కవే కాడు. కవి కాని వాళ్ళని కూడా స్పందింప చేసింది ఈ మాయదారి కరోనా. కొమురవెల్లి అంజయ్య సామాజిక స్పృహ ఉన్న కవి. ఎనభైల్లోనే అప్పటి సామాజిక పరిస్థితులను తన గీతాయుధం కవితా సంపుటి ద్వారా ఏకరువు పెట్టారు. 2019లో 'నడక బోనం' కవితా సంపుటి అంజయ్యలోని సామాజిక స్పృహను, సమాజం పట్ల తన బాధ్యతను తెలియచెప్పింది. మరి ప్రపంచాన్ని



అతలాకుతలం చేస్తున్న ఈ మహమ్మారి వికృత చేష్టలను చూస్తూ ఊరుకుంటాడా? ఊరుకుంటే కొమురవెల్లి అంజయ్య కవి ఎందుకవుతాడు? బాధ్యత గల పౌరునిగా, జర్నలిస్టుగా, సామాజిక స్పృహ కల్గిన కవిగా 34 కవితలతో "ఆకులు రాలుతున్నయి" కవితా సంపుటిని ప్రచురించారు. అంతే కాక ఎన్నో కవితలని పోటీలకు పంపి బహుమతులు కూడా గెల్చుకున్నారు. ఒక పత్రికా జర్నలిస్టుగా కరోనా కబంధ హస్తాలలో చిక్కుకున్న సమాజాన్ని చూసి చలించి తన కలానికి పని పెట్టారు.

"ఇప్పుడిక చేతులు, కాళ్లు, ముఖాలు మాత్రమేనా
మనల్ని మనమే శుభ్రపరుచుకుందాం
మాస్క్ రక్షణ కవచంగా
దగ్గినా తుమ్మినా దాచి దాచుకొని తుమ్ముదాం
ఎవరికి వారే ఒంటరితనంతో
బతుకుదాం భయం భయంగా..."

అంటూ సమాజాన్ని మేల్కొలుపుతాడు.

"గూబ పగలక ముందే" కవితలో కరోనాని తక్కువ అంచనా వేసిన వారికి ఒక హెచ్చరిక ఇస్తాడు.

"నువ్వెంత నీ బతుకెంత అనుకున్నాం
కల చెదిరింది వాస్తవం చాచి తన్నింది
పొరలు పొరలుగా దగ్గు బెదిరింపులు'
ఫోన్ బెదిరింపులు, కత్తులతో బెదిరింపులు సాధారణమే!
కానీ ఇప్పుడు మాత్రం "దగ్గు బెదిరింపులు"

అంటూ కవి ఎన్నో అబ్బురపరిచే ప్రతీకలను మన ముందుంచాడు ఈ సంపుటిలో.

క్రమంగా ప్రపంచంలో అన్ని సంస్థలూ (వ్యాపార, విద్య...) మూసుకుపోయిన వైనాన్ని వివరిస్తూ ..

"ఇప్పుడు మిగిలింది ఒక్కటే
ఎవరి మొఖాలు వారు మంచిగుంచుకోవడమే

చేసుకోండి ఇల్లే జైలుగా
ఉన్నచోటే ఉండండి ఇస్రాయిలా"
అని హెచ్చరిస్తాడు తన బాధ్యతగా. ఇస్రాయిు, ఈతరం వారికి ఎంతమందికి ఈ పదం పరిచయమో కానీ, కదలకుండా ఉన్న చోటనే తిరుగుతూ ధాన్యాన్ని పిండిగా చేసే ఈ ఇస్రాయితో క్వారంటైన్‌ని పోల్చడం అద్భుత ప్రయోగం.

"ఎంతటి సింహమైనా పరిమితం గుహకే
ఇంట్లో స్వీయ నిర్బంధం కాదసలే బాధల బంధం
కోల్పోయిన విలువలకు చేసుకోవాలి కొత్తపండుగ
ఉమ్మడి కుటుంబాల మనుషులుగా మారడం
నాలుగు తల్లెలు కలసి భోంచేయడం"

అంటూ విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ పట్ల కవి తన బాధని వ్యక్తీకరిస్తూనే కరోనా లాక్‌డౌన్ వల్ల జరుగుతున్న కొన్ని మంచి పరిణామాలని అంటే కుటుంబ సమీకరణలు, నలుగురు కలసి భోంచేయడం వల్ల కలిగే సంతృప్తిని "నాలుగు తల్లెలు" కవితలో హృద్యంగా వివరించారు కవి.

వృత్తిరీత్యా జర్నలిస్టు అయిన కవి అంజయ్య ఎంత బాధ్యతాయుతంగా తాను రాసిన వార్తలు ప్రజలకు చేరాలనుకుంటాడో, తన ప్రవృ త్తి అయిన కవిత్వాన్ని కూడా అంతే బాధ్యతాయుతంగా ప్రజలకు చేర్చడానికి ఏ అవకాశాన్ని వదులుకోరు. దీనికి మంచి ఉదాహరహణ ఏమంటే, తనకు తెలిసిన ప్రతి కవిత్వ పోటీకి కవితని పంపడమే కాకుండా బహుమతులని గెలుచుకోవడం. ఇక్కడ బహుమతిని ఆయన ఒక ఆభరణంగా కాకుండా తన కవిత్వం పది మందికి చేరడానికి ఒక మాధ్యమంగా ఉపయోగిస్తాడు. "2020 తెలుగు వెలుగు ప్రతిరోజు కరోనా కవితల పోటీలో మొదటిరోజు ద్వితీయ బహుమతి గెలుచుకున్న కవిత "మలచుకుంటే". ఇందులో కవి పనికి రాని ఈగోలతో దూరమయిన జంటలను ప్రస్తావిస్తూ

"చైనాలో తగిలిన గత్తర కరోనా
లోకాన్నంతా లాక్డౌన్ చేస్తే"

ఈగోలన్నీ మటుమాయం అయ్యి, ప్రేమలు ఆప్యాయతలు, మమతాను రాగాలు ఎలా పెంపొందాయో చాలా అందగా చెప్పారు. ఎందరో ఎడమొహం పెడమొహంగా ఉన్న వాళ్ళని దగ్గర చేసే కవిత ఇది.

"కరోనా బురదగుంటలో పడి
వెళ్లిపోయాం లాక్‌డౌన్‌లోకి
ఒంటరితనం ఆలోచనలకు పెద్దపీట
యాదుల ఎండిన తోట చిగురిస్తుంటే
సెల్, వీడియో పలకరింపులు మంచి ఊరట
దూరాన్ని ఒంటరితనం చేస్తే దగ్గరితనం
మనసు విశాలమైదానం చేసుకుందామా"

అంటూ ఇష్టంగా మార్చుకుంటే ఏదీ కష్టం కాదని ఎవ్వరినీ నొప్పించక చెప్పకనే చెప్పారు కవి.

'ప్రపంచ పెద్దన్న' అని విర్రవీగిన దేశాలు సైతం కరోనా ముందు కుదేలయ్యాయి. మనుషుల జీవితాలు ప్రపంచంలో ఎక్కడున్నా బ్రతికుండటమే ముఖ్యం అంటూ "దేహాలు కాపాడుకుంటేనే దేశాలు బాగు/ ఎవరైనా బతికుంటేనే కదా పది మొక్కలు నాటేది, పెంచేది" అని సామాజిక బాధ్యతని గుర్తుచేస్తాడు కవి.

కలసి ఉంటే కలదు సుఖము అనేది పాత సామెత, కరోనా మనకు నేర్పించింది ఒంటరిగా ఉండి గెలవాలని.

"నూతన కురుక్షేత్రంలో మారిన యుద్ధరీతులు
ఇంటిని ఆత్మబంధువుగా చేసుకున్న లాక్ డౌన్లు, కర్ఫ్యూలు
రోగానికి కట్టడి ఐసోలేషన్, క్వారంటైన్ లు"

అంటూ డాక్టర్లను

"సినిమాల్లో హీరోల యాక్షన్‌కు డూపులు
ప్రాణాలకు తెగిస్తున్న హీరోలిపుడు ప్రభుత్వ డాక్టర్లు"

అంటూ మొదటి వేవ్‌లో ప్రభుత్వ డాక్టర్లు కరోనాకి ఎదురు వెళ్లి కరోనాతో పోరాడిన తీరుని వర్ణిస్తుంటే డాక్టర్లంటే ఎనలేని గౌరవం కలుగుతుంది. కరోనా పోరుని నూతన కురుక్షేత్రంతో పోల్చడం కూడా ఒక కొత్త పదప్రయోగం.

విజ్ఞానశాస్త్రంలో మనిషి సాధించనిది ఏదీ లేదని విర్రవీగుతున్న తరుణంలో కర్రుకాల్చి వాత పెట్టింది కరోనా.

"ప్రకృతిని పిడికిట పట్టామనే గర్వం
అభినవ విశ్వామిత్ర సృష్టికర్తలం
భూగోళ ముఖచిత్రం బాడిశలతో చెక్కి
చెక్కి, గల్లాలెగరేశాం, గాలిలో తేలిపోయాం"

అంటూ మనిషి అతి పోకడలను వివరిస్తారు. ఎంతటి వారైనా కరోనా ముందు మోకరిల్లాల్సిందే అని అద్భుతంగా చెప్పారు.

తనవాళ్లెవరో, పరాయివాళ్ళు ఎవరో తేటతెల్లం చేసింది కరోనా. కరోనా సోకిందని తెలియగానే నా అనుకున్న వాళ్ళు కూడా దగ్గరికి రాకుండా, కనీసం హాస్పిటల్‌లో చేర్చడానికి కూడా ముందుకు రాని కన్న ప్రేగు బంధాల అసలు రూపం

> **వృత్తిరీత్యా జర్నలిస్టు అయిన కవి అంజయ్య ఎంత బాధ్యతాయుతంగా తాను రాసిన వార్తలు ప్రజలకు చేరాలను కుంటాడో, తన ప్రవృ త్తి అయిన కవిత్వాన్ని కూడా అంతే బాధ్యతాయుతంగా ప్రజలకు చేర్చడానికి ఏ అవకాశాన్ని వదులుకోరు. దీనికి మంచి ఉ దాహరహణ ఏమంటే, తనకు తెలిసిన ప్రతి కవిత్వ పోటీకి కవితని పంపడమే కాకుండా బహుమతులని గెలుచుకోవడం.**

వివరిస్తూ 'కనికరించని చూపులు' కవిత చదువుతుంటే మాత్రం కళ్ళ నుండి నీరు రాక మానదు.

"ఐసీయూ అద్దాలలో నుంచైనా
కనికరించని చూపులు
పాజిటివ్ కరోనా అంటే
పారిపోతున్న నేస్తాలు
వాకిలి పెద్దర్వాజ మూసుకుంటున్న
పెళ్ళాం పిల్లల ప్రేమ
గుడిసైనా, రాజభవనాలైనా వైరస్
అంటితే అంతే"..

అంటూ ప్రాణాలతో పోరాడుతున్న వేలాది మంది కరోనా పేషంట్లని తన అక్కున చేర్చుకుని నేనున్నానని అభయహస్తం ఇచ్చి వీలయినంత మంది పేషంట్లని క్షేమంగా ఇంటికి పంపిన ఘనత ఉన్న గాంధీ ఆసుపత్రి గొప్పదనాన్ని వివరిస్తూ

"కొమ్ములు తిరిగిన ఆస్పత్రుల
అవార్డులు
తలదించుకున్నాయి 'గాంధీ'
పాదాల ముందు"

అని కార్పొరేట్ దవాఖానాలే చేతులెత్తేసినప్పుడు గాంధీ ఆసుపత్రి ఏ విధంగా కరోనా పేషంట్ల పాలిట వరమయ్యిందో గొప్పగా వర్ణించారు.

నెలల తరబడి తమ భార్యా పిల్లలకి దూరంగా ఉంటూ ఎందరో కరోనా బాధితుల ప్రాణాలు రక్షించిన డాక్టర్ల సేవలను గుర్తిస్తూ

"ప్రాణాలు అరచేత పట్టుకుని వచ్చే
రోగికి
ధైర్య కవచాలు తొడిగే తెల్లకోటు"

అని డాక్టర్లను పొగడటం కవి హృదయంలో డాక్టర్ల పట్ల ఉన్న గౌరవం తెలుస్తుంది.

ఇందులోని కవితలన్నీ కరోనా విలయతాండవం మొదలయ్యినప్పటి నుండి మే నెల 2021 వరకు జరిగిన అన్ని యథార్థ సంఘటనలకు స్పందించి రాసినట్టుగా తెలుస్తుంది ఒక్కో కవిత చదువుతుంటే. ముందుగా కరోనా పేషంట్ల మనోవేదన, వైద్యసిబ్బంది త్యాగం, పారిశుద్ధ్య కార్మికుల పాత్ర,




వలస కార్మికుల వెతలు, రెండవ వేవ్ ని నిర్లక్ష్యం చేసిన విధానం, ఇలా ఏ ఒక్క సంఘటనని వదలకుండా రెండు సంవత్సరాల కరోనా కరాళ నృత్యాన్ని మన కళ్ళ ముందుంచారు 'ఆకులురాలుతున్నాయి' కవితా సంపుటిలో.

ఎన్నికల పేరుతో, కుంభమేళా పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన ప్రభుత్వ తీరును ఎండకట్టారు తన కవిత్వంతో.

"తగ్గినట్లే తగ్గి వైరస్ రోగం తిరగబెడితే
కట్టడి పాలన నటించింది నిద్ర
సభలు, సరదాలు, విజయోత్సవాలు,
కుంభమేళాలు
సందట్లో సడేమియాలా
విచ్చలవిడితనాలు"

అంటూనే ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీని "ఆస్పత్రులు నిండు డబ్బు గర్భిణులు"అని చమత్కరిస్తారు.

ప్రయివేట్ దవాఖానాల దోపిడిని ఎండకడుతూ

"రోగం రోడ్డెక్కగానే ప్రయివేటులో
చికిత్సల హంగామా
అడ్డు అదుపూ లేని బిల్లులకు జోష్
అంటినా అంటకున్న రోగం
యమజోరుగా చికిత్సల నాటకం"

అని వర్ణిస్తారు. ఇంకొక కవితలో "శరీరాల వెల పెరిగింది కాసుపత్రుల్లో" అంటూ కార్పొరేట్ ఆసుపత్రులని "కాసుపత్రులు" అనడం అద్భుత పద ప్రయోగం.

మాస్క్ ను నిర్లక్ష్యంగా వాడుతున్న వారిని చూస్తూ

"మాస్కులు గదువలకు వేలాడితే
కోవిడ్ నోట్లో నోరు పెట్టింది"
అని ఒక హెచ్చరిక చేశారు.

"పచ్చగా బతికేందుకు కొత్తపాఠం
భౌతిక దూరం
వలసల నాటకాలకు సలసల
మంటలు"

అని వలస కార్మికుల వెతలని వర్ణించారు. కరోనా నుండి ఎంత జాగ్రత్తగా ఉండాలో చెపుతూ

"కంట్లో పడే నలక పిసరంతదే
నలిపేది కళ్ళు, రాలేది కన్నీళ్ళు
సులువుగా వదలదది, కంట్లో
దూలమైతది"

అని హెచ్చరించారు అతి సున్నితంగా.

లాక్ డౌన్లో ఒక్కో కుటుంబానిది ఒక కన్నీటి గాథ.

"ఎవరింటి తలుపు తట్టాలన్నా వణికే
చేతులు ఎవరి భుజం తట్టాలన్నా చాలని
ధైర్యం
ఎవరికి వారే ఒంటరై పోతున్న వేళ
ఏడ్చే కళ్ళకు తుడిచే చేతులు వీడియో
కాల్స్"

చాలా హృద్యమైన కవిత.

అన్ని కవితలలోకి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన కవిత 'జరపైలం' - బతుకుతెరువు కోసం గల్ఫ్ కి వెళ్లిన కొడుకునుద్దేశించి తండ్రి చెపుతున్న మాటలుగా ఉన్న ఈ కవిత చదివితే మాత్రం గుండె తరుక్కుపోక మానదు.

"ఎన్నడూ లేని భయం

ఇప్పుడు కడుపుల సొచ్చింది బిడ్డా
ఎన్ని రోగాలొచ్చినా
పక్కనుండి పండోలె కాపాడుకున్నా"
అంటూనే
"పైసలతో పాటు పురుగు తేకు బిడ్డ
వాకిట్ల కట్టెల మంట పెట్టకు" అని
తన ఆవేదన వెల్లడించారు తండ్రి పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన కవి.
వ్యాక్సిన్‌పై నమ్మకాన్ని కల్గిస్తూ
"నిప్పు పుట్టించడం నేర్పిన అవసరం
తెలివిని వెలుతురులో ముంచి
పెంచింది కదా
వ్యాక్సిన్ ఆశలకు తెరుచుకున్న గేట్లు
వాస్తవాల నమ్మకాలుగా మారాలి"
అని అంటూనే మూఢనమ్మకాలని నమ్మేవాళ్ళని
"చప్పట్లు కొట్టి, దీపాలు వెలిగిస్తే
మూఢనమ్మకం ఊదు
పోగేసినట్లయింది"
అని కర్రుకాల్చి వాతపెట్టడంలోనూ వెనుకాడలేదు కవి.

2020 తెలుగు వెలుగు కరోనా కవితల పోటీలో 30వ రోజు ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత "పునశ్చరణ". లాక్ డౌన్ సమయంలో మనుషుల జీవితాలు, వృత్తులు ఎక్కడివక్కడ ఎలా ఆగిపోయాయో దీన్నుండి మనిషి ఏమి నేర్చుకున్నాడో వివరించే కవిత. పల్లె జీవితం, కాయకష్టం అన్నీ కనిపిస్తాయి ఈ కవితలో.

"కాన్వాసులకెక్కని జీవన సిత్రాలు
రోడ్డుపై
ఎన్ని కాగితాలు అక్షరాలు పంచినా
కమిలి మిగిలిపోతున్న అనేక
పార్శ్వాలు
లెక్కలేనన్ని తొర్రలతో పిండి జల్లెడ
బతుకులు"
అని చెపుతూ
"కరోనా కనికట్టుకు విరుగుడు
ఇళ్లల్లోనే
మందులేని రోగానికి మనోధైర్యం
మందు"
అని ధైర్యాన్ని నూరిపోశారు తన కవిత్వంతో.

34 కవితలతో 72 పేజీలతో ఉన్న ఈ పుస్తకం చూస్తే ఒక గంటలో చెదివేయొచ్చు అన్నంతలో ఉన్నా, ఒక్కో కవితని చదువుతూ ఉంటే, ఆ కదలాడే దృశ్యాలు కళ్ళముందు కదులుతుంటే గుండె భారంగా మారి వెంటనే రెండవ కవితకి పోవడం మాత్రం అసాధ్యం. ప్రతీ కవిత దానికదే గొప్ప. కరోనా మొదలయ్యినప్పటి నుండి రెండవ వేవ్ వరకు ఏ ఒక్క అంశాన్ని వదలకుండా అన్ని సంఘటనలని చక్కని ప్రాసలతో, వ్యావహారిక భాషలో సులభంగా అర్థం అయ్యే రీతిలో కళ్ళకు కట్టినట్టు చక్కగా వర్ణించారు కవి అంజయ్య తన "ఆకులురాలుతున్నయి" తృతీయ ప్రత్యేక కరోనా కవితా సంపుటిలో.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

వ్యాసం

# ఈనాటి బాలసాహిత్యంలో భాష - కొన్ని ముచ్చట్లు!

**పిల్లలకు భాషా జ్ఞానం కంటే శాస్త్రజ్ఞానమే ముఖ్యమని తెలుపుతున్న వ్యాసం...**



డా॥ వి.ఆర్. శర్మ
91778 87749

ఆగస్ట్ ఇరవై తొమ్మిది గిడుగు రామమూర్తి గారి జన్మదినం ఆ సందర్భంగా వారు ఆనాడు రాసిన "నేటితెలుగు - నివేదిక" ఆధారంగా ఈ నాటి బాల సాహిత్యంలో భాషను గురించి కొన్ని విషయాలు పరిశీలించుకోవలసిన అవసరం ఉంది.

ఈ దశాబ్దంలో బాల సాహిత్యంలో పిల్లలూ, పెద్దవాళ్ళూ గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా రాస్తున్నారు. ప్రతి రోజూ బాల సాహిత్యంలో అనేక రచనలు వస్తున్నాయి. వాడుక భాషలో ఓ ఉద్యమంలా విస్తృతంగా ఇప్పుడు బాల సాహిత్యం రాస్తున్నారు. అందుకోసం అవసరమైన బాలసాహిత్య కార్యశాలలు దాదాపు ప్రతి జిల్లాలో జరుగుతున్నాయి. వాటిలో 'బాలసాహిత్యంలో వస్తువు, భాష' వంటి విషయాల గురించి పెద్దలు తమకు తోచిన సలహాలూ, సూచనలూ చేస్తున్నారు. అభిప్రాయాలు చెప్తున్నారు. ఆ మాటల సారాంశం ఏమిటంటే -'బాల సాహిత్యం చిన్న చిన్న మాటలతో ఉండాలి. తేలిక పదాలు ఉండాలి. సులభంగా అర్థం కావాలి. పిల్లలు మాట్లాడే భాషలా ఉండాలి, అంటే -అర్థం కాని పదజాలం కానీ, కఠినమైన వాక్యాలు కానీ, తికమక పెట్టే శైలి కానీ ఉండకూడదు. మారిన ఈనాటి సామాజిక పరిస్థితులలో పిల్లలకైనా పెద్దలకైనా అందరికీ ఇటువంటి



భాషనే కావాలి. కఠినమైన అర్థం కాని భాషను ఉపయోగించడానికీ, స్వీకరించడానికి ఈనాటి జనం సుముఖంగా లేరు. అంటే ప్రజలు సాధారణంగా మాట్లాడుకునే భాషలోనే ఏ సాహిత్యమైనా రాయాలి. ఆనాడు గిడుగు భాషోద్యమం చేసింది కూడా ఇందుకోసమే. ఈనాటి బాలసాహిత్యానికి కూడా ఇదే వర్తిస్తుంది. అయితే ఈ కాలపు బాలసాహిత్య భాష విషయంలో జరగ వలసినంత చర్చ, పరిశోధన ఇంకా జరగడం లేదనే చెప్పుకోవాలి.

ఈ నేపథ్యంలో, ఈ ప్రత్యేక కాల సందర్భంలో మరోసారి గిడుగు వేంకట రామమూర్తి గారిని చూడాలి. 1913లోనే వ్యవహారిక భాష అమలు కోసం వారు నాటి మదరాసు గవర్నరుకు సమర్పించడానికి రాసిన "నేటి తెలుగు-నివేదిక" ను తప్పని సరిగా అధ్యయనం చేయాలి. ప్రపంచీకరణ జరుగుతున్న సందర్భంగా, సమస్తమూ అనివార్యంగా మార్పులకు గురౌతున్న ఈ వేళ "బాల సాహిత్యంలో భాష"ను గురించి కూడా ఆధునికంగానే ఆలోచించడం అనివార్యం అని మనం గుర్తించాలి. బాలసాహిత్యంలో ప్రపంచ స్థాయిలో నిలబడే రచనలు రావాలంటే మన దృష్టిలో కొన్ని మార్పులు చేసుకొని తీరాలని భావిస్తున్నాను.

గిడుగు రామమూర్తి నివేదికను తెలుగులో పరిచయం చేసిన భాషావేత్త బూదరాజు రాధాకృష్ణ గారు ఇలా అన్నారు."తన కుటుంబంలో పరిసర సమాజంలో వినిపించని గ్రాంథిక రూపాలు నేర్పటం విద్యా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన వాదించాడు. పండితులకూ కవులకూ స్పష్టంగా బోధపడని, ప్రయోగించటం నిర్దుష్టంగా సాధ్యపడని, ప్రాచీన కావ్య భాషను నేర్పటం సమంజసం కాదన్నారు. శాస్త్ర పరిజ్ఞానం అందించవలసిన కాలంలో భాషా విషయకంగా కూడా విద్యార్థులకు శ్రమ కలిగించవద్దన్నారు."

గిడుగు వారు రాసిన ఆ నివేదికలోని భాషా పరమైన కొన్ని అంశాలను చూద్దాం.

"తెలుగు రాజుల పోషణలో తెలుగు కవుల చేతిలో కవితా భాష నానాటికీ కృత్రిమంగా పరిణమించి ప్రజల నిత్యవ్యవహారంలోని భాషకు చాలా దూరమయిపోయింది".

"ప్రాచీనాంధ్ర సాహిత్యంలో వచన రచనలని చెప్పదగ్గవి లేనేలేవు. ప్రజలందరికీ విద్యావకాశమనే నూతన వ్యవస్థను బ్రిటీష్ ప్రభుత్వం నెలకొల్పిన కొంత కాలానికిగానీ వచనంలో రచించే ప్రయత్నం వాస్తవానికి మొదలు కాలేదు. అయితే దురదృష్టవశాత్తూ తెలుగు కవిత్వంలాగే వచనం కూడా వీలయినంతలో ఎవరికీ అర్థంకానట్టు రాయటమే ఆదర్శంగా పెట్టుకొన్న గ్రాంథిక విద్వాంసుల పాలబడింది."

ఆనాటి భాషా సంస్కరణల గురించి ఆ నివేదికలో వారు ఇంకా ఇలా అన్నారు. "సంస్కరణను ఆరంభించవలసిన చోట మొదలు పెట్టలేదు. చేసినవి కూడా అతుకుల బొంత ప్రయత్నాలే..."

"గ్రాంథిక భాషను పండితులు అసహ్యించుకొనే స్థాయికి దిగజార్చ గలిగారే కాని ఆధునికాభిరుచులకు అమోదయోగ్యంగా ఇప్పటి వాడుక భాషను సంస్క రించలేదు." ..."అశిక్షిత రచయితలు చేస్తున్న "సులభీకరణ" విధానం వల్ల గ్రాంథిక భాష ఈనాటికీ గందరగోళంలో పడింది."

ఇన్నేళ్ళు గడిచినా ఆ గందరగోళం లోంచి మనం బయటపడ్డామా అని కూడా ఇప్పుడు పరిశీలించుకోవాలి. ఆనాడు వారు చెప్పిన విషయాల్లో ఇప్పటికైనా మనం మన ఆధునిక భాషను ఈతరం ఆధునికాభిరుచులకు ఆమోదయోగ్యంగా ఎంత వరకు సంస్కరించుకున్నామో చర్చించుకోవాలి. భారతీయ భాషలను సవిమర్శంగా పరిశీలించిన డాక్టర్ గ్రియర్సన్ మాటలను గురించి ఆ నివేదికలో చెప్తూ "గత శతాబ్దంలో ప్రవేశపెట్టిన ముద్రణ విద్యావ్యాప్తులు కొన్ని భాషల్లో తత్సమ ప్రయోగ బాహుళ్యమనే సంప్రదాయం సృష్టించాయి, శుద్ధ ఇంగ్లీషు భాషకు నమూనాగా కఠోరమైన జాన్సన్ భాషను చూపినట్లుగా. నిక్కచ్చిగా లెక్కలు కట్టిన మీదట ఒకానొక ఆధునిక వంగ గ్రంథంలో 88 శాతం మాటలు స్వచ్ఛమైన సంస్కృత పదాలనీ, వాటిలో ప్రతివొక్కటీ అనవసరమనీ, అవసరమైతే బెంగాలీ కుటుంబాల వాడుకలోని మాటలను వాటికి బదులుగా వాడవచ్చనీ రుజువు చేయటం జరిగింది..." మనం కూడా మన తెలుగు మాటల గురించి, వాటిలో తత్సమ, తత్భవ శబ్దాల గురించీ చర్చించాలి. ఇంగ్లీషు పదాలు బాల సాహిత్యంలో ఎక్కడైనా వస్తే అభ్యంతర పెడుతున్న వాళ్ళు ఈ సంస్కృత భూయిష్టమైన తెలుగు గురించి ఆలోచించాలి. వాటికి బదులుగా గ్రామీణ ప్రజలు వాడుతున్న మాటలు తీసుకోలేమా అని ఆలోచించాలి. ఈనాడు అచ్చతెలుగు మాటలు ఏమైనా మిగిలి ఉంటే అవి పల్లె ప్రజల వాడుకలోనే బతికి ఉండే అవకాశం ఉంది. "పండితులు నిర్దేశించిన కృతక, అసహజ ప్రమాణాల వల్లనే తెలుగు భాష ఇప్పటి ఈ స్థితికి వచ్చింది." అని కూడా గిడుగు వారు అభిప్రాయపడ్డారు.

**పిల్లల పుస్తకాలలో ఆనాటి భాష గురించి గిడుగువారు ఇంకా ఇలా రాశారు. "చివరకు పనిగట్టుకొని పసిపిల్లల కోసమని రాసిన పుస్తకాల్లో కూడా ఒకే వాక్యంలో పాతకాలపు మాటల సరసనే నేటి కాలపు మాటలు దొర్లుతుంటే వాటిమధ్య సమన్వయం లేక అవి కర్ణకఠోరంగా ఉంటున్నాయి."**

పిల్లల పుస్తకాలలో ఆనాటి భాష గురించి గిడుగువారు ఇంకా ఇలా రాశారు. "చివరకు పనిగట్టుకొని పసిపిల్లల కోసమని రాసిన పుస్తకాల్లో కూడా ఒకే వాక్యంలో పాతకాలపు మాటల సరసనే నేటి కాలపు మాటలు దొర్లుతుంటే వాటిమధ్య సమన్వయం లేక అవి కర్ణకఠోరంగా ఉంటున్నాయి."

"వాస్తవంలో నేను చాలా తెలుగు పుస్తకాలను కళ్ళలో వత్తులు పెట్టుకొని చూసి, ఎనిమిదేళ్ళ పిల్లవాడు ఉపాధ్యాయుడి సహాయం లేకుండా చదివి అర్థం చేసుకోగల కథల పుస్తకం ఒక్కటీ లేదనీ, ఇంగ్లీషు, ఫ్రెంచ్, తదితర పాశ్చాత్య భాషల్లో వేలాది పుస్తకాలున్నాయని ఘంటాఘోషంగా చెప్తున్నాను."

ఆధునిక అనివార్య మార్పులను అంగీకరించని పండితుల గురించి వారిలా



వ్యాసం

అన్నారు-"ఈ పండితుల ఆదర్శం అసహజం, అసాధనీయం, అతడి ఆదర్శ భాష ఎక్కడా లేదు."... "అయినప్పటికీ మానవ ప్రకృతికి చెందిన అనుల్లంఘనీయ సూత్రాలకు కట్టుబడక తప్పదు."

ఆనాటి పాఠశాలల్లో మాతృభాషను బోధిస్తున్న విధానాన్ని గురించి చెప్తూ-"తన "మాతృభాషను" బోధించటంలో పండితుడు పూర్తిగా విఫలమైనాడని రుజువయింది. నిజానికి ఆతడెప్పుడు మాతృ భాషను బోధించలేదు. ఇంతకాలం అతడు కృత్రిమ భాషనే బోధిస్తున్నాడు."అన్నారు. ఇంకా పాఠ్యపుస్తకాలను గురించి ఇలా అన్నారు-"తెలుగు కన్నడ పాఠశాలల్లో వాడుతున్న పుస్తకాలు పద్య రూపంలో, సంభాషణలో గానీ వ్యాపారంలో గాని వాడే మాండలికానికి విరుద్ధమైన భాషలో రాసినవి." బహుశా అందుకేనేమో ఈనాటికీ డిగ్రీ చదివిన విద్యార్థులు కూడా తమ భావాలు తెలుగు లేఖనంలో సరిగా వ్యక్తం చేయలేక పోతున్నారు.

పిల్లలు భాష గురించి తన నివేదికలో గిడుగు రామమూర్తి గారు ఇలా చెప్పారు-"విద్యాభివృద్ధి మార్గానికి మహత్తరమైన ఆటంకం జీవద్భాషా స్థానంలో అతడు మృత కవితా భాషను నిలిపి దాన్ని ఛాందసంగా గౌరవించటం. సాధారణంగా పిల్లలు తమ మాతృభాష నెలా నేర్చుకుంటారో పండితులు అర్థం చేసుకోరు." ..."చిన్న పిల్లలు దేశభాషలో మాట్లాడటం నేర్చుకొనేది సహజ పద్ధతిలో పొందే శిక్షణవల్ల, పసివాడితో బాటు అతడి భాషాశక్తి ప్రవర్ధమాన మవుతుంది. అది మేధాశక్తిలో ప్రవర్తనలో భాగం, బహుశా అతడి శరీర వ్యవస్థలో కూడా కావచ్చు."... "మన చుట్టూ వున్న వాళ్ళు మాట్లాడుతుంటే విని మనం నేర్చుకొన్న భాషలోనే మన అభిప్రాయాలను పరమ సమర్థంగా అప్రయత్నంగా వ్యక్తీకరించగలమని అందరికీ తెలుసు."

పిల్లల విషయంలో కూడా ప్రాథమిక దశలో విపరీత సాహిత్య శిక్షణ పనికిరాదని వారు అభిప్రాయపడ్డారు. మార్పుల గురించి, జరగవలసిన విద్యా సంస్కరణల గురించి ఇలా అంటారు. "వాణిజ్య వ్యాపారాల, ఉత్పాదక పరిశ్రమల, వ్యవసాయ రంగాల ఆర్థిక వ్యవహారాల్లో మార్పులు గాని, వాటిని ప్రభావితం చేసే విధానాలు గాని వాస్తవానికి త్వరలో రూపొంద బోతున్నాయి. అవి మనమింకా సిద్ధంగాని సరికొత్త సామాజిక జీవితానికి దారితీస్తాయనటంలో సందేహంలేదు. అన్ని చోట్లా కదలిక కనిపిస్తున్నది. మనం ఆపదలచినా దాన్ని ఆపలేం," కనుకనే ఆ మార్పులకు సిద్ధపడే, ఎదుర్కోగలిగే విషయాలపైన ఎక్కువ దృష్టి కలిగించాలి కానీ పిల్లలకు ప్రాచీన సాహిత్యం నేర్పడానికి ఎక్కువ సమయం, శ్రమ ఉండొద్దంటాడు.

1913లో గిడుగు రాసిన ఈ నివేదికలోని విషయాలు చాలా వరకు ఈనాటికీ మనకు వర్తమానంలోని విషయాలే అనిపిస్తాయి. కనుక బాల సాహిత్యాభిమానులు, బాలసాహిత్య రచయితలు తప్పకుండా గిడుగు రామమూర్తి రాసిన "నేటి తెలుగు - నివేదికను" చదివితే, చర్చిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రపంచీ కరణ ప్రభావంలో పెరుగుతున్న పిల్లలు రాస్తున్న బాల సాహిత్యంలో అచ్చ తెలుగు పేరిటా, మాతృభాష రక్షణ పేరిటా, పెద్దలు విధించే నిబంధనలు వాళ్ళ వ్యక్తీకరణలకు ఆటంకాలుగా మారుతాయి. పిల్లలను స్వేచ్ఛగా వాళ్ళు మాట్లాడుతున్న భాషలోనే చెప్పడాన్ని ఆటంక పరిస్తే వాళ్ళ సృజనాత్మకత కుంటుపడుతుంది.

పిల్లలు పెరుగుతున్న క్రమంలోనే వాళ్ళ భాష, వాళ్ళ భాషా నైపుణ్యాలు వికసిస్తుంటాయి. అందుకు ఇల్లు, సమాజం, బడి, మీడియాలు వంటివి ప్రధానంగా తోడ్పడుతాయి. సాధారణంగా పిల్లలు రెండున్నర లేదా మూడు సంవత్సరాల వరకు మాతృభాషను మౌఖికంగా నేర్చుకుంటారు. వాళ్ళ దైనందిన వ్యవహారాలు, అవసరాలు, ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయాలు అన్నీ వ్యక్తం చేయగలుగుతారు. ఆ రెండేళ్ళలోపు అలా భాష నేర్చుకునే క్రమంలో పిల్లల్లో ఉచ్చారణ దోషాలు ఉంటాయి. కొందరు ఒక అక్షరానికి బదులు మరొక అక్షరం పలుకుతారు. 'వాన'ను 'ఆన' అని, 'రాలే' బదులు 'లాలే' అనీ ఇలా అన్నమాట. అలాగే పదాలు కొన్ని స్పష్టంగా పలుకలేరు. అవన్నీ అప్పుడు మనకు ముద్దుగానే అనిపిస్తుయి. అప్పటికి సరదాగా నవ్వుకున్నా వాటిని వాళ్ళు సరిచేసుకునేలా నేర్పిస్తాం. అంతేకానీ దాన్నే సరైన భాషగా స్థిరపరుచం. పరిసరాల ద్వారా అలా భాష నేరుకున్న పిల్లలు పాఠశాలలో పఠన, లేఖన నైపుణ్యాలను అభ్యసిస్తారు. వాళ్ళకు గేయాలు, పద్యాలు, పాటలు, కథలు వంటి కొన్ని ప్రక్రియలతో అప్పటి నుంచి పరిచయం కొంత ఏర్పడుతుంది. నూతన పదాలు, పర్యాయ పదాలు నేర్చుకుంటారు. అలాగే బడి బయట సినిమాలు, టీవీలు, సెల్ ఫోన్లు, కంప్యూటర్ వంటివి వాళ్ళకు ఈనాటి వ్యవహారంలో ఉన్న భాషను ఇప్పుడు నేర్పిస్తున్నాయి.

ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా అన్నీ మారినట్టే భాష కూడా కాలానుగుణంగా

**పిల్లలు భాష గురించి తన నివేదికలో గిడుగు రామమూర్తి గారు ఇలా చెప్పారు - "విద్యాభివృద్ధి మార్గానికి మహత్తరమైన ఆటంకం జీవద్భాషా స్థానంలో అతడు మృత కవితా భాషను నిలిపి దాన్ని ఛాందసంగా గౌరవించటం. సాధారణంగా పిల్లలు తమ మాతృభాష నెలా నేర్చుకుంటారో పండితులు అర్థం చేసుకోరు." ..."చిన్న పిల్లలు దేశభాషలో మాట్లాడటం నేర్చుకొనేది సహజ పద్ధతిలో పొందే శిక్షణవల్ల, పసివాడితో బాటు అతడి భాషాశక్తి ప్రవర్ధమాన మవుతుంది.**

మారుతున్నది, మారింది, మారుతుంది కూడా. దాన్ని కొంతయినా నెమ్మదించి మాతృ భాషలను రక్షించుకోవాలంటే, అచ్చ తెలుగును కాపాడుకోవాలంటే పల్లె ప్రజల భాషను, పల్లె పిల్లల భాషను, వెతికి, వెలికి తీసి, పిల్లల సాహిత్యంలోకి తెచ్చుకునే అవకాశం, స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి.

పిల్లలు తల్లి ద్వారా, తండ్రి, ఇతర కుటుంబీకుల ద్వారా, చుట్టున్న సమాజం ద్వారా నేర్చుకునేదే మాతృభాష కదా! మరి ఈనాటి తల్లిదండ్రులు ఎందరు తెలుగులో మాట్లాడుతున్నారు? వాళ్ళు మాట్లాడుతున్న భాషలో తెలుగెంత? అచ్చ తెలుగెంత? ఇతర భాషల పదాల శాతం ఎంత? వాళ్ళు మాట్లాడుతున్నదే కదా పిల్లలు నేర్చుకుంటున్నారు! తెలుగు భాషాభిమానులమనీ, తెలుగును రక్షించాలనీ, పిల్లలు 'మమ్మీ డాడీ'లని అంటున్నారనీ వాపోతున్న తెలుగు పెద్దలు తాముమాత్రం ఎక్కడ ఎవరితో మాట్లాడినా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్న వాస్తవాలను ప్రతిరోజూ నగరాల్లో చూస్తూనే ఉన్నాం కదా! అందుకే వాళ్ళ పిల్లలు కూడా ఇంగ్లీష్ కలిసిన తెలుగులో తప్ప మాట్లాడలేక పోతున్నారు మరి!

కొంత కాలం కిందట తెలంగాణ సాహిత్య అకాడమిలో ఫ్యూషన్ షాయిరీ గురించిన ఓ కార్యక్రమం జరిగింది. దానిలో పాల్గొన్న సాహిత్యవేత్తలు ఫ్యూషన్ షాయిరీ గురించి ఇలా వివరించారని పత్రికలో వచ్చింది. "ఇప్పటి ప్రపంచంలో భాషకు సంబంధించి ప్యూరిటనిజం అన్నది కొంచెం కష్టం. మన సమాజం మల్టీ లింగ్వల్, మల్టీ కల్చరల్, మల్టీ వేరియేషన్స్ ఉన్న జీవితంలో ఉన్నాం. ఏ భాషకు ఆ భాష తమిళ, బెంగాలీ, కన్నడ, తెలుగు అని నిర్దిష్టత ఉన్నా అన్నీ ఏక్టివిటీస్ కలగలిపిన జీవిత విధానం ఇప్పుడు వాడుకలోకి వచ్చింది. ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్ అయింది. సంస్కృతుల సత్సంగమం ఇది. ఈ క్రమంలో మల్టీ లింగ్వల్, మల్టీ కల్చరల్ లైఫ్‌ని లీడ్ చేస్తున్నాం. ఏ భాషలో ప్యూర్‌గా మాట్లాడే పరిస్థితి లేదు. అన్ని భాషలదీ ఇదే పరిస్థితి. కొత్త తరంవాళ్ళు ఆర్ యూ దేర్ కి బదులు ఆర్ యూ (ఇంగ్లీష్ పొడి అక్షరాలు) దేర్ అని రాస్తున్నారు. ఈ యంగ్ జనరేషన్ ఇలాగే రాస్తున్నారు. భాషలో ఇలాంటి పరిణామాలు జరుగు తున్నాయి. ఏ భాషా పదాలనైనా తనకు ఉపనదుల్లా కలుపుకొని ఉపయోగించు కునే శక్తి తెలుగు భాషకు ఉంది. తెలుగు ప్రజలకు ఉంది. ఈ క్రమంలో కవిత్వం, సాహిత్యం మారాలి. మారుతున్న పరిస్థితులను బట్టి మారాలి. అభ్యుదయ, ఆధునిక, దిగంబర, మైనారిటీ, స్త్రీవాద, దళిత వాద, అస్తిత్వవాద, కవిత్వం వంటి ఎన్నెన్నో రూపాలు సంతరించుకుంటూ వచ్చింది కవిత. ఇప్పుడు మనం ఫ్యూషన్ లైఫ్ లీడ్ చేస్తున్నం. ఫ్యూషన్ మ్యూజిక్, ఫ్యూషన్ డ్యాన్స్ లాగా ఫ్యూషన్ కవిత ఇప్పటి కవి బాధ్యత. కొన్ని కొన్ని భాషల్లో పదాలు భావాన్ని ప్రదర్శించినట్టు ఇతర భాషల పదాలు వ్యక్తం చేయవు. కాబట్టి కవిత తెలుగు అయినా ఇతర భాషా పదాలు స్వాభావికంగా కవితలో వస్తాయి. తెలంగాణలో గోస, సోయి అన్న పదాలు న్నాయి. ఏ భాషలోనూ ఈ పదాల టోటల్ ఫీలింగ్ రాదు. ఇవి ఆయా ప్రాంతాల నైసర్గిక, సామాజిక, మానసిక ప్రజల సామూహిక అవసరాలనుంచి పుట్టిన పదాలు కాబట్టి ఫ్యూషన్ షాయరీ లో ఒక థాట్ తో మొదలు పెడతారు. ఇన్స్పయిరింగ్ అన్న పదం ఉంది. ప్రేరణాత్మకం అనే కంటే ఇన్ స్పయిర్ అని రాయాలి. ఇది ప్రోజ్ రూపంలో ఉండవచ్చు. పొయెట్రీ రూపంలో ఉండవచ్చు..." ఇలా తెలుగు వారికి ఫ్యూజన్ షాయిరీని పరిచయం చేసిన వారు మామిడి హరికృష్ణ గారు. నేటి వాడుక భాషకు సంబంధించి గమనించ వలసిన ముఖ్యమైన కొన్ని ముఖ్యమైన విషయాలు దీనిలో ఉన్నాయి.

ఈ నాటి పిల్లలు రాస్తున్న రచనల్లో కూడా భాషకు సంబంధించి ఈ సౌలభ్యాన్ని మనం ఎందుకు అంగీకరించ కూడదు?. బాలసాహిత్యంలో ఇది ఈ నాటి అనివార్య అవసరంగా నేను భావిస్తున్నాను. ఈ అవకాశం ఇస్తే పిల్లలు మరింత స్వేచ్ఛగా, మరింత బలంగా తమ భావాలను, ఆలోచనలను, కల్పనలను, సృజనలనూ వ్యక్తీకరిస్తారు. వాటిని తమ స్నేహితులతో మాట్లాడుతున్నంత ఆనందంగా, సహజంగా రాయగలరని నేను భావిస్తున్నాను. కనుక తెలుగును కాపాడేబాధ్యత పెద్దలుగా, పండితులుగా, కవులుగా పెద్దవాళ్ళం తీసుకొని పిల్లల్ని తమ ఈనాటి తమ భాషలో, తమ పదాల్లో, తమ వ్యక్తీకరణల్లో స్వేచ్ఛగా రాసుకోద్దాం.

భాషాభిమానం వేరు భాష అవసరాలు వేరు. అన్ని భాషలూ గొప్పవే. దేని ప్రత్యేకతలు దానికి ఉంటాయి. ఏ భాష పైనా గుడ్డి వ్యామోహమూ, మితి మీరిన అభిమానమూ సరికాదు. 'భాషను నిర్మలమూ, పవిత్రమూ అనే భావనలతో కాదు చూడాల్సింది. భాష మనిషికి ఆ పరిస్థితులలో ఏ మేరకు ఉపయోగ పడుతున్నది అనేది ప్రధానంగా చూడాలి'. భాషా వినిమయం ఈ నాటి అందరి అవసరం. అందుకు భాషా నైపుణ్యాలు కావాలి. పాండిత్యం వేరు భాషను తమ ప్రయోజనాలకు తగినట్టుగా వినియోగిం చుకోగలగడం వేరు. సాహిత్య బోధన భాషా బోధన ఒకటి కాదు. ఇప్పటి పరిస్థితులలో అచ్చ తెలుగు సాధ్యమా? ఈ నాడు అలా ఏ భాషలో నైనా కుదురుతుందా? ఈ నాటి పిల్లలకు ఎలాంటి భాషావసరాలున్నాయి?. ఇవన్నీ ఆలోచించాలి.

"మార్పు కాలం ఇచ్చే తీర్పు" అన్నారు సినారే. మార్పు అనేది ప్రకృతి ధర్మం. సృష్టిలో మారనిది ఏదీ ఉండదు. అవి భాషలైనా సరే మార్పు అనివార్యం. భాషలు కూడా జీవనదుల్లా ప్రవహిస్తూ వెళుతుండవలసిందే. దానిలో అనేక ఉప నదులూ, వాగులూ కలిసి అవి విశాలంగా విస్తరిస్తూ, సాగుతుంటేనే చిరకాలం ఉంటాయి. అలాకాకుండా నాకు నేనుగా మాత్రమే ఉంటానని ఓ నిలువనీటి మడుగులా ఉండిపోతే ఎండిపోక తప్పదు.

వ్యాసం

ఆయా దేశకాల పరిస్థితులనుబట్టి, భౌగోళిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి అక్కడి ప్రజల భాషలో ఇతర భాషల శబ్దాలు వచ్చి చేరుతుంటాయి. వాటిలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా అది అనివార్య పరిణామం. భాష పూర్తిగా అదృశ్యం కావడం వేరు, భాషలో మార్పులు చోటుచేసుకోవడం వేరు.

మన తెలుగులో కూడా మొదటినుంచీ ఇలాంటి మార్పు జరుగుతూనే ఉంది. తెలుగులో అనేక సంస్కృత పదాలు తత్సమాలుగా, తద్భవాలుగా వచ్చి చేరాయి. తెలుగూ, సంస్కృతమూ కలిసిందాన్నే ఆంధ్రమని అంటున్నామని భాషావేత్తలు అంటారు. నేడు ఏది తెలుగు పదమో, ఏది సంస్కృత పదమో గుర్తించడం అంత సులభం కాదు. అదే విధంగా మధ్య యుగాలనుంచి, ఆధునిక కాలం వరకూ మన తెలుగులో మరాఠీ, ఉర్దూ, హిందీ, వంటి కొన్ని భాషల పదాలు వచ్చి చేరి, ప్రజల నోళ్ళలో అవి తెలుగు పదాలుగానే చలామణి అవుతున్నాయి. అలాగే అనేక ఇంగ్లీషు పదాలను ప్రజలు తమ పలుకుబడుల్లో చేర్చుకుని వాటిని తెలుగు పదాలుగానే వాడుతున్నారు.

చరవాణి అనే నేటి తెలుగు మాటకన్నా ఫోన్ అనడానికే జనం ఇష్టపడుతున్నారు. సంగణకం అనే మాటకన్నా కంప్యూటర్ అనే మాటే ప్రజలు ఇష్ట పడుతున్నారు. నిస్తంత్రి ఆధారిత వ్యవస్థ అనడం కంటే వై-ఫై అనడమే జనానికి పట్టింది. ఈనాడు కుప్ప తెప్పలుగా వచ్చి పడుతున్న సాంకేతిక వస్తుజాలానికి తెలుగు పేర్లు పెట్టే పండితులు జనానికి పట్టని కఠిన సంస్కృత పదాలతో ఏర్పడిన పదాలను తెలుగు పదాలుగా తయారు చేస్తున్నారు. అవి పుస్తకాలకే పరిమితమౌతున్నాయి కానీ జనం భాషలోకి వెళ్ళడం లేదు.

సెల్ఫీ, కీబోర్డు, డౌన్‌లోడ్, వీడియో కాల్, మెమొరీ కార్డు, వాట్సప్, యూట్యూబ్ వంటి అనేక పదాలకు పండితులు తెలుగు పదాలను తయారు చేసినా వాటిని జనం ఎందుకు స్వీకరించడంలేదో ఆలోచించాలి. ఈనాటి బాల సాహిత్యంలో ఇలాంటి పదాలు వాడకుండా రాయడం సాధ్యం కాదని, అలా రాస్తే అది ఈనాటి తెలుగు పిల్లల భాష కాదనీ, ఈ నాటి పిల్లలకు చాలా దూరంగానే ఉండి పోతుందని గ్రహించాలి. ఈనాటి పిల్లల సాహిత్యం ఈ నాటి పిల్లల భాషలోనే ఉండాలి.



ఈనాటి సమాజంలో మన చుట్టూ, పిల్లల చుట్టూ వాడుక భాషలో ఉన్న కొన్ని మాటలు చూడండి- లైట్ తీసుకో, ప్రైవేటు నిపుణులు, చీటింగ్ కేసు, మనోళ్ళే అడ్వాన్స్‌డ్, చికెన్, బయో ప్లాస్టిక్, సూపర్ హిట్, రైట్ రైట్, ఫ్యూచర్ ప్లాన్, ఫుకార్ల షికార్లు, ఫిర్యాదు, రియల్ దందా, హైటెన్షన్ వైర్లు, కిట్ల పంపిణీ, మెగా, హైడ్రామా, దర్వాజ, టీనేజర్ , కాన్వకేషన్, బస్‌స్టాండు, రైల్వే స్టేషన్, హోటల్ .. ఇవన్నీ ఈ నాడు పత్రికల్లో ప్రతిరోజూ వస్తున్న పదాలు. అలాగే ఏ బజారులో ఉన్న దుకాణాల బోర్డులు చూసినా- బ్యూటీ పార్లర్, హెయిర్ కట్టింగ్ సెలూన్, కిరాణా షాప్, ఇడ్లీ సెంటర్, రిపేరింగ్ షాప్, షోరూం, హోమియో క్లినిక్, డైయిరీ ఫాం వంటి పేర్లే కనిపిస్తున్నాయి. ఇప్పుడు వీటిని మాన్పించి, అచ్చతెలుగు పదాలు నేర్పించడం అంత సులభం కాదు.

ఇలాంటి వాతావరణంలో పిల్లలకు అచ్చ తెలుగు నేర్పించాలనే బాధ్యతనే ప్రధానంగా బాలసాహితీ వేత్తలు స్వీకరించి రాస్తే ఇల్లు దాటని చిన్న పిల్లలకు ఫరవాలేదేమో కానీ, ఇల్లుదాటి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టిన పెద్ద పిల్లలకు అది అందుతుందా అని ఆలోచించాలి.

ప్రస్తుతం మన తెలుగు బాలసాహిత్యంలో వస్తున్న రైమ్స్ వంటివి, గేయాలు, కథలు, పద్యాలు, పాటలు మొదలైనవన్నీ ప్రాథమిక స్థాయిలో ఉన్న పిల్లలను ఉద్దేశించి వస్తున్నాయి. అయితే వాటిలో మనం ఉపయోగిస్తున్న భాష, వ్యక్తీకరణలూ పూర్తిగా ఈనాటి వ్యవహారిక భాషలోనే ఉంటున్నాయా? పిల్లల వర్తమాన జీవిత వ్యవహారాల్లో ఎంత మేరకు అవి ఉపయోగించుకునేలా ఉంటున్నాయి? వారి భాషా నైపుణ్యాల వృద్ధికి ఎంతవరకు అవి ఉపయోగపడతాయి? వంటి విషయాలను పట్టించుకోవాలి. పరిశీలించాలి. ఆ దిశగా చర్చలు జరగాలి. వినుచును, అడుగవలయును, వెళ్ళవలెన్, వచ్చును, పొందెదము, చేసెదను, వినెదన్,

వ్యాసం

పులి యుండెను, ఇట్లనెను" వంటి పాత పదాలు, కృతకంగా ఉండే పదాలు, గ్రాంథిక పదాలు, వ్యక్తీకరణలూ, వాక్యాలు ఈనాటి బాలసాహిత్యంలో కొందరు రచయితలం ఇంకా రాస్తున్నాం. ఇప్పటి పిల్లలు మాట్లాడుతున్న భాషలో లేని చూచితిని, చూచెను, చూచిరి, మురిసితిని, వచ్చెను, పోయెను, చేయకుము, నేర్వగవలెను, చదివెదను, వెళ్ళెదను, కలదు, గలదు, వ్రాత, త్రవ్వడం, ఏడ్చినది, నానందము నందితిని, అర్ధరాత్రి ఆయెను, పండు రాలెను, అతడు వెళ్ళెను, ఇచ్చట, అచ్చట, పలికెను,రాయుము, నందు, వంటివాటిని వాడుతున్నాం. అలాగే చెప్పబడినది, వండబడును వంటి కర్మణి వాక్యాలు వాడుతున్నాం. వర్తమాన క్రియలు చెప్పేటప్పుడు ఇప్పుడు వర్షం కురుస్తుంది అని కాకుండా ఇప్పుడు వర్షం కురుస్తూ ఉన్నది, లేదా ఇప్పుడు వర్షం కురుస్తోంది, అలాగే సీత వెళ్తుంది అని కాకుండా సీత వెళ్తూ ఉన్నది లేదా, సీత వెళ్తోంది లాగా రాస్తే మరింత స్పష్టంగా ఉంటుంది. అలాగే అసహజం అనిపించే వాక్యాలు, సందేహాన్ని కలిగించే అస్పష్ట వాక్యాలు వదిలి పెడదాం. ఇవి కొన్ని సూచనలు మాత్రమే. ఇంకా గమనించవలసినవి చాలానే ఉన్నాయి.

కాలంతో బాటు మనుషులు మారుతారు. పిల్లలు కూడా మారుతారు. వాళ్ళు భాషను వినిమయం చేసుకునే అవసరాలు మారుతాయి. భాష మారుతుంది. కనుక ఈనాటి ప్రజల, పిల్లల భాషకు దూరమైన భాషను, ఈనాటి అవసరాలకు సంబంధంలేని గతకాలపు భాషను క్రియల వ్యక్తీకరణ లను, గ్రాంథికమైన భాషను, కృతకమైన భాషను ఇంకా పిల్లలకు నేర్పడం సరి కాదు.

పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతులు చదువుతున్న క్రమంలోనే పిల్లలు నన్నయ నుంచి నారాయణరెడ్డి రచనల వరకు పాఠాల రూపంలో చదువుకుంటున్నారు. పరీక్షల కోసం. రకరకాల పద్యాలు, కవిత్వాలు

**కొత్తగా బాలసాహిత్యం రాస్తున్న వారికీ, ఈనాటి పిల్లలకూ నాకు తోచిన మరికొన్ని సూచనలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. బాలసాహిత్యం రాస్తున్న మనం రాసేటప్పుడు కొన్ని విషయాలు బాగా గుర్తుంచుకుందాం. మనకు తెలిసిన భాషలోనే రాద్దాం.**

వంటి రచనలు ఎన్నో చదువుతున్నారు. అయినా తమ భావాలను లిఖిత పూర్వకంగా సక్రమంగా వ్యక్తం చేయలేక పోతున్నారు. అందుకు వాళ్ళనే తప్పు పట్టలేం. వాళ్ళు పరీక్షలకోసం నేర్చుకునే చదువులో వాళ్ళకు వర్తమాన జీవితానికి అవసరపడే భాషను నేర్చుకునే విధానం లేదు. కనుక పిల్లలు అలా తయారౌతున్నారు.

చివరిగా భాష గురించి కొన్ని విషయాలు మీ దృష్టికి తెచ్చి ఈ వ్యాసం ముగిస్తాను. సృష్టిలోని ప్రతీ జీవికి తనదైన భాష ఉంది. అది వాటికి అర్థమౌతుంది. మానవులకు కూడా తమ తమ భాషలు వేరు వేరుగా ఉన్నాయి. మన నోటినుంచి వచ్చే శబ్దాల అర్థవంతమైన కూర్పుని భాషగా చెప్పుకుంటాం. భాష కేవలం నోటినుంచి వచ్చే శబ్దాలు మాత్రమే కాదు. దానికి హావ భావాలు కలుస్తాయి, కంఠంలోంచి వచ్చే ధ్వని లయలు, మార్పులు కలుస్తాయి. సమయ సందర్భాలను బట్టి వ్యక్తం చేసే భాషలో అర్థాలు స్ఫురిస్తాయి. భాషను కేవలం మౌఖికంగానే కాకుండా, లేఖన రూపంలో కూడా వ్యక్తం చేయగలిగే శక్తి అందరికీ ఈనాటి తప్పనిసరి అవసరం. భాషను వ్యక్తం చేసే నైపుణ్యాలతో బాటు-భాషను అర్థం చేసుకునే నైపుణ్యం కూడా అలవాటు చేసుకోవాలి.

భాష కేవలం భావ వినిమయానికి మాత్రమే సాధనం కాదు. భాష ఒక నాగరికత. భాష మన అభివృద్ధికి తోడ్పడే గొప్ప అవకాశం. భాష ఆత్మ స్థైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ ఇచ్చే ఆస్తి. భాష బయటి ప్రపంచంతో కలిపే వారధి, సారధి. అపురూపమైన సాధనం. భాష మనలోని అంతర్గత శక్తులను వెలికి తెచ్చే పాతాళ గరిగ. భాష గౌరవాన్ని కలిగించేది. భాష జీవితానికీ, జీవికకూ ఓ అద్భుతమైన లిఫ్ట్. భాష ఓ శక్తి వంతమైన ఆయుధం. ఈనాడు ఎన్ని భాషలు నేర్చుకుంటే అన్ని లాభాలు.

కొత్తగా బాలసాహిత్యం రాస్తున్న వారికీ, ఈనాటి పిల్లలకూ నాకు తోచిన మరికొన్ని సూచనలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. బాలసాహిత్యం రాస్తున్న మనం రాసేటప్పుడు కొన్ని విషయాలు బాగా గుర్తుంచుకుందాం. మనకు తెలిసిన భాషలోనే రాద్దాం. మనం మాట్లాడే భాషలోనే రాద్దాం. మనం మాట్లాడుతున్న విధంగా రాద్దాం. తప్పులు లేకుండా జాగ్రత్తగా రాద్దాం. ఇతరులు చదవగలిగిన విధంగా రాద్దాం. ఒత్తులు, దీర్ఘాలు సరిగ్గా ఉండేలా రాద్దాం. పదాలు సరిగ్గా, విడివిడిగా ఉండేలా రాద్దాం. వాక్యాలు సరిగ్గా ఉండేలా చూసుకొని రాద్దాం. చిన్న చిన్న వాక్యాలు ఉండేలా రాద్దాం. ఇతర భాషల పదాలు వచ్చినప్పుడు వాటిని తెలుగు అక్షరాలలోనే రాద్దాం. అంకెలు కూడా వాడాల్సి వస్తే వాటిని కూడా తెలుగు అక్షరాలలోనే రాద్దాం. విరామ చిహ్నాలు, కనీసం ఫుల్‌స్టాప్, కామాలు సరిగ్గా రాద్దాం. వాడుకలో ఉన్న పదాలు, క్రియాపదాలు, వాడుకలో ఉన్న వ్యక్తీకరణలు, వాక్యాలు మాత్రమే రాద్దాం. సామెతలూ, జాతీయాలూ సేకరించుకొని సందర్భాను సారంగా మన రచనల్లో వాటిని ఉపయోగించుకుందాం. ఈ నాటి బాలసాహిత్యం ఈనాటి మన భాషలో రాద్దాం.

చివరిగా గిడుగు వారు నివేదికలోని ఉదాహరించిన 'థింగ్' మాటలతోనే ఈ వ్యాసాన్ని ముగిస్తాను-"మనో నేత్రాన్ని" సుశిక్షితం చేయటానికి మాతృభాషను అలవర్చుకోవాలి. అంటే నిజమైన మాతృ భాషనే కానీ పాఠ్య గ్రంథాల్లోని కృత్రిమ 'వర్గభాష'ను కాదు."

***(ఆగస్టు 29... గిడుగు జన్మదిన సందర్భంగా...)***

వ్యాసం

# డా॥ అయోధ్యరెడ్డి కథల్లో పాత్రపోషణ...

**సామాన్యుని దుఃఖానికి సరియైన ప్రాతినిధ్యం వహించిన కథలు...**




జయంతి వాసరచెట్ల
99855 25355


> **కథ అనేది మనకి జీవితంలో జీవిత రహస్యంతో జీవిత వైచిత్రితో కొత్త కొత్త పరిచయం కలుగచెయ్యాలి. కథ చెప్పే విధానమే కథకు అందాన్ని బలాన్నీ ఇస్తుంది.**
> *- దేవరకొండ బాల గంగాధర తిలక్.*

క్రీ.శ. 19వ శతాబ్దంలో ఆంగ్లం నుండి దిగుమతి అయిన వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒకటి. అనే పెద్దలు చెప్తారు భారతీయ వాఙ్మయ సాహిత్యంలో కథా సాహిత్యం అతి ప్రాచీన కాలం నుండే కనిపిస్తుంది.

కథ విస్తృతమైనది. కథలు మన జీవనశైలిని ప్రతిబింబింప చేస్తాయి. ఆయా కాలమాన పరిస్థితులను కథలు రికార్డు చేసుకుని రాబోయే తరాలకు ఉపయుక్తంగా ఉంటాయి. కథాప్రపంచంలో అనేక మంది రచయితలు వారి వారి శైలిలో వారి రచనలు కొనసాగిస్తూ ప్రత్యేకతను ఏర్పరచుకున్నారు.

డాక్టర్ అయోధ్యరెడ్డి సుప్రసిద్ధ కథకులుగా అనువాదకులుగా అందరికీ పరిచయమే. వారి తొలి కథాసంపుటి "ఆహార యాత్ర"తో సాహిత్య ప్రపంచంలోకి అడుగుపెట్టి నిర్విరామంగా రచనలు కొనసాగిస్తూ తరువాతి కథా సంపుటి "అక్కన్నపేట రైల్వే స్టేషన్" ద్వారా భిన్నమైన అభివ్యక్తి తాత్వికత శైలితో రాసిన రచనల ద్వారా అందరి హృదయాలను గెలుచుకున్నారు అయోధ్య రెడ్డి.

అయోధ్యరెడ్డి కథకులే అయినా వారి కథాశిల్పంలో వర్ణనలన్నీ కవితాత్మకంగా ఉండటం ఆశ్చర్యపరుస్తుంది. పద్నాలుగు కథల సమాహారం అక్కన్నపేట రైల్వే



స్టేషన్ లో మొదటి కథ "చావు వాసన" చివరి కథ "పాముల నడుమ చీమ". "చావు వాసన" అనే కథలో ప్రాణప్రదంగా పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్య సమయంలో అనారోగ్యంతో బాధపడుతుంటే అక్కున చేర్చుకోవాల్సిందిపోయి వీధిలోకి నెట్టివేసిన వైనం ఈకథలో చూడవచ్చు.

ఉత్తమపురుషలో సాగిన ఈ కథలో సినిమా చూసి థియేటర్ నుంచి బయటకు వచ్చిన వ్యక్తి ఒక బస్టాండ్‌లో నిలబడ్డాడు. నీరసంగా ఉన్న వీరయ్య అనే వ్యక్తి చెయ్యి చాచి ఏదైనా ధర్మం చేయమని అన్నట్లు బస్‌స్టాప్‌లోని అందరి అడుగుతూ వస్తూ ఈ వ్యక్తి దగ్గరికి వస్తాడు. అతన్ని చూసి జాలితో పది రూపాయలు చేతిలో పెట్టి పంపుతాడు. వీరయ్య నాలుగు అడుగులు వేసి సొమ్మసిల్లి పడిపోతాడు.

పది రూపాయలు ఇచ్చిన వ్యక్తి పరిగెత్తుకుంటూ వెళ్ళి వీరయ్య ముఖంపై నీళ్లు చల్లి అతను తేరుకున్నాక పక్కనే ఉన్న ఒక హోటల్‌కి తీసుకెళ్ళి బిర్యానీ పెట్టిస్తాడు. అతను ఆ బిర్యానీని దాచుకుని వెళ్తుంటే ఎందుకు దాచుకుంటున్నావ్ అని ఆపడంతో అతని భార్య కోసం అని... ఇలా చెప్తాడు అతని పేరు వీరయ్య అని అతని భార్య ఆరోగ్యం బాగా లేకపోతే కన్న కొడుకు ఇంట్లో చావు వాసన వస్తుందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టారని.. నిలువ నీడ లేక చేతిలో డబ్బులు లేక వైద్యం చేయించలేక ఫ్లైఓవర్ కింద తలదాచుకుంటున్నామని అక్కడికి తీసుకుని వెళ్లి అతని భార్యను చూపుతాడు. ఆ దృశ్యాన్ని రచయిత వర్ణించిన తీరు ఎంతో

హృద్యంగా ఉంది.

ముడుచుకుని పడుకున్న ఆ వృద్ధురాలిని మూటకట్టిన వస్తువులా పడి ఉంది అంటారు. రోడ్ల మీద కిక్కిరిసిన జనాలను బ్యాక్టీరియాతో పోలుస్తారు. వీరయ్య భార్య తన ప్రాణం పోతున్నా నిస్సహాయంగా ఆమెను పొదువుకున్న అతన్ని చూస్తూ ఆమె ఆ సమయంలో తమ కన్న పిల్లలను క్షమించమని భర్తతో వేడుకుంటున్న దృశ్యం కథలో చిత్రిక పట్టారు రచయిత. తల్లి ప్రేమను స్పష్టీకరణ చేసారు. నేటి సమాజంలో మానవత్వ విలువలు అంతరించిపోతున్న దుస్థితిని ఆధునికతను జోడించి చక్కగా రాసాడు.

ఇలాంటి మరోకథ "అక్కన్నపేట రైల్వే స్టేషన్". ఈ కథలో వెంకటేష్ అనే పిల్లవాడు రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోతాడు. తల్లి చనిపోయిన తర్వాత తండ్రి తాగుబోతుగా మారి అతని భార్య మరణానికి వెంకటేష్ కారణమని హింసిస్తూ డబ్బు కోసం పీడిస్తూ ఉంటాడు. ఆ పసివాడు తల్లి ఉన్నప్పుడు తండ్రి ప్రేమ ఆప్యాయతల స్థానంలో రాక్షసుడుగా మారిన తండ్రిని చూడలేక అది భరించలేక రైలు కింద పడి చనిపోవాలి అనుకుంటాడు.

ఆ పిల్లవాడిని చూసిన ఒక బిచ్చగత్తె వాడి మనస్సు మార్చి ఇంటికి వెళ్లే విధంగా ప్రేరేపిస్తుంది. అలా వెంకటేష్ బతకడానికి కారణమౌతుంది. ఈ కథలో బాలల పట్ల మన ప్రవర్తన ప్రభావం ఎంతగా ఉంటుందో తల్లిదండ్రులు బిడ్డల మానసిక స్థితిని తెలుసుకోకుండా ఉంటే పరిణామాలు ఎలా ఉంటాయో తెలుస్తుంది.

భ్రూణహత్యలపై సంధించిన మరో కథ "ప్రేగుముడి" కడుపుతో ఉన్నప్పుడు ఆడపిల్లనా మగపిల్లవాడా అని తెలుసుకునే లింగనిర్ధారణ పరీక్షల వల్ల ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించి కడుపులోనే ఆ పసిదాన్ని సమాధి చేస్తారు. అలా ఆ తల్లి మూడోసారి కూడా ఆడపిల్లే అని నిర్ధారించి అబార్షన్ చేయించాలని ఆమెను హాస్పిటల్‌కి తీసుకుని వస్తారు. అయితే ఆమెకు మొదటిసారి అబార్షన్ చేసినప్పుడు చనిపోయి దేవుని దగ్గరికి పోయిన తన బిడ్డ ఆమె కోసం వచ్చి తనను ప్రశ్నించినట్లు ఊహించుకుని అందమైన ఆ లోకంలో అమ్మను నిల దీసినట్లు అనుభూతి చెంది మూడోసారి కూడా ఆమె కడుపులోనే హత్య చేయడం ఇష్టం లేక అదే హాస్పిటల్ పైనుండి దూకి మరణిస్తుంది ఆ మహిళ.




లింగనిర్ధారణ ద్వారా ఆడపిల్ల అని తెలుసుకుని భ్రూణహత్యలకు చేస్తున్న వైనాన్ని కనీస మానవత్వం కూడా మరిచి ప్రవర్తిస్తున్న తీరును రచయిత ఈ కథ ద్వారా తెలియజెప్పారు.

**"అక్కన్నపేట రైల్వే స్టేషన్" కథలో వెంకటేష్ అనే పిల్లవాడు రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోతాడు. తల్లి చనిపోయిన తర్వాత తండ్రి తాగుబోతుగా మారి అతని భార్య మరణానికి వెంకటేష్ కారణమని హింసిస్తూ డబ్బు కోసం పీడిస్తూ ఉంటాడు. ఆ పసివాడు తల్లి ఉన్నప్పుడు తండ్రి ప్రేమ ఆప్యాయతల స్థానంలో రాక్షసుడుగా మారిన తండ్రిని చూడలేక అది భరించలేక రైలు కింద పడి చనిపోవాలి అనుకుంటాడు.**

మరో కథ "ఒక రచయిత మరణం". ఈ కథలో మెయిన్ రోల్ చంద్రమౌళి అనే ఒక రచయిత అతను ఒక మంచి రచన చేసి పేరు తెచ్చుకోవాలని అనుకుంటాడు.

అలాంటి ఒక రచన చేయాలనే తలంపుతో మూడు నెలలు చాలా కష్టపడి రైతును కథావస్తువుగా తీసుకుని రాసిన కథ "తెలుగు జిలుగు" అనే పత్రికవారు నిర్వహించిన పోటీకి పంపుతాడు. ఆకథకు మంచి బహుమతి వస్తుందని నమ్మకంతో ఎన్నో కలలు కంటాడు. ఊహల్లో విహరిస్తాడు. ఒకరోజు పోస్ట్‌మెన్ ఒక కవర్ ఇచ్చి వెళ్తాడు. అందులో తనకు వచ్చిన బహుమతిని గొప్పగా ఊహించుకుంటూ ఇంటికి వెళ్ళి ఆ లెటర్ తెరిచి చూస్తాడు. అందులో " మీకథ పోటీకి ఎంపిక కాలేదని చెప్పడానికి చింతిస్తున్నాం" అని ఉంటుంది. అతను కన్నకలలు కూలి పోయి సంకల్పం నీరుగారిపోయిందని కొన్నాళ్ళు అదే విషయాన్ని గురించి ఆలోచించి మథనపడి మరికొన్నాళ్లకు ఆ రచయిత తన రచనావ్యాసంగాన్ని వదిలి వేస్తాడు. అదే ఒక రచయిత మరణంగా చంద్రమౌళి చెప్తాడు.

ఒక రచయిత తను ఎంతో నమ్మకంగా చేసిన రచన అలా ఎంపిక

కాకపోయేసరికి అతనిలోని సృజనాత్మకత కూడా మరుగునపడిపోతుందని ఈ కథ ద్వారా రచయిత చెప్పాలనుకున్నాడు.

మరో మోసపోయిన యువతి కథ "వెంటాడిన రాత్రి". ప్రేమించిన వాడికోసం కనిపెంచిన తల్లిదండ్రులను వదిలి పారిపోయి వస్తుంది భాను అనే అమ్మాయి. అతని పేరు గోపాల్. అతను ఆమెను ఒక పాడుబడిన లాడ్జ్‌కు తీసుకువస్తాడు. ఇక్కడికెందుకు అని అడిగిన ఆమెతో మీ వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు, మనం ఎక్కడికెళ్ళినా పట్టుకుంటారు. అందుకే ఎవ్వరూ చూడని ఇక్కడికి తీసుకుని వచ్చాను అంటాడు. కానీ ఆమెకు తాను తప్పు చేశాననే భావన కలుగుతుంది. అతనితో అదే మాట అంటుంది. అతని మనసులో అంతకు ముందే దురాలోచన బీజం వేసుకుని ఉంటుంది. కాబట్టి ఆమె భయాన్ని అర్థం చేసుకోడు. వద్దు అన్నా ఆ అమ్మాయిని అనుభవించాలని దగ్గరికి వెళ్తాడు. తప్పు చేసానన్న భయంతో భాను మరణిస్తుంది. గోపాల్ రాత్రికి రాత్రి ఆమె బ్యాగులోని డబ్బు, బంగారం తీసుకుని లాడ్జి వదిలి పారిపోయి రైల్వే స్టేషన్‌కు వస్తాడు.

రైలు టికెట్టు తీసుకుందామనుకుంటే తన పర్సు కనిపించదు. వచ్చే సమయంలో తన ఆధార్‌కార్డు, రైల్వే టికెట్ వగైరా లాడ్జిరూమ్‌లోనే పడిపోయాయని గ్రహించి కుప్పకూలిపోతాడు.

ఈ కథ వల్ల ఆడపిల్లలు అనాలోచితంగా చేసే పనుల వల్ల కన్న వాళ్ళకు అప్రతిష్ఠతో పాటు తమ భవిష్యత్తు ఎంతలా నాశనం అవుతుందో తెలియజేసాడు రచయిత. ప్రపంచంలో మోసగాళ్ల తీరును అందువల్ల ఆడపిల్లల బ్రతుకును ఎంతలా నాశనం చేసుకుంటున్నారో అద్భుతంగా వర్ణించాడు. అలాగే తప్పుచేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు అనే నీతిని కూడా ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

మరో మోసపోయిన అమ్మాయి కథ "ఏన్ అనాథరైజ్డ్ లవ్ స్టోరీ". వాస్తవానికి ఊహకి తేడా ఏమిటో తెలియజేసే ఈ కథలో అరవింద నిరుపేద అమ్మాయి. రవీంద్ర మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు పార్వతమ్మ దంపతుల మనవడు. ఢిల్లీలో ఉండే రవీంద్ర చిన్నప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెలవులకు వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ ఊరు రావడం జరుగుతుంది. చిన్నప్పటి నుంచే అరవిందతో ఆడుకునేవాడు.

అలా మొదలైన పరిచయం ఆకర్షణగా మారింది. దాన్నే ప్రేమ అని వాళ్ళు పెట్టుకున్న మరొక పేరు కావచ్చు! అతనిలో కలిగిన మోహాన్ని ఆమె కనిపెట్టలేక పోయింది. వాళ్ళిద్దరూ హద్దులు దాటిన తనానికి ఆమెలో మరో ప్రాణం పురుడుపోసుకుంది. ఇద్దరం పెళ్లి చేసుకుందాం అని అనుకొని ఒక రోజు గుడిలో కలుద్దామని చెప్తాడు రవీంద్ర. అతను చెప్పినట్లే ఆమె గుడిలో ఎదురు చూసింది. ఎంతసేపటికీ అతను రాడు చాలాసేపటి తర్వాత అతని ఫోన్ నుండి మెసేజ్ వస్తుంది. "నీది అంటరాని కులం. మా ఇంట్లో మన పెళ్ళికి ఒప్పుకోరు. నన్ను మర్చిపో!" అని ఉంటుంది. రవీంద్రను కలుద్దామని ఆమె ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా రవీంద్ర ఆచూకీ దొరకలేదు. అరవింద జీవితం సరిదిద్దుకోలేని తప్పుగా మిగిలిపోయింది. అందుకే నేటి యువత ఊహాలలోకం నుండి బయటపడాలి. వాస్తవానికి దగ్గరలో బ్రతికితే ఇలాంటి సంఘటనలు తారసపడడం జరుగదు. ఏదిఏమైనా నేటి యువతరానికి ఈ కథ హెచ్చరిక లాంటి నిజం.

మరోకథ "కొత్త బస్టాండ్". అమాయకత్వాన్ని లేనితనాన్ని జోడించి ఆవిష్కరించారు. ఆ ఊరిలో కొత్త బస్టాండ్ నిర్మాణం జరుగుతుంది. ఆ బస్టాండ్‌లో కొత్తగా పెట్టిన "వేయింగ్ మిషన్" ఆకర్షణ. ఆ మిషన్ పై అందరూ బరువు చూసుకుని మురిసిపోతుంటే... తన బరువును చూసుకుందామని ఎన్నో రోజులుగా ఆరాటపడుతున్న ఎంకటి అనే పిల్లవాడు తనతల్లి ఇంట్లో దాచిన 5 రూపాయలు తీసుకుని వెళ్లి ఆ మిషన్‌లో రెండు రూపాయలు వేసి దానిపై నిలబడ్డాడు. అది పని చేయదు. అటు ఇటు చూసి మరో రెండు రూపాయలు అందులో వేస్తాడు. అది పనిచేయదు. అక్కడే ఉన్న స్వీపర్ కరెంట్ లేని టైంలో అది పనిచేయదు అనే విషయం చెప్తాడు. అది తెలిసి దుఃఖంతో ఇంటిదారి పడతాడు ఎంకటి.

ఇక్కడ మనం తెలుసుకోవలసింది మన సమాజంలో తినడానికి తిండి, కట్టు కోవడానికి బట్టలు లేక బాధపడేవాళ్ళు ఎందరో ఉంటారు. కేవలం రెండు రూపాయలను కూడా నోచుకోని ఎందరో ఎంకటిలాంటి బాలలు ఉన్నారు. సరైన మార్గం చూపేవారు లేక తమ తీరని కోరికల కోసం తప్పుదారి పట్టి పోతున్నారు.

ఈ కథలో వీధిబాలల గురించిన ఒక చిన్న సంఘటన ఆధారంగా కథను మలచడంలో రచయిత నేర్పు ప్రదర్శించాడు అని చెప్పవచ్చు.

దళిత జీవితాలకు అద్దంపట్టే మరో కథ "గాలివాన". కొమురయ్య చాలా పేదవాడు నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షం వల్ల ఆ ఊరి సర్పంచి ఇంటికి పనికి వెళ్ళడు. ఆ వర్షంలోనే లక్ష్మీపతినాయుడు తన గుమాస్తాతో కలిసి

**మోసపోయిన యువతి కథ "వెంటాడిన రాత్రి". ప్రేమించిన వాడికోసం కనిపెంచిన తల్లిదండ్రులను వదిలి పారిపోయి వస్తుంది భాను అనే అమ్మాయి. అతని పేరు గోపాల్. అతను ఆమెను ఒక పాడుబడిన లాడ్జ్‌కు తీసుకువస్తాడు. ఇక్కడికెందుకు అని అడిగిన ఆమెతో మీ వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు మనం ఎక్కడికెళ్ళినా పట్టుకుంటారు. అందుకే ఎవ్వరూ చూడని ఇక్కడికి తీసుకుని వచ్చాను అంటాడు.**

వ్యాసం

కొమురయ్య ఇంటికొచ్చి వాగు అవతల ఉండే ఊళ్లో ఆయన అల్లుడు కూతురు కుటుంబం ఎలా ఉందో చూసి రావాలని చెప్తాడు. ఈరోజు వాన జోరుగా కురుస్తున్నదన్నా వినకుండా కొమురయ్యను దొర నానా మాటలు అంటాడు. పోయి పరామర్శించి రాకపోతే కొమురయ్య గుడిసెను లేకుండా చేస్తానని భయపెట్టి అతను చెప్పేది కూడా వినకుండా వెళ్ళిపోతాడు.

లక్ష్మీపతి మాటలకు భయపడిన కొమురయ్య ఆ చీకట్లోనే వాగు దాటి పోదామని వంతెన మీద నడుస్తున్నాడు. పెద్ద అలవచ్చి అనుకోకుండా వంతెన తెగిపోతుంది. కొమురయ్య ప్రాణం లాక్కొని పోయి తుమ్మకంపల్లో చిక్కుకుంటుంది. ఇక్కడ దొర అతని పిల్లల జాడ తెలియకపోయేసరికి కొమురయ్యను దొర నిందిస్తాడు. అతని కుటుంబాన్ని ఎట్లా అంతం చేయాలన్న పథకం పన్నుతాడు. పై కథవల్ల దొరల పెత్తనానికి నలిగి బలైపోయే, బడుగు బలహీన వర్గాల జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది.

మరో సంచార జాతులకు చెందిన కథ "పాముల నడుమ చీమ" బాలీరు అనే వ్యక్తి సర్కస్ లో పనిచేసేవాడు. ఈ ఆధునిక కాలంలో సర్కస్ అనేది తీసి వేయడం వల్ల అతని బ్రతుకు కష్టతరం అవుతుంది.బాలీరు తన పెళ్ళాం, బిడ్డ గౌరీని తీసుకుని ఒంటెద్దు బండిమీద సామాన్లు వేసుకొని ఊరూరు తిరిగి గారడీ చేస్తూ బ్రతుకుతుంటారు. అలా తిరుగుతూ ఒక ఊరుకు వస్తాడు బాలీరు.

ఆ ఊర్లో సర్కస్ చేయాలని పర్మిషన్ కోసం పోలీసు పటేల్ హనుమంతరావు దగ్గరకు వెళ్తాడు. అతను ఒప్పుకోడు. అందువల్ల అతను తిరిగి మరో ఊరికి వెళ్ళిపోతుంటే గ్రామ ప్రజలు ఇక్కడ సర్కస్ ఆడి వెళ్లాల్సిందే అని పట్టు బడతారు. ఇప్పుడు పోలీస్‌పటేల్‌గిరి నడుస్త లేదని మేము ఉన్నాం అంతా చూసుకుంటామని ధైర్యం చెప్పి సర్కస్ మొదలుపెట్టిస్తారు. అతనికి తెలిసిన విన్యాసాలన్నీ చూపిస్తుంటాడు. చివరకు గొంతులో కత్తులు దించుకునే సమయం వస్తుంది. అప్పుడే పోలీస్ పటేల్ హనుమంతరావు వచ్చి తను ఇచ్చిన కత్తిని గొంతులో దించుకోవాలి అని గోల పెడతాడు. ఊళ్ళోవాళ్ళతో చెప్పిస్తాడు అలా చేస్తేనే ఊరినుండి పంపిస్తామంటారు. అతను తనకు తప్పింది కాదని

అతనిచ్చిన కత్తిని గొంతులో దించుకున్నాడు. అంతమంది జనాల సాక్షిగా అతని ప్రాణాలు పోతాయి.

ఈ కథ ద్వారా నేటికీ కొన్ని గ్రామాల్లో వాళ్ళ పెద్దరికం కోసం, అది నిరూపించుకోవడానికి సంచార జీవనం గడిపేవాళ్ళ జీవితాలను బలి కోరుకుంటూ ఉంటారు.

అన్ని కథలూ చదివిన తరువాత రచయిత కథల్లో స్త్రీలు మరియు దళితుల జీవితాలను కథావస్తువుగా తీసుకుని వారి తరపున నిలబడి ప్రశ్నిస్తున్నట్లుగా అనిపిస్తుంది. కథలకు శీర్షిక నిర్ణయించడంలో కూడా చాలా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తుంది. కథ ఎత్తుగడ, శిల్పం, నడక, అభివ్యక్తి, సన్నివేశకల్పన, శైలిలో ఆధునికత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

కథను కవితాత్మకంగా వర్ణించి పాఠకులకు కథలోని పాత్రలు వారి చుట్టూ తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. తప్పకుండా చదవాల్సిన పుస్తకం "అక్కన్నపేట రైల్వేస్టేషన్". ఇంకా మరెన్నో కథలు అయోధ్యరెడ్డి నుండి రావాలని కోరుకుంటూ...

కవిత

# గగన స్వరం



**వెల్మల జయపాల్ రెడ్డి, 94411 68976**

ఎక్కడిదీ రాగం
పగలూ రాత్రీ ఒకటిగా
కరుగుతున్న అంబర ద్వారం....

అనునిత్యం సాగే
జీవన పోరాటానికి భిన్నంగా
ఒక విభిన్న గగన స్వరం.....

చినుకూ చినుకూ కలిసి
నింగినీ నేలనూ కలిపిన
అనిర్వచనీయ అమృత సందేశం..

అనంత జీవన వేదంలా
ఇది ఆకాశ గంగా ప్రవాహం....
ఇది చినుకై మ్రోగుతున్న
యుగయుగాల బ్రతుకు సంగీతం

అల్లుకునే జీవనలయల హరితగీతపు
పల్లవి వర్ష రాగం
అదుపు తప్పిన జీవావరణ హననాన్ని
అడ్డుకునే ప్రకృతినయన చరణం
వర్ష గీతం..

వ్యాసం

# సాహితీశ్రేష్ఠి... డా॥ చింతలపూడి

**సూక్ష్మ పరిశీలనకు ఒక ఉదాహరణ లాంటి చింతలపూడి పరిచయం...**



డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

నిండైన రూపంకు తగ్గట్టుగానే నిజమైన సాహితీ స్రష్టగా... శిష్యసోపతుల పాలిట "నడిచే గ్రంథాలయం" అయ్యారు, ఆయనే... డా॥ చింతలపూడి వెంకటేశ్వర్లు. వృత్తిరీత్యా చిత్రకళా ఉధ్యాయుడే కానీ తను బహుముఖ ప్రజ్ఞాశాలి, చిత్రకారుడు, శిల్పి, కవి, విమర్శకుడు, వైణికుడు ఇలా ప్రతి పనిలో తన ప్రతిభాపాటవాలతో కృషిచేసిన నిరాడంబర సాహితీ సృజన కారుడు ఆయన.

ప్రకాశం జిల్లా ఇంకొల్లు వద్ద గల ఇడుపులపాడు అనే గ్రామంలో 20 ఫిబ్రవరి 1947 (పాఠశాల రికార్డుల్లో 01/ 7/ 1945)న చింతలపూడి వెంకట సుబ్బయ్య - వెంకటసుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు.

చిన్నతనం నుంచి చదువుల్లో ముందు ఉండటమే కాక తనకు ఇష్టమైన ప్రతి పనిలో స్వయంకృషితో ప్రతిభ కనబరిచే వారు. కృషి దీక్షలతో విశ్వవిద్యాలయ స్థాయి విద్యాభ్యాసంలో భాగంగా తెలుగులో మాస్టర్ డిగ్రీ పొంది, తనకు ఇష్టమైన చిత్రకళలో ఉపాధ్యాయ శిక్షణ కూడా పొందారు. తర్వాత అదే అంశంపై పరిశోధన చేయాలనే లక్ష్యంతో కాశీ వెళ్లి అక్కడి హిందూ బెనారస్ విశ్వ విద్యాలయంలో "తెలుగు సాహిత్యంపై రూపకళా ప్రభావం" అనే అంశం మీద విశిష్టమైన పరిశోధన చేసి డాక్టరేటు



పొందారు.

ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లమా కూడా చేసిన "చింతలపూడి" ఉపాధి కోసం భద్రాచలం సమీపంలోని సత్యనారాయణపురం చేరుకుని అక్కడి సీతారామ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయునిగా చేరి అటు విద్యార్థులకు చిత్రకళ పట్ల మెళకువలు నేర్పుతూనే మరో పక్క తెలుగు సాహిత్యం పట్ల ఆసక్తిని అందించేవారు.

ఆయన ఏది చెప్పినా, వ్రాసినా, ప్రామాణికంగా ఉండేది. ఏ ఇజాలకు తలవంచక తాను మెచ్చిన ప్రామాణిక సాహిత్యసేవలో తరించేవారు, తనదైన ముక్కుసూటితనంతో పాటు అంతులేని స్నేహతత్వం కూడా ఆయన సొంతం.

తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను స్పృశిస్తూ సాగిన డాక్టర్ చింతలపూడి సాహితీ ప్రస్థానం ఎక్కువగా పద్యరచనలతోను, భక్తియుత రచనల మయంగా సాగింది,

కేవలం తాను మాత్రమే వ్రాయడం కాకుండా ఇటు తన శిష్యుల్లోనూ రచనా ప్రవృత్తి పట్ల ప్రేరణ కలిగిస్తూ అటు సహచర మిత్రుల్లో కూడా సాహితీ వాతావరణం తీసుకువస్తూ రచనలు చేయించేవారు.

చర్ల కేంద్రంగా గల "గౌతమి నవ్య సాహితీ" సంస్థకు 1980 నుంచి రెండు దశాబ్దాల పాటు ప్రధాన కార్యదర్శిగా ఉండి అనేక కవిసమ్మేళనాలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడమే కాక పలు కవితాసంకలనాలు, పుస్తకాలు, ప్రచురించడానికి కారకుడయ్యారు.

చర్ల మన్నెసీమకు ఆయనో "సాహితీ తరువు"గా నిలిచారు. నిత్యం సాహితీ సేద్యంతో బోధనావృత్తితో గడిపిన చింతలపూడి కుటుంబజీవనంలో "పరిణయ పూర్వక బ్రహ్మచారి"గా జీవించారు.

చింతలపూడిలాగే వారి సాహిత్యం కూడా విశిష్టంగా ఉంటుంది. ఆయన రాసిన అనేక రచనలలో ఆదిగా ప్రచురణకు నోచుకుంది 'పద్మావతి పరిణయం' సంగీత రూపకం (1979). చింతలపూడి ఆలోచన అసాధారణంగా

వ్యాసం

భిన్నంగా ఉంటుంది. ఆయనకు వచ్చే ప్రశ్నలు చిత్రంగా ఆలోచింపజేస్తాయి. అందరూ సాధారణం గా ఆలోచించే వాటిని తను మరో కోణంతో ఆలోచించి నిజమే ఆ ఆలోచన మనకెందుకు కలగలేదు? అనిపిస్తారు.

ఆయన తొలి రచన "పద్మావతి పరిణయం"లోనే ఈ విషయం గమనించవచ్చు. లక్ష్మీదేవిని వెతుకుతూ వేంకటేశ్వర స్వామి అరణ్యంలోని పుట్టలో ఉండగా "గొల్లవాడు స్వామిని గొడ్డలితో కొట్టిన సంఘటన" గొల్లవాడు స్వామిని కొట్టాలని కొట్టలేదు కానీ స్వామి అతడిని శపించాడు. దీని ద్వారా స్వామి పాత్రకు మూర్ఖత్వం ఆపాదించబడింది. ఇది ఎంతవరకు సమంజసం?

"ఎంతో విపరీత పరిస్థితుల్లో తప్ప త్రిమూర్తులు ఎవరిని శపించలేదు కాబట్టి ఈ సంఘటన స్వామి యొక్క అపార కరుణాకటాక్షానికి విరుద్ధం కలిగిస్తుంది" అంటారు చింతలపూడి. ఇది ఆయనలోని సూక్ష్మపరిశీలనకు ఒక ఉదాహరణ.

ఈ సంగీతరూపకంలోని గేయాలన్ని తాళ నిర్ణయం చేసి పాడుకోవడానికి అనుకూలంగా సిద్ధం చేశారు. అంతేకాక దైవత్వానికి, మానవత్వానికి భంగం కలిగించకుండా కథాగమనంలో అసందర్భ సంఘటనలు రాకుండా జాగ్రత్త పడుతూ సామాన్యులకు సైతం అర్థం అయ్యేలాగా వ్రాస్తూనే .... అక్కడక్కడ కొన్ని నూతన

**చింతలపూడి తొలి రచన "పద్మావతీ పరిణయం" లోనే ఈ విషయం గమనించ వచ్చు లక్ష్మీదేవిని వెతుకుతూ వేంకటేశ్వరస్వామి అరణ్యంలోని పుట్టలో ఉండగా "గొల్లవాడు స్వామిని గొడ్డలితో కొట్టిన సంఘటన గొల్లవాడు స్వామిని కొట్టాలని కొట్టలేదు. కానీ స్వామి అతడిని శపించాడు. దీని ద్వారా స్వామి పాత్రకు మూర్ఖత్వం ఆపాదించబడింది. ఇది ఎంతవరకు సమంజసం?**

ఛందస్సులు, అలంకారాలు, ప్రయోగించి తనదైన పద్య పాండిత్యం నిరూపించుకున్నారు. ఆయన తొలి కావ్యాన్ని తన పితృదేవునికి అంకిత మీయడం ద్వారా ఆయన సాంప్రదాయత వ్యక్తం అవుతుంది.

పద్యం రాయడంలో ఎంత పరిణతి కనిపిస్తుందో, వచనం రాయడంలో కూడా అంతకన్నా మిన్నగా తన ప్రతిభ కనబరుస్తారు చింతలపూడి. దానికి సాక్ష్యం వారి "అమృతవర్షిణి" వచన కవితాసంపుటి (1981), దీనిలో మినీ కవితలు, దీర్ఘ కవితలు, బహుదీర్ఘ కవితల మేళనం జరిగింది.

దీనికి ఆప్తవాక్యం రాస్తూ కల్లూరి భాస్కర్ మన గురించి మనం ఆలోచించు కునే తీరిక ఈనాడు ఉన్నది, పారేసుకున్న విలువలను మరల పోగు చేసుకునే అవకాశం ఉన్నది. జాతీయ భావ యుగంలో అడుగు పెట్టబోతున్నాం, తెలుగు సారస్వత చరిత్రలో మరో నూతన అధ్యాయం ఆరంభించడానికి "అమృత వర్షిణి" వంటి రచనలు చక్కని ఉపకరణాలు" అన్న వాక్యాల్లో అక్షర సత్యం నిండి ఉంది.

ఈ కవితాసంపుటికి తలమానికంగా నిలిచే "కార్తీకదీపాలు" కవితలో...

కవి యొక్క భావ ప్రవాహంలో భాష - భావం రెండు ఒకదానితో ఒకటి పోటీ పడతాయి.

"ఆకాశంలో చందమామకి
కాస్తంత మబ్బుతునక అడ్డువస్తే
కొంపలు మునిగినట్లు చెంపలు
తడుపుకుంటావు
విను వీధిలో విహంగాలని
వనవీధిలో కురంగాలని
చూచి వాటి స్వాతంత్ర్యానికి
వళ్ళంతా ఈర్ష్య నింపుకుంటావు......"

అంటూ నిద్రాణమై ఉన్న స్వేచ్ఛలోని కృత్రిమత్వపు ఇనుపతెరల్ని చీల్చి చెండాడుతారు.

ఇక తాను నివసించిన మన్నె ప్రాంతపు గిరిజనుల గురించి స్పందిస్తూ "ఆటవికులు" అనే కవితలో ఆధునిక మానవజాతి కన్నా ఆదివాసుల జీవనం









వెయ్యిరెట్లు ఉత్తమం అని చెబుతూ....

"నచ్చిందనుభవిస్తూ
నచ్చంది వదిలేస్తూ
స్వేచ్ఛగా తిరిగే
ఆటవికులు
అన్ని విధాల జ్ఞానులు
నిష్కామ కర్మలు
నిష్కపట వర్తనులు..."

అంటూ ఆధునికులమని చెప్పుకుని బాబాలకు భార్యలను అప్పగించే వారి కన్నా అడవిబిడ్డలు బుద్ధిశీలురు అంటారు.

అలాగే తన స్వీయ జీవనచిత్రాన్ని తనలాంటి మరికొందరికి స్ఫూర్తిగా చూపుతూ పాఠశాలలు యజ్ఞ వేదికలు కావాలి అంటారు "డ్రాయింగ్ టీచర్ ఆవేదన" కవితలో

"భౌతిక శాంతికి వైద్యాలయం
బౌద్ధిక శాంతికి విద్యాలయం
మనశ్శాంతికి దేవాలయం
ఆత్మశాంతికి ప్రణయాలయం"

అంటూ ఆలయ వైభవాన్ని చక్కగా చమత్కరిస్తారు చింతలపూడి.

భారతదేశంలో రాజకీయ కారణాల మూలంగా స్వరాజ్యంలో "అత్యవసర పరిస్థితి" విధించబడింది నిరంకుశ పాలన పడగ విప్పింది. జాతీయ భావావేశం లో పుట్టిన "రాష్ట్రీయ స్వయంసేవక సంఘం" దానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించింది. "వందేమాతరం" పత్రిక నడిపింది, దాని నిర్వహణ బాధ్యత తీసుకున్న ఫలితంగా "చింతలపూడి" తణుకు ఉపకారాగారంలో వంద రోజులు నిర్బంధించబడ్డారు.

తనతోపాటు శిక్ష అనుభవిస్తున్న కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు ఆయనతో పాటు తెచ్చుకున్న భగవద్గీత వ్యాఖ్యాన గ్రంథాలను ఈయన చదవడమే కాదు శిక్ష పూర్తి అయ్యేసరికి తాను ఒక గీత వ్యాఖ్యాన గ్రంథం 'విజయగీత' (1982) పేరుతో ఆంధ్రానువాదం చేశారు,

"గీతాకారుడు చెరసాలలో పుడితే, గీత యుద్ధంలో పుట్టింది, అలాగే భగవద్గీత మీద వచ్చిన వ్యాఖ్యానాలు అధికం చెరసాలలోనే వ్రాయబడ్డాయట!" అంటారుకవి చింతలపూడి.

క్షణం క్షణం పొడవు తగ్గుతున్న ఈ జీవితంలో వెంటనే దాన్ని గుర్తించి, గీతా సారాన్ని గ్రహించి ఆచరించి ఆత్మను శుద్ధి చేసుకుని, విజయాన్ని సాధించు. ఆ విజయం కోసమే ఈ "విజయ గీతి" అంటూ భగవద్గీత లక్ష్యాన్ని తన వ్యాఖ్యాన ఉద్దేశాన్ని చెబుతూ, భగవద్గీత కేవలం పారాయణ కోసం కాదు, ఆచరణ కోసం అంటారు. అలాగే వీరి కలం నుంచి శ్రీ ఆంజనేయ ద్విశతి, అపరోక్షానుభూతి, వంటి పద్యకృతులు వెలువడ్డాయి.

ఆయనకు గల భిన్న ఆలోచన నుండి వెలువడిందే "అర్థశతి" (2003). 50 పద్యాలతో "రూప్యపత్రమా!" అనే మకుటంతో మనిషికి గల ఆర్థిక సంబంధాల గురించి చమత్కారంగా చెప్పారు ఇందులో. కవిబ్రహ్మ తిక్కన విరచిత "కీచకవధ" ప్రక్షిప్త- నిక్షిప్తముల గురించి చక్కని సహేతుక చర్చతో వ్రాసిన ఈ గ్రంథం "సిద్ధాంత వ్యాసాన్ని" తలపింపజేస్తుంది. దీనికి "కీచక వధ"(2014) అని నామకరణం చేశారు.

"భారతీయ విజ్ఞానం మానవుని యొక్క "కామము"కు ఒక హద్దు విధించింది. అదే మన గృహస్థ జీవనం. దానిని అతిక్రమించిన రాక్షసత్వం ఆవహించి మనిషి జీవితం మృత్యువుకి బలి కావలసి వస్తుంది" అనే సిద్ధాంత సారమే "కీచకవధాఘట్టం"గా చింతలపూడి తన "కీచకవధ" సుదీర్ఘ వ్యాసంలో పేర్కొన్నారు.

> ## చింతలపూడి
> **కేవలం తన స్వీయ రచనలకే కాక సంస్థాగతంగా వ్యవస్థాపకతంగా అనేక రచనలు వెలువడటానికి ప్రత్యక్ష, పరోక్ష సహకారాలు ఎన్నో చేశారు. ఎక్కడ నామమాత్రంగా కూడా తన పేరు పెట్టుకోకుండా అనేక పద్య, వచన రచనలు సంస్కరించడం, ప్రచురించడం, అవసరాన్ని బట్టి తిరిగి వ్రాయడం, చేసిన అజ్ఞాత, నిరాడంబర, సాహితీ సేవకుడు చింతలపూడి.**

ఆయన కేవలం తన స్వీయరచనలకే కాక సంస్థాగతంగా వ్యవస్థాపకతంగా అనేక రచనలు వెలబడటానికి ప్రత్యక్ష, పరోక్ష, సహకారాలు ఎన్నో చేశారు. ఎక్కడ నామమాత్రంగా కూడా తన పేరు పెట్టుకోకుండా అనేక పద్య, వచన రచనలు సంస్కరించడం, ప్రచురించడం, అవసరాన్ని బట్టి తిరిగి వ్రాయడం, చేసిన అజ్ఞాత, నిరాడంబర, సాహితీ సేవకుడు చింతలపూడి.

ఆయన సంపాదకత్వంలో "నవ స్వరాలు", ఖాదర్ బాబా చరిత్ర, చైతన్య భారతి మొదలైన పుస్తకాలు వెలువడ్డాయి. అంతేగాక అనేక సాహిత్యవ్యాసాలు, విమర్శనాత్మక వ్యాసాలు, కథలు, కవితలు, సమీక్షలు, ఆకాశవాణి ప్రసంగాలు, సాయిబాబా నాటకం వీరి కలం నుంచి వెలువడ్డాయి.

2003లో తన ఉద్యోగ జీవితం నుంచి విశ్రాంతి పొందిన డా॥ చింతలపూడి వెంకటేశ్వర్లు, తన విశ్రాంత జీవితం మొత్తం తమ కుటుంబదైవం "వాసవీ మాత"కు సంబంధించిన సంపూర్ణ విషయ విశేషాలు సంపాదించి శక్తియుక్తులు, వడ్డీ ఆర్థికభారం కూడా మోసి "వాసవీ పురాణం" అనే బృహత్కావ్యం విజయవంతంగా పూర్తి చేసి సంతృప్తి చెందారు.

ఈ కాలపు అపర మేధావి, బహుముఖ కృషీవలుడు అయిన "చింతలపూడి" తన జన్మస్థలం ఇడుపుల పాడులోనే 30 ఆగస్టు 2021న, సహజ మరణంతో తనువు చాలించారు. ఈ నిరాడంబర సాహితీమూర్తి ఎవరి నుంచి ఎలాంటి అవార్డులు పురస్కారాలు ఆశించలేదు, సరికదా సాధారణ సన్మా నాలను కూడా సున్నితంగా తిరస్కరించే వారు "అవార్డుల కన్నా అక్షర కృషి మిన్న" అని మనసారా నమ్మిన చింతలపూడి సాహితీ సేవలు సదాస్మరణీయం.

*(30 ఆగష్టు చింతలపూడి తొలి వర్ధంతి సందర్భంగా....)*

వ్యాసం

# శాంతిదూత మన బాపూజీ!

**రేపటి పౌరులకు అమృతానందించిన పత్తిపాక మోహన్...**



డా॥ వెల్దండి శ్రీధర్
98669 77741

కవి, రచయిత, విమర్శకులు, పరిశోధకులు, బాల సాహితీవేత్త, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ తెలుగు విభాగం సంపాదకులు డా. పత్తిపాక మోహన్ రచించిన 'బాలల తాతా బాపూజీ' అనే పుస్తకానికి ఈ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమి, బాల సాహిత్య పురస్కారం లభించింది. మోహన్ ఇప్పటికే పిల్లల కోసం మన కవులు, చందమామ రావే, వెన్న ముద్దలు, ఆకుపచ్చని పాట, అఆ ఇఈ, పిల్లల కోసం సినారె కథ, మూడు పిల్లల కథలు తదితర 11 బాల సాహిత్య పుస్తకాలను రచించారు. 14 బాల సాహిత్యం పుస్తకాలను సంకలనం చేశారు. 28 బాల సాహిత్యం పుస్తకాలను ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదం చేశారు. సిరిసిల్ల నుండి డా. సి. నారాయణరెడ్డి మాత్రా ఛందస్సు వారసత్వాన్ని అందిపుచ్చుకొని పిల్లల మామయ్యగా అనేక బాల గేయాలను రచించారు. మన జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర సాహిత్య అకాడమి, బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన 'బాలల తాతా బాపూజీ' అనే ఈ పుస్తకాన్ని 2020లో వెలువరించారు. ఆరు నుండి పన్నెండు సంవత్సరాల పిల్లలు పాడుకునే విధంగా రాసిన ఈ పుస్తకంలో రెండు విభాగాలున్నాయి. మొదటి భాగం గాంధీ గేయాలు, రెండవ భాగం గాంధీ గేయకథ. మాత్రా ఛందస్సులో రాయబడిన ఇందులోని గేయాలను పిల్లలు స్వయంగా పాడుకొని ఆనందించవచ్చు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంలో ఇప్పటి పిల్లలు గాంధేయ వాదం గురించి, గాంధీ తత్త్వం గురించి, గాంధీ వ్యక్తిత్వం గురించి, గాంధేయ మతం గురించి, భారత స్వాతంత్ర్య పోరాటాన్ని అహింసా మార్గంలో ముందుండి నడిపించిన విధానం గురించి తెలుసుకోవడానికి ఈ



**స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంలో ఇప్పటి పిల్లలు గాంధేయ వాదం గురించి, గాంధీ తత్త్వం గురించి, గాంధీ వ్యక్తిత్వం గురించి, గాంధేయ మతం గురించి, భారత స్వాతంత్ర్య పోరాటాన్ని అహింసా మార్గంలో ముందుండి నడిపించిన విధానం గురించి తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది.**




పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది.

మనం ప్రతి సంవత్సరం జెండా పండుగ చేసుకోవడానికి వెనుక ఎంత పోరాటం ఉందో పిల్లల మనస్సులకు హత్తుకునే విధంగా చెప్తాడు రచయిత. గాంధీజీ త్యాగశీలం, పోరాట పటిమ, అహింసా మార్గం, సత్యాగ్రహం, ధర్మమార్గం, మౌనంగానే ఆంగ్లేయుల గుండెల్లో ఫిరంగుల్ని పేల్చిన విధానం, మతసామరస్యం, విదేశీ వస్తు బహిష్కరణ, శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం ఇలా గాంధీజీ వ్యక్తిగత జీవితం, స్వాతంత్రోద్యమ ప్రస్థానం అంతా కరతలామలకం ఈ పుస్తకంలో. గాంధీజీ నిరాడంబరత, సత్యదీక్ష, చదువు కోసం పడిన తపన, దక్షిణాఫ్రికాలో తెల్లవారితో పోరాడిన తీరు, అక్కడే కనుగొన్న సత్యాగ్రహ శాంతియుత పోరాటం ఇలాంటి ఎన్నో గొప్ప గుణాలు పిల్లలకు ఆదర్శం, అనుసరణీయం.

"జోతలివే అందుకొనుము/
గాంధీతాత
భరతజాతికంతటికీ/స్ఫూర్తి
ప్రదాత
శిరమెత్తిన స్వేచ్ఛకు/నీ
పిలక ప్రతీక
నీ బోసి నవ్వే కదా/
భరతజాతి జ్ఞాపిక"

భారతీయ సాహిత్యంపైన గాంధీజీ ప్రభావం ఎనలేనిది. ఆనాటి అమాయక, నిరుపేద దేశ జనాభాను, ఆంగ్లేయుల ఆయుధ సంపత్తిని దృష్టిలో పెట్టుకొని గాంధీజీ భారతదేశానికి, ఇక్కడి ప్రజల మితమైన చైతన్యానికి తగిన పోరాట మార్గాన్ని ఎన్నుకున్నారు. అందుకే ఆయన మార్గం అనన్య సామాన్యం. ఆలోచనా త్మకం. దక్షిణాఫ్రికా నుంచి దండి మార్చ్ దాకా ఆయన తీసుకున్న పోరాట పద్ధతులు ప్రపంచ పోరాటాలకు అందించిన గొప్ప కానుకలు. గాంధీజీ లాంటి అహింసాజీవి భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వ పాత్ర పోషించకపోయి ఉండకపోతే స్వాతంత్ర్యోద్యమ స్వరూపం మరింత భిన్నంగా ఉండేది. అంటే హింసా మార్గంలో ముందుకుపోయి ఎంతో మంది ప్రాణాలను తీసేది. అయినా మూడున్నర లక్షల మంది భారత స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసారంటే ఆనాటి స్వాతంత్ర్య వీరుల స్వేచ్ఛాకాంక్ష ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

"సబర్మతి మౌనివి/సహకార జ్యోతివి
చేయి చేయి కలిసి/సాగాలని చాటితివి
మానవులను నడిపించగ మహిలోన
వెలసితివి
శాంతియుద్ధ వీరునివి/సత్యధర్మ
మార్గానివి"

స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, అహింస వంటి ఆయుధాలు ఈనాటికీ ప్రపంచానికి గొప్ప ఆయుధాలుగానే ఉపయోగపడుతున్నాయి. మౌనాన్ని మించిన ఆయుధం, శాంతిని మించిన పోరాట మార్గం ఈ లోకంలోనే ఏదీ లేదు. ఆనాటి భారత ప్రజల అమాయకత్వం, నిరక్షరాస్యత, పేదరికాన్ని, భారతదేశ సామాజిక పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేసిన గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం ఎలా ఉండాలో పోరాడి చూపించాడు. ఆయన మౌనానికి, శాంతియుత మార్గానికే ఆంగ్లేయ ప్రభుత్వం వణికిపోయింది. ప్రజాక్షేత్రంలో అరెస్టు చేసి జైల్లో పెట్టినా అక్కడ కూడా గాంధీజీ తాను అనుకున్న పోరాట మార్గాన్ని పాటించి చూపాడు. దీనితో దిమ్మతిరిగిన ఆంగ్లేయ ప్రభుత్వం దిగి వచ్చింది. మౌనంతో, శాంతితో సాధించలేని విజయాలేమీ లేవని శాంతియుద్ధ వీరుడైన గాంధీజీ చాటి చెప్పాడు.



"సక్రమంగ నిర్వహిస్తె/ప్రతిగ్రామం
ఆదర్శం
పరిసరాలు శుభ్రమైతె/పల్లెసీమయే
స్వర్గం
పాడిపంట వర్ధిల్లితె/ అన్నపూర్ణ ఆ దేశం
పల్లెలు సమృద్ధిగుంటె/అదే
రామరాజ్యం"

'గో బ్యాక్ టు విలేజెస్' అన్నాడు గాంధీజీ. పల్లెలు పచ్చగుంటేనే దేశం పచ్చగుంటుందని ఆనాడే చెప్పాడు. కాని మనం పల్లెల్ని విధ్వంసం చేసుకుంటూ వస్తున్నాం. గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యానికి పట్టుగొమ్మలన్నాడు.

వ్యాసం

గాంధీజీ చూపిన మార్గంలో, గాంధీజీ కలలుగన్న ఆశయాల ప్రకారం నడవడం ఈ దేశానికి ఎప్పటికీ సవాలే.

"సత్యమునే పలకాలను/తల్లిమాట వేదంగా

బాల్యంలోనే ఆచరించి/ఉత్తమంగ నిలిచెను

పదేండ్ల పసి ప్రాయంలో/అస్పృశ్యత నెదిరించెను

పాకీపని వారి నేల/తాకొద్దని ప్రశ్నించెను"

గాంధీజీ తల్లిమాటకెంతో విలువనిచ్చినవాడు. అందుకే మరణందాకా అదే మాట మీద నిలబడ్డాడు. ఈనాటి పిల్లలెంతో మంది అలవర్చుకోవాల్సిన మంచి లక్షణం. పదేళ్ల వయసులోనే అంటరానితనాన్ని ప్రశ్నించి తిరుగుబాటు ప్రదర్శించాడు. గాంధీజీపైన సత్యహరిశ్చంద్ర నాటకం యొక్క ప్రభావం అందరికీ తెలిసిందే. పాఠశాలలో విద్యాధికారి తనిఖీకి వచ్చినపుడు గాంధీజీ ఒక పదాన్ని తప్పుగా రాస్తే వెంటనే ఆయన గురువు పుస్తకంలో చూసి సరిగా రాయమని చెప్పాడు. అలా చూసి రాయడం తప్పని ససేమిరా చూసి రాయడానికి ఒప్పు కోలేదు. గాంధీజీ జీవన ప్రయాణమంతా ఆదర్శనీయమే. ఆ తరువాత బారిష్టర్ చదువు కోసం ఇంగ్లాండ్ వెళ్లినపుడు కూడా బేచర్జీ మాట ప్రకారం మద్యం, మాంసం, మహిళను తాకనని మాట ఇచ్చాడు. దక్షిణాఫ్రికాలో గాంధీజీని రైలు నుంచి గెంటివేసినపుడు ఉద్యమించి అక్కడి నల్ల చట్టాలను ప్రశ్నించాడు. అదే స్ఫూర్తితో భారతదేశంలో కూడా ఆంగ్లేయుల చట్టాలను ఎదిరించాడు. భరతమాత దాస్యశృంఖలాలను పటాపంచలు చేయడానికి పూనుకున్నాడు. దేశంలోని సామాన్య ప్రజలకు సరైన బట్టలు లేవని ఈ దేశం ఇంకా ఎంతో మారాలని, దేశ సంపద అందరికీ సమానంగా చేరాలని సూచించడానికి దేహం పైన బట్ట లేకుండా కేవలం కౌపీనం మాత్రమే కట్టుకొని దేశ స్వాతంత్ర్యోద్యమంలో పల్లె పల్లె తిరిగి

**స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, అహింస వంటి ఆయుధాలు ఈనాటికీ ప్రపంచానికి గొప్ప ఆయుధాలు గానే ఉపయోగపడు తున్నాయి. మౌనాన్ని మించిన ఆయుధం, శాంతిని మించిన పోరాట మార్గం ఈ లోకంలోనే ఏదీ లేదు. ఆనాటి భారత ప్రజల అమాయకత్వం, నిరక్షరాస్యత, పేదరికాన్ని, భారతదేశ సామాజిక పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేసిన గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం ఎలా ఉండాలో పోరాడి చూపించాడు.**

ప్రజలను కదిలించాడు. ఈ పరిణామమంతా ఈ పుస్తకంలో కళ్లకు కట్టినట్టు చూపించాడు రచయిత.

నీలిరంగు రైతుల పక్షాన నిలిచి పోరాడడం, దళిత జనోద్ధరణ, రాట్నం వడికి నూలు తీయడం వంటి ఎన్నో దృశ్యాలు పిల్లల మనసులో నిలిచేటట్టు రాయడంలో రచయిత నైపుణ్యం తెలుస్తుంది.

"బాలల తాతా బాపూజీ/బంగరు నేత బాపూజీ

బోసి నవ్వుల బాపూజీ/పిల్లల పాపల బాపూజీ

శాంతి దూతవు బాపూజీ/క్రీస్తు ఏసువు బాపూజీ

కరుణా సాంద్ర బాపూజీ/ఖద్దరు నేతవు బాపూజీ"

ఈ గేయంలోని ధార పిల్లలను ఎంతో ఆకర్షిస్తుంది. పిల్లలకు అంత్యానుప్రాస అలంకారంలో చెప్తే ఎంతో ఇష్టం. అలాంటి గేయాలు తొందరగా వాళ్ల నాలుక మీదికెక్కి నాట్యం చేస్తాయి. డా. పత్తిపాక మోహన్‌కు పిల్లల మనస్తత్వం, గేయంలోని మెళకువలు, మాత్రా ఛందస్సు మేజిక్కు, విషయ సాంద్రత, సరళమైన భాషా ప్రయోగం తెలుసు కాబట్టే ఈ పుస్తకంలో గేయాలన్నీ ఎంతో ఆహ్లాదంగా చదువుకోవడానికి వీలుగా ఉన్నాయి. కథాగేయాల్లో ప్రధానంగా ఎంతో బరువైన విషయాన్నైనా సౌమ్యంగా చెప్పటం కనిపిస్తుంది. గాంధీ గేయ కథలో గాంధీజీ పుట్టుక నుండి మరణం దాకా మహాత్ముని బాల్యం, యౌవనం, చదువు, ఉద్యోగం, దక్షిణాఫ్రికా పయనం, స్వాతంత్ర్యపోరాటం, నాథూరాం గాడ్సే తుపాకీతో కాల్చి చంపడం, ఆయన అందించిన స్ఫూర్తి అన్ని సంఘటనలను చిన్న చిన్న పదాలలో పొదిగి చెప్పటం అబ్బురపరుస్తుంది.

బాలగేయాల ప్రధాన లక్షణం నదీ సదృశ నడక. వేయి పుటల వచనంలో చెప్పలేనిది బాలగేయ రచయితలు ఒక్క గేయంలో చెప్పి విషయాన్ని బాలల మెదళ్ళు అలసిపోకుండా అందించ గలుగుతారు. 'బాలల తాతా బాపూజీ' అనే ఈ పుస్తకం కూడా అలా బాలలకు ఏ మాత్రం అలసట రాకుండా గాంధీజీ జీవిత కథనంతా సున్నితంగా చెప్పిన గ్రంథం. ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ బాబు దుండ్రపల్లి వేసిన ముఖచిత్రం, కూరెళ్ల శ్రీనివాస్ వేసిన లోపలి బొమ్మలు. పిల్లల పుస్తకాలంటేనే అక్షరాలు తక్కువ, బొమ్మలెక్కువ ఉండాలి. రచయిత ఆ జాగ్రత్త పాటించడం వలన అల్పాక్షరాల్లోనే అనల్పార్థం సాధింపబడింది. గేయాన్ని నడపడమంటే ఏనుగును నడపడమంత కష్టం. డా. పత్తిపాక మోహన్ 'తెలుగులో గజల్ సాహిత్యం' పై పరిశోధన చేయడం వల్ల కావచ్చు గేయ లక్షణాలను, మాత్రా ఛందస్సు మార్మికతను పట్టుకొని అద్భుతమైన బాల సాహిత్యాన్ని సృజిస్తున్నారు. బాల సాహిత్యం సృష్టించడం పిల్లలాట కాదు. దానికెంతో ఓర్పు, నేర్పు, సరళమై భాషాప్రయోగ సామర్థ్యం అవసరం. అన్నిటిని మించి పిల్లల స్థాయికి దిగి రాయడం అంత సులభం కాదు. ఈ పనిని ఎంతో శ్రద్ధగా, బాధ్యతగా, కళాత్మకంగా చేస్తోన్న మోహన్ కృషి అభినందనీయం. రేపటి పౌరులకు అమృతోత్సవం.

**(పత్తిపాక మోహన్ రచించిన "బాలల తాతా బాపూజీ" పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించిన సందర్భంగా...)**



## సృజనకు పదును పెట్టేదే అసలైన విమర్శ...

సాహిత్యాన్ని సన్మార్గంలో నడిపించేది, మార్గనిర్దేశం చేసేది అసలైన విమర్శగా నిలిచిపోతుందని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. రచయిత్రి ఉప్పల పద్మ రాసిన ఆకు రాయి విమర్శ పుస్తక పరిచయ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నల్లగొండలోని యుటిఎఫ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విశేషించి మహిళలు విమర్శ రంగంలో రాణించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. 2017 ప్రపంచ మహాసభల అనంతరం తెలుగు సాహిత్యంలో అనేక నూతన రచయితలు వెలుగులోకి వచ్చారు అన్నారు. సాహిత్యం సమాజ శ్రేయస్సు కాంక్షించేదిగా ఉత్తమ సమాజాన్ని నిర్మించేదిగా ఉండాలి అన్నారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ ఉప్పల పద్మ సహేతుకమైన విమర్శ దృక్పథంతో ఆకురాయి రచించారన్నారు. డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి మాట్లాడుతూ కవయిత్రిగా, కథకురాలిగా, విమర్శకురాలిగా ఉప్పల పద్మ బహుముఖీనమైన కృషి చేస్తున్నారు అన్నారు. ఐబీసీ డైరెక్టర్ ఏచూరి శైలజ మాట్లాడుతూ సరళంగా సూటిగా ఉన్న ఆకురాయి వ్యాసాలు పాఠకులలో ఆలోచనలు రేకెత్తిస్తాయన్నారు డాక్టర్ మండల స్వామి ఆకురాయి పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెల్లి యాదయ్య, మాదగాని శంకరయ్య, అంబటి వెంకన్న బండారు శంకర్ సాగర్ల సత్తయ్య చిలుకూరి మధు, ఎన్ సీ రోజా దేవి, ఎడ్ల సైదులు ఏబూసి నరసింహ రామకృష్ణ రవీందర్ వాణి నాగమణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ బాబుకు వానమామలై వరదాచార్యుల అవార్డు

ఆగస్టు 23 2022లో తెలంగాణ సారస్వత పరిషత్తు లో తెలంగాణ ప్రభుత్వ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్ బాబుకు వానమామలై వరదాచార్యుల అవార్డు ప్రధానం జరిగింది ఈ సభకు అధ్యక్షులుగా వ్యవహరించిన పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి ఈ బహుమతికి శ్రీధర్ బాబు పూర్తిగా అర్హులు అని పేర్కొన్నారు పరిషత్తు కార్యదర్శి జె చెన్నయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు అయాచితం తనకు ఈ పురస్కారం రావడం చాలా సంతోషం కలిగిస్తుందని పేర్కొన్నారు తర్వాత రామారావు వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.



## ఘనంగా బృహత్ కవి సమ్మేళనం



16 ఆగస్టు 2022న తెలంగాణ సాహిత్య అకాడమీ భాష సాంస్కృతిక శాఖ సంయుక్తంగా బృహత్ కవి సమ్మేళనాన్ని నిర్వహించింది. ప్రారంభ సభకు రాష్ట్ర సాంస్కృతిక శాఖా మాత్యులు శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేయగా తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్, కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మొదలైన వాళ్లు పాల్గొన్నారు. ఈ సభకు మొదటి కవితాగాన కర్తగా కాళోజి అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ పాల్గొన్నారు. మూడు కవి సమ్మేళనాల్లో వరుసగా రూప్‌కుమార్ డబ్బీకార్ దాస్యం సేనాధిపతి కాంచనపల్లి గోవర్ధన్ రాజు అధ్యక్షులుగా వ్యవహరించారు. కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి కెపి అశోక్ కుమార్ సమన్వయకర్తలుగా ఉన్నారు. 75 మంది కవులు పాల్గొన్న ఈ కవి సమ్మేళనం ఒక చారిత్రక రికార్డ్ అని పలువురు అభిప్రాయపడ్డారు.

# విజయవంతంగా....
# "భావి గళాలు - జాగృత కలాలు" బృహత్ కవి సమ్మేళనం






స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 500 మంది బాలకవులతో నిర్వహించిన "భావి గళాలు - జాగృత కలాలు" బృహత్ కవి సమ్మేళనం విజయవంతంగా జరిగింది. ఆగస్టు 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 500 మందితో అనుకుంటే 650 కి పైగా బాల కవులు వివిధ జిల్లాల నుండి ఈ సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ భాషలలో బాలకవులు తమ దేశభక్తియుత కవితలను చదివి వినిపించారు. కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రూపకల్పన చేసినందుకు పలువురు అతిథులు అభినందించారు. ఆగస్టు 16 నాడు సామూహిక జాతీయ గీతాలాపనతో ఈ బృహత్ బాల కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాచారం గ్రామ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షేక్ రిజ్వానా కవిత "స్వాతంత్ర్య శిఖరం"తో ఈ బృహత్ కవి సమ్మేళనం ప్రారంభమైంది. పదవ తరగతి చదువుతున్న రిజ్వానా 102 ఆటవెలది పద్యాలతో "రిజ్జు శతకం" రచించింది. షేక్ రిజ్వానాను ఆమె తండ్రిని, గురువు కన్నెగంటి వెంకటయ్య లనూ వేదిక ఘనంగా సన్మానించింది.

ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశానికి తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ కాంచనపల్లి అధ్యక్షులుగా వ్యవహరించగా ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి మరియు ఘనపురం దేవేందర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. తర్వాత జరిగిన అన్ని సభలకు ఘనపురం దేవేందర్ వ్యాఖ్యాతగా, నవీన్ ఆచారి సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రారంభ సమావేశంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో జాగృతి సాహిత్య విభాగం జిల్లా కన్వీనర్ తిరుమల శ్రీనివాస్ ఆర్య ఆధ్వర్యంలో "నెల నెలా కవితా యజ్ఞం" పేరిట 120 పాఠశాలలో నిర్వహించిన కవిత్వ కార్యశాలలు ఈ బృహత్ కవి సమ్మేళనానికి స్ఫూర్తి అని అన్నారు. అధ్యక్షులు శ్రీమతి కవిత ప్రోత్సాహంతో గత 9 ఏండ్లుగా జాగృతి నిర్వహించిన ఈ కవిత్వ వర్క్ షాప్ లు ఎంతో మంది విద్యార్థులను కవిత్వం వైపు మళ్లించాయని అన్నారు.




ఈ బృహత్ కవి సమ్మేళనంలో పాల్గొన్న బాల కవులను జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రం తో సన్మానించారు. మూడు రోజుల పాటు సారస్వత పరిషత్తు ప్రాంగణం పిల్లలతో, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, సాహితీ అభిమానులతో కిటకిటలాడింది. వచ్చిన వారందరికీ చక్కని భోజనం అందించారు తెలంగాణ జాగృతి బాధ్యులు.

కార్యక్రమ ముగింపు సమావేశానికి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరవగా తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ జాగృతి ఉపాధ్యక్షులు మేడె రాజీవ్ సాగర్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ తెలంగాణ సాహితీ ప్రస్థానంలో ఈ బృహత్ బాలకవి సమ్మేళనం ఒక మైలురాయని అన్నారు. నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతిని, అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఈ సందర్భంగా గౌరీశంకర్ అభినందించారు. ఈ వజ్రోత్సవాల వేడుకలలో స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తిని గుర్తు చేసుకోవడం అవసరమని అన్నారు. స్వతంత్ర భారతావనిలో ముంచుకొస్తున్న విద్వేష ముప్పును ప్రజలు సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షులు గుండం మోహన్ రెడ్డి, మంచాల వరలక్ష్మి, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను, ప్రముఖ కవయిత్రులు అయినంపూడి శ్రీలక్ష్మి, జ్వలిత, రాష్ట్ర నాయకులు కుమార స్వామి, జాగృతి రాష్ట్ర కార్యదర్శి విక్రాంత్ రెడ్డి, వివిధ జిల్లాల జాగృతి అధ్యక్షులు పర్స చంద్రశేఖర్, అనంతుల ప్రశాంత్, అర్చన సేనాపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ

డా॥ ఎం. దేవేంద్ర
సెల్ : 949068247

శ్రీచందన మారోజు పబ్లికేషన్స్
వెల : రూ.400/-




## చెలిమెలు - కవిత్వం

శ్రీరామోజు హరగోపాల్
సెల్ : 99494 98698

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
ప్రజాశక్తి బుక్ హౌస్




## శ్రమ పొదుగు - కవిత్వం

యరకల యాదయ్య
సెల్ : 9866468979

పాలపిట్ట బుక్స్
హైదరాబాద్
వెల : రూ.100/-




## నానీల మణిహారం

డా॥ ఎం. దేవేంద్ర
సెల్ : 949068247

పబ్లికేషన్స్
వెల : రూ.50/-




## కీర్తి కండూతి (నాటకం)

పల్లెర్ల రామమోహన రావు
మహబూబ్‌నగర్
సెల్ : 91778 40278




## సైనికార్చన

అవుసుల భానుప్రకాశ్
సంగారెడ్డి
సెల్ : 96032 04507

వెల : రూ. 135/-




## భాగవత నీతి పద్యములు

పల్లెర్ల రామమోహన రావు
మహబూబ్‌నగర్
సెల్ : 91778 40278




## అవాల్మీకములు

పల్లెర్ల రామమోహన రావు
మహబూబ్‌నగర్
సెల్ : 91778 40278




## చరిత్రలో కసుమ ధర్మన్న

వి. చెంచయ్య
నెల్లూరు, ఆంధ్రప్రదేశ్
94406 38035

వెల : రూ.30/-



కవి, తొలితరం తెలంగాణ కథకుడు, అభ్యుదయవాది,

## పొట్లపల్లి రామారావు

(వర్ధంతి : సెప్టెంబర్ 10, 2001)